


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




ఆదివారం | 19-5-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 50 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి మ. 1.50 తదుపరి ద్వాదశి; నక్షత్రం: హస్త తె. 3.16 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.9.47-11.35; దుర్ముహూర్తం: సా.4.54-5.46; అమృతఘడియలు: రా.8.32-10.20; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జ్యోతిరాదిత్య ప్రణీత

## ఏపీ-తెలంగాణకు సగం.. సగం

టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో ర్యాంకుల తీరిది

టాప్-10లో 16మంది అబ్బాయిలే

అగ్రి-ఫార్మసీ, ఇంజనీరింగ్‌లో టాపర్లుగా ఏపీకి చెందిన ప్రణీత, జ్యోతిరాదిత్య

వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్: బుర్రా

7 రోజుల్లో ఫలితాలు వెల్లడించిన అధికారులకు ప్రశంసలు

హైదరాబాద్/సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎస్ ఎప్‌సెట్ ఫలితాల్లో టాప్-10 ర్యాంకులను ఏపీ, తెలంగాణ విద్యార్థులు సమానంగా పంచుకున్నారు. ఇంజనీరింగ్, అగ్రి-ఫార్మసీ విభాగాల్లోని తొలి పది ర్యాంకుల్లో తెలంగాణ, ఏపీకి చెందిన విద్యార్థులకు ఐదేసి ర్యాంకులు దక్కాయి. అయితే, రెండు విభాగాల్లోనూ ఏపీకి చెందిన విద్యార్థులే టాపర్లుగా నిలిచారు. ఇంజనీరింగ్‌లో ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఆలూరు ప్రణీత మొదటి ర్యాంకులు సాధించారు. రాష్ట్రంలోని సికింద్రాబాద్‌కు చెందిన రిషి శేఖర్ శుక్లా ఇంజనీరింగ్‌లో 3వ ర్యాంకు, హనుమకొండ జిల్లాకు చెందిన గడ్డం శ్రీవర్షిణి అగ్రి-ఫార్మసీలో 3వ ర్యాంకు సాధించారు. టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో అబ్బాయిలు సత్తా చాటారు. తొలి పది ర్యాంకులను పరిశీలిస్తే ఇంజనీరింగ్‌లో 9 మంది, అగ్రికల్చర్-ఫార్మసీలో ఏడుగురు (మొత్తం 16 మంది) అబ్బాయిలే

మిగతా 9వ పేజీలో...

### కేబినెట్ భేటీకి అనుమతి కోసం..

# మంత్రులంతా ఢిల్లీకి

**ఎన్నికల సంఘాన్ని కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై సీఎంకు వినతిపత్రమిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

- ఈసీ అనుమతి లేక శనివారం ఆగిన సమావేశం
- రోజంతా సచివాలయంలో మంత్రుల నిరీక్షణ
- రాత్రి వరకు ఈసీ స్పందించకపోవడంతో ఇంటికి
- సోమవారమూ ఎదురుచూసి.. తర్వాత చలో ఢిల్లీ
- రైతు సంక్షేమం, కీలకాంశాలపై చర్చించాలనుకున్నాం
- నిర్ణయాలు తీసుకుంటామని చెప్పలేదు: సీఎం

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సత్వరం పరిష్కరించాల్సిన సమస్యల గురించి చర్చించేందుకు మంత్రివర్గ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాళేశ్వరం తదితర కీలక అంశాలపై చర్చించేందుకు ఈసీ అనుమతిస్తుందన్న నమ్మకంతో శనివారం మధ్యాహ్నం నుంచి సచివాలయంలో ఎదురు చూసిన రాష్ట్ర మంత్రులకు చివరకు నిరాశే ఎదురైంది. దాంతో మంత్రివర్గ సమావేశం నిర్వహించకుండానే రాత్రి 7 గంటలకు వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో సోమవారం వరకు ఎన్నికల సంఘం అనుమతి కోసం ఎదురు చూస్తామని, అప్పటికీ అనుమతి రాకపోతే మంత్రివర్గమే ఢిల్లీకి వెళ్లి ఈసీని కలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారమే వెళ్తారా? అన్న విషయం స్పష్టం చేయలేదు. తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అనుమతి కోరామని రేవంత్ వెల్లడించారు. మధ్యాహ్నం నుంచి

మిగతా 11వ పేజీలో...

### బ్యారేజీల అధ్యయనం, మరమ్మతులు ఏకకాలంలో!

- నెలలో పూర్తి చేద్దామంటున్న అధికారులు
- మూడు బ్యారేజీల బాధ్యత 3 కేంద్ర సంస్థలకు
- రేవంత్ నేతృత్వంలోని భేటీలో నిర్ణయం
- రిపేర్ల ఖర్చు నిర్మాణ సంస్థలే భరించాలి
- సర్టిఫికెట్లిచ్చినా నిర్మాణం పూర్తికానట్లే లెక్క
- సీఎం స్పష్టీకరణ.. వారంలో కాళేశ్వరానికి

11

### మరమ్మతు చేసినా 7వ బ్లాక్‌కు గండమే

ఎన్‌డీఎస్ఏ కూడా అదే చెప్పింది

మంత్రి ఉత్తమ్




## సుచిత్రలో ఉద్రిక్తత

1.11 ఎకరాల భూమి వ్యవహారంలో గొడవ

మాజీ మంత్రి మల్లారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిపై కేసు

వివాదాస్పద స్థలంపైకి కోర్టు పత్రాలతో 16 మంది..

షెడ్లు, సీసీ కెమెరాల తొలగింపు.. ప్రహరీలో కొంత ధ్వంసం

రాజశేఖర్‌రెడ్డి, కొడుకు భద్రారెడ్డితో కలిసి మల్లారెడ్డి రాక

ఇరువర్గాల తోపులాట.. చేయిచేసుకున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

14

## అపార్టుమెంట్ల పేరుతో మోసం

- తక్కువ ధరకే ఫ్లాట్లు అంటూ ప్రచారం
- ప్రీ లాంచ్ ఆఫర్ కింద 60 కోట్లు వసూలు
- ఆపై ముఖం చాటేసి.. స్థలం విక్రయం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- భారతి బిల్డర్స్ చైర్మన్, ఎండీ, సీఈవో అరెస్టు

# స్థానికానికి రిజర్వేషన్ల సెగ

### జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలంటున్న బీసీలు

మొత్తం రిజర్వేషన్లు 50% దాటొద్దని సుప్రీం ఆదేశాలు.. ఎస్సీ, ఎస్టీలకు పోను బీసీలకు ఎంత శాతమనే ప్రశ్నలు

పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసిన గత సర్కార్.. ఎలా వెళ్దామనే యోచనలో ప్రస్తుత ప్రభుత్వం

జూన్ చివర్లో ఎన్నికలంటే కులగణన పూర్తవుతుందా?.. ఒకవేళ అయినా రిజర్వేషన్లు 50% మించితే మరో చిక్కు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ రిజర్వేషన్ల అగ్గి రాజుకుంది. స్థానిక సంస్థల్లో ఏ సామాజికవర్గానికి ఎంత శాతం రిజర్వేషన్ కేటాయిస్తారన్న చర్చ మొదలైంది. మొత్తంగా అన్ని కులాలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఉండగా.. ఇందులోనే ఎస్సీలు, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం కల్పించాల్సి ఉంటుంది. మిగిలిన శాతాన్ని బీసీలకు కేటాయించాల్సి ఉంది. దీంతో బీసీలకు తక్కువ శాతం దక్కుతోందన్న అభిప్రాయాలున్నాయి. వాస్తవానికి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు కేటాయించాలనే డిమాండ్ ఏళ్ల తరబడి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈసారి నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల విషయం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను వర్తింపజేయాలా? లేక కులగణన చేపట్టి ఆ వివరాలు తేలిన తరువాత ఎన్నికలు నిర్వహించాలా? అని సర్కారు యోచిస్తోంది. కానీ, వచ్చే జూన్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అయితే ఎన్నికలు నిర్వహించాలంటే.. ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్ల శాతం పరిధి మించకుండా కేటాయిస్తూ ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. బీసీలకు కూడా జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ బలంగా ఉన్నా.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఓబీసీ రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కేతః కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు




గవాళి కేసులో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ సర్కారు.. బీసీల రిజర్వేషన్‌ను 23 శాతానికి తగ్గించి ఎన్నికలు జరిపింది. ఇది వివాదాస్పదం కావడంతోపాటు హైకోర్టు కూడా తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఈసారి కచ్చితంగా బీసీల రిజర్వేషన్ అంశాన్ని తేల్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అమల్లో ఉన్న జనాభా దామాషా విధానమైతే.. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన మేరకు రిజర్వేషన్ వర్తిస్తుంది. బీసీల విషయంలో సమస్య తలెత్తుతోంది. ప్రస్తుత నిబంధన ప్రకారం.. రాష్ట్రంలోని గ్రామాలు, వార్డులు, మండలాల వారీగా ఎస్సీ, ఎస్టీ జనాభాను లెక్కించి దాని ప్రకారం వారికి రిజర్వేషన్ కేటాయిస్తారు. అయితే ఆయా గ్రామాలు, మండలాల్లో ఎస్సీ, ఎస్టీలు

మిగతా 11వ పేజీలో...

### ఆధునిక పంథాలో సౌదీ

12

తొలిసారిగా స్విమ్ సూట్ ఫ్యాషన్ షో!



### 5 రోజులు భారీ వర్షాలు

వారం చల్లగానే.. 22న అల్పపీడనం

హైదరాబాద్, పలు జిల్లాల్లో భారీ వర్షం

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

14

### ధరణిలో 76 కొత్త మాడ్యూల్స్!

అన్నీ తప్పుల సవరణవే

14

ప్రభుత్వానికి కమిటీ సిఫారసు

4 వరకు పెండింగ్‌కు పరిష్కారం



- THE PRIDE OF TELANGANA -

# ALPHORES

## IIT | NEET | EAPCET ACADEMY

SUCCESS CREATES CONFIDENCE & CONFIDENCE CREATES SATISFACTION

Dr.V. NARENDER REDDY
Chairman

## MAKES THE FANTASTIC RESULTS WITH THE BEST RANKS IN TS EAPCET-24

| Rank | Stream | Name |
|---|---|---|
| 114 | A & P | V. HASINI |
| 157 | A & P | N. HEMANTH |
| 166 | Engg. | G. SRIHAAS |
| 296 | Engg. | K. SUPRIYA |

| Rank | Name |
|---|---|
| 472 | N. GYANADA |
| 480 | D. POOJITHA |
| 568 | V. SRIMUKHI |
| 575 | M. VARSHITH |
| 610 | G. SAI MANJUNATH REDDY |
| 863 | P. JYOTHIRMAI REDDY |
| 876 | R. SRI VENNELA |
| 942 | K. TEJASWINI |
| 943 | A. SHIVA VARUN |
| 950 | CH. ANUHYA |
| 986 | P. SRINATH |
| 992 | MALIHA FATHIMA |
| 1024 | CH. CHANDANA |
| 1081 | Y. ANUSHRUTHA |
| 1131 | G. SAHASTRA |
| 1168 | M. SRIRAM |
| 1230 | RAMSHAKOREEN |
| 1243 | S. SATYA AMULYA |
| 1257 | P. AKSHARA REDDY |
| 1270 | K. SRINIDHI |
| 1287 | A. ARCHANA |
| 1410 | P. ISHA SHARVANI |
| 1430 | K. MISRA |
| 1452 | A. SRI VARDHINI |
| 1494 | MARIYA SABA |
| 1525 | V. VINEELA |
| 1528 | G. VARSHITHA |
| 1633 | T. NIKITHA |
| 1764 | P. RAHUL |
| 1768 | B. KRISHNA SREE |
| 1785 | K. AKHIL SAI KRISHNA |
| 1798 | P. AKSHITHA |
| 1829 | NISA SARWATH |
| 1838 | S. PRAGNA |
| 1916 | SATHVIKA |
| 1955 | ANURAGA |
| 2036 | G. RATHAN RAO |
| 2146 | CH. NIKHIL |
| 2158 | SAHEERA |
| 2169 | R. AKSHITHA SRI |
| 2189 | AKHILA |
| 2225 | M. PRAHARSH |
| 2280 | SANATH SHIRUPA |
| 2300 | B. ASHRITHA |
| 2393 | G. PUNNAM CHANDRA |
| 2443 | SPURTHI |
| 2474 | A. NAYANA MYTHRI |
| 2502 | B. AMITHA |
| 2503 | SAI PRATHIGNA |
| 2510 | HARI SUSHANTH |
| 2569 | T. NIKHITHAA SREEYA |
| 2667 | P. ANUDEESH |
| 2673 | Y. SANJAY |
| 2745 | M. SRIJA |
| 2755 | M. AKSHITHA |
| 2759 | V. HIMAJA |
| 2822 | B. VARSHITH |
| 2877 | G. SRIVIDYA |
| 2964 | K. VISHAL REDDY |

& MANY MORE...

SCHOLARSHIP TEST FOR LONG TERM IIT & NEET-2025 ON 1st JUNE, 2024 IN ALL OUR COLLEGE BRANCHES

LONG TERM IIT & NEET CLASSES COMMENCE FROM 13th JUNE, 2024

CONGRATULATIONS TO SUPERB RANKERS | THANKS TO PARENTS & TEAM ALPHORES

HYDERABAD: 9032666825 | KARIMNAGAR: 9133588857 | JAGTIAL: 9160207447 | HANAMKONDA: 9160427444 | MANCHERIAL: 9160264443 | NIRMAL: 9652444414

OUR NEW INITIATIVES

ARMOOR Jr. COLLEGE 9160463444 | NIZAMABAD Jr. COLLEGES 9160191444 | MANCHERIAL AC Jr. COLLEGE 91602 64443 | NIRMAL Jr. COLLEGE PRIYADARSHINI NAGAR 9652444414 | HANAMKONDA Jr. COLLEGE BHEEMARAM 91604 27444 | WARANGAL IIT & NEET ACADEMY POCHAMMA MAIDAN 91604 26444 | KARIMNAGAR ELITE: GIRLS CAMPUS @ SITARAMPUR EXCEL: BOYS CAMPUS @KOTHAPALLY 9246834448

## ఎవరెస్ట్ శిఖరం బేస్‌క్యాంప్ వద్దకు తెలంగాణ వాసి



తెలంగాణ తల్లి చిత్రపటంతో ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ వద్ద చిరంజీవి

పరకాల, మే 18: ఎవరెస్ట్ అధిరోహణకు మొదటి అడుగు బేస్‌క్యాంప్‌ను చేరుకోవడం. సముద్రమట్టానికి 17వేల 598 అడుగులు (5వేల 364 మీటర్ల) ఎత్తులో ఉండే ఇక్కడకు చేరడం కూడా ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన ఏకు చిరంజీవి ఈ నెల 9న నేపాల్ దేశంలో అడుగుపెట్టి కాలినడకన ఎనిమిది రోజులు శ్రమించి పట్టుదలతో ఈ నెల 17న ఉదయం 11.55 నిమిషాలకు ఎవరెస్ట్ బేస్‌క్యాంపును చేరుకున్నారు. చరిత్రలోనే మొట్టమొదటిసారిగా అక్కడ తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఇంతకు ముందు 2022లో దేశంలోని ఉత్తరాఖండ్, కేదార్ కంఠ పర్వతం మీద 13,500 అడుగుల ఎత్తులో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించి నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిరంజీవి తన పేరును లిఖించుకున్నారు.

## ఆస్తి కోసం తల్లి, ఇద్దరు కూతుళ్ల హత్య

» ఖమ్మం జిల్లా తల్లాడలో ఓ వ్యక్తి కిరాతకం

తల్లాడ, మే 18: ఆస్తి కోసం ఓ వ్యక్తి అత్యంత కిరాతకానికి పాల్పడ్డాడు. ఆస్తి అమ్ముకోవడానికి అడ్డుగా ఉన్న కన్నతల్లిని, తన ఇద్దరు కన్నబిడ్డలను హతమార్చాడు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలో శనివారం ఉదయం ఈ దారుణం జరిగింది. పిట్టల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన తల్లి పిట్టల పిచ్చమ్మ(60), కుమార్తెలు పిట్టల నీరజ(11), పిట్టల ఝాన్సీ(6)ని హతమార్చి పరారయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర్లు మొదటి భార్య పిట్టల కనకదుర్గ రెండేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో మరణించింది. అనంతరం తల్లాడకు చెందిన గుదే త్రివేణి అనే మహిళను వెంకటేశ్వర్లు రెండో వివాహం చేసుకున్నాడు. కనకదుర్గ మరణించినప్పుడు వారి కుటుంబానికి ఉన్న ఎకరం పది కుంటల పొలంలో దివ్యాంగురాలైన తల్లి పిచ్చమ్మ పేరిట అర ఎకరం, నీరజ, ఝాన్సీల పేరిట చెరో 15 కుంటల భూమిని పెద్ద మనుషులు రాయించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇంటిని కూడా వారి పేరిటే రాయించారు. రెండో భార్య త్రివేణి ప్రోద్బలంతో ఈ ఆస్తిని ఎలాగైనా దక్కించుకోవాలని వెంకటేశ్వర్లు ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా అప్పులు తీర్చేందుకు తల్లి పేరిట ఉన్న అర ఎకరం పొలం విక్రయించేందుకు యత్నించగా పిచ్చమ్మ అడ్డుకుంది. దీంతో ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొరుగింటి వారికి ఫోన్ చేసి తల్లీ, కుమార్తెలతో మాట్లాడిన వెంకటేశ్వర్లు.. ఖమ్మం నుంచి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. కానీ తెల్లవారేసరికి పిచ్చమ్మ, నీరజ, ఝాన్సీ తమ ఇంట్లో మంచం మీద విగతజీవులుగా పడి ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో వెంకటేశ్వర్లే ఇంట్లోకి వెళ్లి తల్లీ, బిడ్డల గొంతును లిమి ప్రాణం తీసి పరారయ్యాడని అనుమానిస్తున్నారు. పిచ్చమ్మ, నీరజ, ఝాన్సీల గొంతు, మొహం, శరీర భాగాలపై గాయాలు ఉన్నాయి. అంతేకాక నీరజ నోటి వెంట నురుగు కూడా ఉంది. ఈ హత్యలపై సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, పరారీలో ఉన్న వెంకటేశ్వర్లును పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారని, అతడు నేరాన్ని అంగీకరించాడని విశ్వసనీయ సమాచారం.

## పెళ్లి దుస్తులు కొనేందుకు వెళ్లి.. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృత్యువాత

» 44వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

» డివైడర్‌ను ఢీకొట్టి లారీ కిందకు వెళ్లిన కారు


సోదరుడి కుమారులతో పెళ్లికొడుకు ఫిరోజ్ బాషా (ఫైల్)
పెళ్లికొడుకు తండ్రి అలీసాహెబ్(ఫైల్)

గుత్తి, మే 18: మరో పది రోజుల్లో పెళ్లి. పెళ్లి కొడుకు సహా కుటుంబ సభ్యులు రెండు కార్లలో హైదరాబాద్‌కు వెళ్లి పెళ్లి దుస్తులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. స్వస్థలానికి మరో గంటలో చేరుకోవాల్సి ఉండగా ఘోర ప్రమాదం జరిగింది. ఓ కారు వేగంగా డివైడరును ఢీకొని, అవతలి వైపు వస్తున్న లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పెళ్లికొడుకు సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బాచుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పెళ్లికొడుకు షేక్ ఫిరోజ్ బాషా(30), ఆయన తండ్రి అలీ సాహెబ్ (56), సోదరుడి భార్య జహీరా బాను (40), సోదరుడి పిల్లలు మహమ్మద్ ఆయాన్ (6), మహమ్మద్ ఆమాన్ (3), పిన్ని రెహనా బేగం (40) మృతిచెందారు. ఫిరోజ్ పిన్ని కొడుకు మహమ్మద్ గౌస్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం నగరంలోని బిందెల కాలనీకి చెందిన షేక్ ఫిరోజ్ బాషా ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి. ఈ నెల 27న వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి దుస్తులు కొనేందుకు శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులంతా రెండు కార్లలో హైదరాబాద్ వెళ్లారు. రాత్రి వరకూ షాపింగ్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ఫిరోజ్ బాషా, తండ్రి అలీసాహెబ్, పిన్నమ్మ రెహనా బేగం, సోదరుడి పిల్లలు మహమ్మద్ ఆయాన్, మహమ్మద్ ఆమాన్, వదిన జహీరా బాను, పిన్నమ్మ కొడుకు మహమ్మద్ గౌస్ ఒక కారులో ఎక్కారు. మరో కారులో ఫిరోజ్ బాషా తల్లి, ఆమె కూతురు, అల్లుడు, మరో ఇద్దరు బయలుదేరారు. వీరు గంట ముందుగానే అనంతపురానికి చేరుకున్నారు. ఫిరోజ్, ఇతర కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న కారు తెల్లవారుజామున గుత్తి మండలం బాచుపల్లి వద్దకు రాగానే డ్రైవింగ్ చేస్తున్న మహమ్మద్ గౌస్ నిద్రమత్తు వల్ల అదుపు తప్పింది. డివైడరును ఢీకొని, అవతలి వైపున లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. లారీ మడ్‌గార్డ్ రేకు చొచ్చుకెళ్లడంతో ఫిరోజ్ తల మొండెం నుంచి వేరైంది. ప్రమాద స్థలంలోనే ఆయనతో సహా నలుగురు మృతిచెందారు. గాయపడ్డ ముగ్గురిలో ఒకరు గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో, మరొకరు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. డ్రైవింగ్ చేసిన మహమ్మద్ గౌస్ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిరోజ్ తండ్రి అలీసాహెబ్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్దకొడుకు రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఇప్పుడు ప్రమాదంలో అలీసాహెబ్‌తో పాటు మిగిలిన ఒక్క కొడుకు, వితంతువైన పెద్ద కోడలు, ఆమె ఇద్దరు కుమారులు చనిపోయారు.

## నిగ్గు తేల్చేద్దాం!

» ఏపీలో రంగంలోకి దిగిన సిట్ బృందాలు

» పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలపై ఆరా

అమరావతి(ఆంధ్రజ్యోతి), తాడిపత్రి టౌన్, నరసరావుపేట, మే 18: పోలింగ్ ముగిసిన తర్వాత ఏపీలో పలుచోట్ల జరిగిన హింసాత్మక ఘటనల్లో అధికార పార్టీ శ్రేణులకు వంత పాడిన పోలీసు అధికారుల పాత్రపై సిట్ కూపీ లాగుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) శనివారం క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగింది. శుక్రవారం సాయంత్రం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో భేటీ అయిన సిట్ అధికారులు ఆయన సూచనల మేరకు శనివారం రంగంలోకి దిగారు. ఇంటెలిజెన్స్ ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో 13 మంది అధికారులతో ఏర్పాటైన సిట్ నాలుగు బృందాలుగా విడిపోయి ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో పర్యటిస్తోంది. పల్నాడు జిల్లా మాచర్ల, నరసరావుపేట, అనంతపురం జిల్లా తాడిపత్రితో పాటు తిరుపతిలో సిట్ అధికారులు పర్యటిస్తున్నారు. అధికార పార్టీకి వంత పాడిన దిగువ, మధ్యస్థాయి పోలీసు అధికారుల పాత్రపై విచారణ చేస్తున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా, ఆస్తులను ధ్వంసం చేస్తున్నా ఆపకుండా ప్రేక్షకపాత్ర పోషించిన అధికారులు ఎవరు? ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా అధికార పార్టీ నేతలకు సమాచారం చేరవేసిన పోలీసులు ఎవరు? అన్న కోణాల్లో విచారిస్తున్నారు. 'సీడీ ఫైల్ తీసుకురండి. ఎఫ్ఐఆర్‌లో ఏయే సెక్షన్లు వేశారు? ఎవరెవరిని అరెస్టులు చేశారు? వచ్చిన ఫిర్యాదులేంటి? దర్యాప్తులో లభించిన ఆధారాలేంటి?' అంటూ సిట్ అధికారులు.. పోలీసులను ప్రశ్నిస్తున్నారు. ఇక, పల్నాడు జిల్లా ఎస్పీగా మాలికా గార్గ్, అనంతపురం జిల్లా ఎస్పీగా గౌతమి శాలి, తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్ రాజును ఎన్నికల సంఘం నియమించింది.

## ఎప్‌సెట్‌లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

» అభినందనలు తెలిపిన మంత్రి పొన్నం

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన ఎప్‌సెట్- 2024 ఫలితాల్లో గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించి తమ ప్రతిభను కనబరిచారు. బీసీ గురుకుల పరిధిలో అగ్రికల్చర్ విభాగంలో 139, ఇంజనీరింగ్ విభాగంలో 298 మంది అర్హత సాధించారు. ఇక ఎస్సీ గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో బాలికలు, బాలురు కలిపి మొత్తం 2,445 మంది పరీక్ష రాయగా.. 2,408 మంది ర్యాంకులను సాధించారు. కాగా ఎప్‌సెట్ ఫలితాల్లో ర్యాంకులను సాధించిన విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్ సహా ఆయా గురుకులాల కార్యదర్శులు, డైరక్టర్లు అభినందించారు.

## వీసీ పోస్టుల్లో సగం బీసీలకే ఇవ్వాలి: జాజుల

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయబోయే యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పోస్టుల్లో సగం బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. త్వరలో భర్తీ చేయబోయే 10 యూనివర్సిటీల వీసీల పోస్టుల్లో దాదాపు 5 పోస్టులను బీసీలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## జన్యు పరిశోధనల వెలుగులో
# మన మూలాలు

సుప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత, పరిశోధకులు కల్లూరి భాస్కరం రచన 'ఇవీ మన మూలాలు' గొప్ప పరిశోధనాత్మక గ్రంథం. పుస్తకం వేల లక్షల సంవత్సరాల మానవ జాతి పరిణామక్రమం వలసలు, విభిన్న ప్రాంతాల ప్రజల మధ్య ఘర్షణలు, సంబంధాలు, తదితరాలపై లోతైన పరిశోధనతో మానవ జాతి యావత్తు, విభిన్న వర్గాల సంపర్కంతో కొనసాగుతున్న దని భాస్కరం సోదాహరణంగా వివరించారు. ముందు మాటలో వాడ్రేవు చిన వీరభద్రుడు రాసినట్లుగా ఇలాంటి గ్రంథ రచనకు పూనుకోవడానికి చాలా ధైర్యం కావాలి. ధైర్యం ఎందుకు కావాలంటే మనమొక అసాధారణ పరిస్థితుల్లో జీవిస్తున్నాం. వాస్తవాలను అంగీకరించకుండా, మన మతం, మన భాష, మన చరిత్రను అధికార శక్తులు తమ ఆలోచనలకు అనుగుణంగా వక్రీకరిస్తున్నాయి. తమతో అంగీకరించని వారిని దేశద్రోహులని చిత్రీకరించడం, ఏం తినాలో, ఏ రకం దుస్తులు ధరించాలో, ఏం ఆలోచించాలో, ఏం రాయాలో ఎవరిని పూజించాలో ఆదేశిస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛను అణగదొక్కుతున్న సందర్భంలో బతుకుతున్నాం. మనుషులకు, రచయితలకు, తత్వశాస్త్ర వేత్తలకు, వాస్తవాలు చెప్పేవారికి సంకెళ్లు వేయవచ్చు. కాని భావాలకు సంకెళ్లు వేయలేరు.

పదుల వేల సంవత్సరాల్లో మానవజాతి నిరంతరం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసవెడుతూ మరింత మెరుగైన జీవితం కోసం వెతుకుతూనే ఉంది. దేశాలు, సరిహద్దులు ఏర్పడక ముందు నుండి, ప్రారంభమై 21వ శతాబ్దంలో కూడా కొనసాగుతున్నది.

గత శతాబ్దంలో వలసలుగా ఉన్న దేశాల నుండి యూరోపునకు వలసలు ప్రారంభమై, ప్రతిరోజు పెరుగు తున్నాయి. యూరోపులో, అమెరికాలో వలసల పట్ల అసహనం, భయం పెరుగుతున్నది. అప్పట్లో, ఒక్క అమెరికాకు తప్ప మిగతా దేశాలకు యూరోపియన్లు వలస వెళ్లింది దోచుకోవడానికే. ఇప్పుడు యూరోపుకు వర్ధమానదేశాల వారి వలసలు ప్రాణరక్షణ కోసం, బ్రతుకు తెరువు కోసం. ఇలాంటి దశలో ఘర్షణలు, సంపర్కాలు అనివార్యం. వలసలకు వ్యతిరేకంగా మితవాద శక్తులు రాజకీయ పార్టీలుగా రూపాంతరం చెంది, ఫాసిస్టు పద్ధతులకు పాల్పడుతున్నాయి. కోట్లాది ప్రజల వలసలు సాగుతున్నాయి. ఈ ఇరవై ఏళ్లలో భారతదేశం నుండి 23 లక్షల మంది వలస వెళ్లారు.

హరప్పా జనంలో ఇరాన్ జన్యువులు ఉన్నాయని పరిశోధకులు కనుగొన్నారు. శ్రీలంకలో ఇప్పటికీ అడవులలో నివసించే గిరిజనులలో భారతీయుల జన్యువులు ఉన్నట్టు, సిసియంబి పరిశోధనలు వెల్లడించాయని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వార్త వచ్చింది. గ్రహదేవతలకు సంబంధించి పురాణాల కథలలో దేవుళ్లకు, భారత పురాణాలలో దేవుళ్లకు అనేక పోలికలు పేర్ల మార్పుతో కనబడుతాయి. భారతదేశం నుండి ప్రజలు గ్రీసు, యూరోపులకు గతంలో వెళ్లినట్లు ఎలాంటి ఆధారాలు లేవుగాని, ఆ ప్రాంతం నుండి భారతదేశంలోకి రావటమో, లేక ఒక పాయ ఇటు భారత్‌వైపునకు, మరొక పాయ అటు యూరోపునకు ఉమ్మడి పురాణాలతో వెళ్లి వుండే అవకాశాలు ఉన్నాయి.

వాస్తవాలను సక్రమంగా అర్థం చేసుకోవడానికే వాస్తవ చరిత్ర రచన అవసరం. వేల సంవత్సరాల క్రితం ఆర్యులు భారతదేశంలోకి వచ్చారంటే, ఇప్పుడు వాళ్ళు విదేశీయుల క్రింద లెక్క కాదు. యూదులు పాలస్తీనాను వేల సంవత్సరాలనాటి తమ మాతృభూమిగా ప్రకటించుకొని ఆక్రమించుకున్నారు. అలాంటి పరిస్థితులు ఇక్కడ లేవు. ఈ వలసల పరివర్తన గురించి సిగ్గు పడాల్సింది లేదు.

కాని ఈ పరివర్తనాక్రమం గురించి, జన్యువుల మూలం గురించి అంగీకరిస్తే, తర్వాత సృష్టించబడిన మతాలు, కులాలు, ఇతర కృత్రిమ విభజనలు అర్థం లేనివని అంగీకరించాల్సి వస్తుంది. ఉత్తర అమెరికాలోని 26 కోట్ల జనాభాలో నేటివ్ అమెరికన్లు (రెడ్ ఇండియన్స్‌గా పిలవబడేవారు) కోటి పది లక్షల మంది, మిగిలిన 25 కోట్ల మంది వలసలు వచ్చినవారే. యూరోపు, ఆఫ్రికా, ఆసియా దేశాల ప్రజలు, అంతర్వర్ణ వివాహాల నూతన సంకర జాతి ప్రజలు కలిసి, అమెరికా అయింది. వాళ్లందుకు సిగ్గుపడటం లేదు.

తాము నమ్మిన అంశాలను బలపరచుకోవడానికి, వేల సంవత్సరాల చరిత్రను వక్రీకరించడం అందుకే. భాస్కరం రచన జన్యు పరిశోధనల వెలుగులో చారిత్రిక సాక్ష్యాల పునర్విచారణ. ప్రశస్త పుస్తకం అనేక అంశాలను మేధావుల, ప్రజల దృష్టిని తీసుకువస్తున్నది.


అసలు పాయింట్ ఇన్ని సంపర్కాలు, సంఘర్షణల తర్వాత మా మతం, కులం, పవిత్రమైనదని, ప్రపంచంలో ఉత్తమమైనదని చెప్పడం! మత విద్వేషాలు ఒకవైపు, స్వంత మతంలోని భిన్నకులాల మీద అసాధారణమైన వివక్ష మరోవైపు– ఈ రెండూ అర్థరహితమైనవి.

**అసలు పాయింట్ ఇన్ని సంపర్కాలు, సంఘర్షణల తర్వాత మా మతం, కులం, పవిత్రమైనదని, ప్రపంచంలో ఉత్తమమైనదని చెప్పడం! మత విద్వేషాలు ఒకవైపు, స్వంత మతంలోని భిన్నకులాల మీద అసాధారణమైన వివక్ష మరోవైపు– ఈ రెండూ అర్థరహితమైనవి. మానవులందరిలో రక్తం ఎరుపే. నీలి రక్తం లేదు. రక్తం చెడిపోతేనే రంగు మారుతుంది.**



ఊహాజనితమైన గతాన్ని పునరుద్ధరించాలనే వివేచన లేని ఆలోచన, ప్రపంచాన్ని మొత్తం ఇస్లామీకరణ చేయాలనుకునే జీహాదిస్టుల ప్రయత్నాలు ఒకే రకమైనవి. మానవులందరిలో రక్తం ఎరుపే. నీలి రక్తం లేదు. రక్తం చెడిపోతేనే రంగు మారుతుంది.

పుస్తకంలో ఆఖరు అంశం "దక్షిణ గో గ్రహణంలో ఆర్యావర్తం" ఒక కొత్త కోణం నుండి రాయబడింది. ఉత్తర భారత ఆర్యావర్త శక్తులు, దక్షిణ భారతంలో ఆర్యావర్తం విస్తృతం చేయడానికి జరుగుతున్న ప్రయత్నంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ పార్టీల మధ్య నాయకత్వ ఘర్షణ కంటే సైద్ధాంతిక ఘర్షణల కంటే, ఆర్యావర్త ఆలోచనలు, భాష, సంస్కృతి, మతం, దక్షిణ భారతంపైన రుద్దటానికి జరుగుతున్న ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి. ఈ వైరుధ్యాలు ఎంతకాలం సాగుతాయనే విషయం ఆయన చరిత్రకు వదిలి పెట్టారు. ఈ కొత్త కోణంలో వాస్తవం ఉంది. అది యూదుల జాత్యహంకార ధోరణిలోకి పోతున్న ప్రమాదం కనపడుతున్నది.



వందల సంవత్సరాలపాటు సాగిన ఈ ప్రయత్నం, మధ్యలో ముస్లిం రాజుల దాడులు, పాలన, బ్రిటిష్ వలస పాలన కారణంగా వచ్చిన 'గ్యాప్'తో వాయిదాపడి ఇప్పుడు మళ్లీ కొనసాగుతున్నదన్న ఆయన వాదన సమంజసమైనదిగానే కనపడుతున్నది. మానవజాతి ఒక్కటే అయినా, మతాలు, భాషలు, సంస్కృతి, ఆచారాలు, భిన్నమైనవి. పరస్పర సహనం, గౌరవంతోనే దేశాలు ఐక్యంగా నిలబడుతాయి.

కల్లూరి భాస్కరం ఈ పుస్తకాన్ని అనేక రెఫరెన్స్‌లతో, కొత్తకోణం నుండి ఆలోచించి రాసారు. ఇదొక గొప్ప వైజ్ఞానిక రచన. మెదడు ద్వారాలను మూసుకున్న వారికి ఇది ఎక్కదు. జ్ఞాన చక్షువులు తెరుచుకోవాల్సిన నేటి యువత దీనిని చదవాలి, చర్చించాలి. ఈ గ్రంథం ఇంగ్లీషు, హిందీ తదితర భాషలలోకి అనువదించడం చారిత్రక అవసరం.

◆ సురవరం సుధాకర రెడ్డి

# హిమాలయాల్లో అక్షర వసంతం

గత రెండు వేల సంవత్సరాలకు పైగా ప్రపంచం సమస్త భాషలలోను అసంఖ్యాక రచయితలను చూసింది; వారి ఆలోచనల నైశిత్యాన్ని, భావ చింతనను, కల్పనా రమ్యతను ఆవాహన చేసుకుంది. ఆ అక్షర మాంత్రికులలో కొంతమంది రూపెత్తిన అహంభావులు అయినా తమ పాఠకులపై బ్రహ్మాండమైన ప్రభావాన్ని నెరపినవారు; మరి కొంతమంది మృదుస్వభావులు, స్నిగ్ధమూర్తులు, మనసులను ద్రవింపజేసినవారు; ఇంకొంతమంది మానవ జీవిత అనంత వృత్తాంతాలను అద్భుతమైన నేర్పుతో అభివర్ణించినవారు; పలువురు తమ కథలకు అనూహ్యమైన ముగింపు నివ్వడం ద్వారా పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసినవారు; ఇంకా ఎంతో మంది తమ ప్రాతి భాసికంలోనే కాకుండా రచనా విన్యాసంలో సైతం నిగూఢమైనవారు. ఈ బహు రీతుల సృజనకారులలో ప్రతి తరహా వారితోను మానవ సమాజాలు మెరుగుపడ్డాయి, మన జీవితాలు కాంతిమంతమయ్యాయి. సృజన కార్యకలాపాలలో అంత వైవిధ్యమే లేకపోతే మన బతుకులు కళాకాంతి లేకుండా నిస్సారమయ్యేవి, నిష్ఫలమయ్యేవి.

మన కాలం అత్యుత్తమ కథా రచయితలలో రస్కిన్ బాండ్ ఒకరు. సుసంపన్న, సువిఖ్యాత భారతీయ కథా కథన సంప్రదాయానికి గర్వ కారణం రస్కిన్ బాండ్. చెట్టు చేమ, పక్షీ పశువూ, కొండ కోన, ఆకాశ మార్గాన పయనిస్తున్న మేఘాలు, భూతలాన ప్రవహిస్తున్న నదులతో శోభిస్తున్న ప్రకృతి పట్ల ప్రగాఢ ప్రేమానురక్తులను మేళవించుకునే తన కథాకథన ప్రజ్ఞతో ఇంచుమించు మూడు తరాల సాహిత్య ప్రేమికులను ఆయన సమ్మోహం చేశారు, ఇంకా వారి మనసులను రంజింప చేస్తూనే ఉన్నారు. రస్కిన్ బాండ్ రచనలు హిమగిరి ప్రాంతాల సన్నివేశాలనే ఆధారంగా తీసుకుంటాయనే ఒక సాధారణీకరణ అభిప్రాయాన్ని సాహిత్యాభిమానులు తరచు వ్యక్తం చేయడం కద్దు. రస్కిన్ బాండ్ పరిమితులకు అతీతమైన సృజనశీలి. హిమాలయ ప్రాంతాల రమ్య దృశ్యాలు ఆయనలోని సృజన శక్తికి స్ఫూర్తినిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయినా హిమగిరుల ఆవరణం ప్రతి ఒక్కరినీ ఉత్తేజితులను చేస్తున్నప్పుడు అక్కడే పుట్టి పెరిగిన రస్కిన్ బాండ్ అందుకు ఎలా మినహాయింపు అవుతారు?

రస్కిన్ బాండ్ రచనలకు హిమాలయాలు ఒక నిరంతర నేపథ్యం. అయితే ఆయన కథలు విభిన్న, నానా విధమైన విషయాలను అన్వేషించాయి, అభివర్ణించాయి. ఒకే ఒక్క గవాక్షం ఉన్న మహాభవనంలో కూర్చున్న ఒక అద్భుత ఇంద్రజాలికుడు లాంటి వాడు మన రస్కిన్ బాండ్. కిటికీని తెరిచినప్పుడల్లా తన వీక్షణతో విభిన్న ప్రపంచాన్ని ఆవిష్కరించే మాంత్రికుడు ఆయన. ఈ విషయంలో ఆయన, మధ్య తరగతి కుటుంబ జీవితాల గురించి కథలు రాసిన భారతీయ (భాషలలోని) మహాకథకులతో పోల్చదగినవాడు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ పరిస్థితులలో ఒకేతీరున సువ్యక్తమవుతున్న మానవ జీవన విలక్షణత, నాటకీయత గురించి రస్కిన్ బాండ్ తన పాఠకులను మంత్ర ముగ్ధులను చేశారు. వారిని పలు విధాల పరవశింపచేశారు.

అన్ని వర్గీకరణలు, అనుబంధితాలకు అతీతంగా రస్కిన్ బాండ్ ఒక పరిపూర్ణ మానవతావాది. కనుకనే ఆయన మానవ జీవిత దార్శనికుడు. గ్రామీణ జీవనమైనా, 'గత శైశవ రాగమాలికల ప్రతిధ్వనులు, పోయిన బాల్యపు చెరిగిన పదముల చిహ్నాల' తలపోతలు అయినా లేదా మనిషి, ప్రాకృతిక జగత్తు మధ్య బాంధవ్యమైనా–రస్కిన్ బాండ్ ప్రతి కథా చర్చించే ఇతివృత్తాలు, ఆలోచనలకు మానవ అస్తిత్వమే కేంద్రంగా ఉంటుంది; మానవ జీవిత సౌందర్యం, సాఫల్యాలు, మానవాళి దుఃఖాలు, వేదనలు ఆ కథల్లో మనకు కనిపిస్తాయి, మనలో లోవెలుగులను నింపుతాయి.

చెప్పవచ్చినదేమిటంటే రస్కిన్ బాండ్, ఆయన జీవన పరిసరాలూ, విశాల ప్రపంచమూ, గ్రామీణ ప్రజలతో జీవితం పొడుగునా ఆయనకు ఉన్న సంబంధ బాంధవ్యాలు – ఇవన్నీ కేవలం ప్రకృతి పట్ల




> **అన్ని వర్గీకరణలు, అనుబంధితాలకు అతీతంగా రస్కిన్ బాండ్ ఒక పరిపూర్ణ మానవతావాది. కనుకనే ఆయన మానవ జీవిత దార్శనికుడు. రస్కిన్ బాండ్ ప్రతి కథా చర్చించే ఇతివృత్తాలు, ఆలోచనలకు మానవ అస్తిత్వమే కేంద్రంగా ఉంటుంది; మానవ జీవిత సౌందర్యం, సాఫల్యాలు, మానవాళి దుఃఖాలు, వేదనలు ఆ కథల్లో కనిపిస్తాయి, మనలో లోవెలుగులను నింపుతాయి.**

ప్రేమను మించినవి కావా? రస్కిన్ బాండ్ జీవించి ఉన్న కాలంలోనే మనమూ నడయాడుతున్నందుకు ఎంతో అదృష్టవంతులం. ప్రకృతి, పర్యావరణం పట్ల రస్కిన్ బాండ్‌కు ప్రగాఢ శ్రద్ధాసక్తులు ఉన్నాయి. వాటిని ఆయన గౌరవిస్తారు, పూజ్య భావంతో చూస్తారు. ఆయన కథలు, కవితలు, ఇతర రచనలలో ప్రాకృతిక పరిసరాలు మనకు ప్రత్యక్షమవుతాయి. ఆయన భావవిన్యాసాలు, అక్షర కల్పనలతో అవి మనలను అలరిస్తాయి, జాగృతం చేస్తాయి.

ప్రకృతి వర్ణనలతో నిండిన కథలు రాయడమే కాదు, పర్యావరణ సంరక్షణకు పలు విధాల కృషి చేస్తున్న ప్రకృతి ప్రేమికుడు రస్కిన్ బాండ్. భావి తరాల వారి కోసం ప్రాకృతిక జగత్తును పరిపూర్ణంగా కాపాడుకోవాలని ఆయన తరచు ఘోషిస్తుంటారు. పర్యావరణ సమతుల్యతను సంరక్షించుకోవల్సిన ఆవశ్యకతను తన రచనలు, ఉపన్యాసాలు, సంభాషణల్లో ఆయన వక్కాణిస్తుంటారు. స్థిర జీవనం, సుస్థిర అభివృద్ధి, వాటికి సంబంధించిన సకల అంశాలను సమగ్రంగా అర్థం చేసుకున్న రచయిత ఎవరైనా ఉన్నారంటే ఆ ఒక్కడు నిస్సందేహంగా రస్కిన్ బాండ్.

రస్కిన్ బాండ్ కథలు తమ మాటల మాంత్రికతతో మనలను భిన్న ప్రపంచాలకు తీసుకువెళతాయి. అంతేనా? కానే కాదు. అవి అదనంగా ఒక సామాజిక పాత్రను నిర్వహిస్తున్నాయి. వ్యాకుల పడుతున్న ఆత్మలకు అవి సాంత్వననిస్తాయి. గాయపడిన మనస్సులకు ఉపశమనం కలిగిస్తాయి. దెబ్బ తిన్న హృదయాలను ఊరడిస్తాయి ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని శాంతపరుస్తాయి. కలవరపడుతున్న అభాగ్యులను ఓదార్చుతాయి. పాఠకులను అలా ప్రభావితం చేసే అటువంటి సమున్నత సృజనాత్మక రచనా ప్రతిభను చాలా కొద్దిమంది రచయితల్లో మాత్రమే కానవస్తుంది. అటువంటి రచయితల్లో రస్కిన్ బాండ్ అత్యుత్తముడూ, అత్యున్నతుడూ అని చెప్పేందుకు నేను సంకోచించను.

రస్కిన్ బాండ్‌తో ఒక దశాబ్ద కాలంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే భాగ్యం నాకు లభించింది. ఇటీవల ఆయనను వ్యక్తిగతంగా కలుసుకునే అదృష్టమూ దక్కింది. రస్కిన్ బాండ్‌ను సాహిత్య అకాడమీ ఆయన స్వగృహంలోనే సన్మానించిన సందర్భంగా ఆ విశిష్ట రచయితతో కొద్దిసేపు గడిపాను. ఆయన నిరాడంబరత, నిష్కాపట్యం నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. ఆడంబరం, అభిజాత్యం ఏ మాత్రంలేని ఉదాత్తుడు ఆయన. జీవితం పట్ల, మారుతున్న కాలం పట్ల వాస్తవిక దృక్పథమున్న వివేచనాశీలి.

ఒక రచయితగా రస్కిన్ బాండ్ హిమాలయ శిఖరాలను అధిరోహించారు. ఏడు దశాబ్దాలకు పైగా సాహిత్య వ్యాసంగంలో మునిగి ఉన్న ఆయనకు ఎల్లలు లేని సాహిత్య జగత్తునుంచి ఎంతగానో గౌరవమన్ననలు అందుతున్నాయి. ఎన్నో సంస్థ–దేశీయ, విదేశీ, అంతర్జాతీయ– ల నుంచి ఆయన ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు. అయినా రస్టీ (రస్కిన్ సృష్టించిన ఒక అజరామర బాలుడి పాత్ర) స్రష్ట ప్రేమాస్పదుడు, స్నేహశీలిగా సర్వజనామోదం, గౌరవాదరాలు పొందుతున్న సుజనుడు. పేరు ప్రఖ్యాతులు ఆయన తలకెక్కలేదు. ఇటువంటి మంచి మనిషిని మనం తరచు చూడము, చూడలేము. ఇంతకూ రస్కిన్ బాండ్ ఎటువంటి రచయిత? ఈ వ్యాసం ఆరంభంలోనే నేను వివిధ రకాల రచయితలను, వ్యక్తిత్వాలను ప్రస్తావించాను. నేను పేర్కొన్న విభిన్న తరహా రచయితల సమ్మేళనమే మన ఈ సాహిత్య ఇంద్రజాలికుడు.

రస్కిన్ బాండ్ అక్షర మహామూర్తి. ఆయన్ని గౌరవించాలి. ఒక రచయితగా, భారతీయ పౌరుడుగా ఆయన్ని గౌరవించడం మన విధ్యుక్త ధర్మం. ఆయన కథలు, కవితలు, నవలలను సమస్త భారతీయ భాషలలోకి అనువదించుకోవాలి. అలా చేయని పక్షంలో జీవితంలో మనం విఫలమవుతాము. చేసిన పక్షంలో జీవితం మన పట్ల దయ చూపుతుంది. భావితరాలు మనలను ప్రశంసాపూర్వకంగా అభినందిస్తాయి.



రస్కిన్ బాండ్‌తో వ్యాసకర్త


• డాక్టర్ కె. శ్రీనివాసరావు
కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి
*(నేడు రస్కిన్ బాండ్ 90వ పుట్టినరోజు)*

# భాటియాలీ ధున్

'భాటియాలీ' – ఎంత విస్తరించినా, ఎంత విన్నా, ఎంత ఆలోచించినా తనివి తీరని ఒక ధున్... ఒక ట్యూన్. అది రాగం కాదు. దానికొక ఆరోహణ, అవరోహణ, నిర్దిష్ట సంచారం అంటూ ఉండదు.

దాన్ని మొదట అరవై అయిదు సంవత్సరాల క్రిందట విన్నాను. ప్రతి సంవత్సరం జనవరిలో హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ జరుగుతూ ఉంటుంది కదా. సాయంత్రం పూట చల్లని, ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఎగ్జిబిషన్‌కి వెడితే అక్కడ సన్నగా ఓ రికార్డు వినిపిస్తూ ఉండేది – 78 RPM రికార్డు. మూడు, మూడున్నర నిమిషాల రికార్డు. ఆ ట్యూన్ చాలా సింపుల్‌గా, నిరాడంబరంగా, ప్రశాంతంగా ఉంటుంది. అది సితార్ రికార్డు. సితార్ కనుక రవిశంకరే అయివుంటాడనుకున్నాను. సితార్‌లో ఇంకొకరి పేరు తెలీదు అప్పట్లో. విన్న తర్వాత... హాంట్ చేస్తుండేది. అది 1957, 58 నాటి సంగతి.

అంతకుముందు 1956లో బెజవాడలో ఇంటర్మీడియట్ చదివిన కాలంలో వరసగా రెండు రోజులు మార్నింగ్ షో. విజయా టాకీసులో 'పథేర్ పాంచాలీ' బెంగాలీ సినిమా చూశాను. 'పథేర్ పాంచాలీ' అంటే 'పథికుని గీతం' అని అర్థం. సత్యజిత్‌రే తీసిన అద్భుతమైన చిత్రం అది. ఆ సినిమా, మరీ ముఖ్యంగా దాని థీమ్ మ్యూజిక్ హాంట్ చేస్తూ ఉంటుంది. దాని సంగీత దర్శకుడు రవిశంకర్. సినిమా అంతా ఆ ట్యూన్ సితార్ మీదా, ఫ్లూట్ మీదా వినిపిస్తూ ఉంటుంది. అది బెంగాలీ



ధున్.. భాటియాలీ ధున్. పద్మానదిలో పడవ నడుపుకునే వాళ్ళు పాడుకొనే ఒక ట్యూన్. ధున్.. గీతం. ఆ ట్యూన్ 'పథేర్ పాంచాలీ' సినిమా అంతటా రకరకాల విన్యాసాలతో వినిపిస్తూ ఉంటుంది. దాని పోలికలు నేను ఎగ్జిబిషన్‌లో విన్న రికార్డులో వినిపించడం వల్ల అది రవిశంకర్ రికార్డు అయివుంటుందని అనుకున్నాను. కాని అది రవిశంకర్‌ది కాదు – విలాయత్ ఖాన్‌ది. ఆ సంగతి సుమారు పాతికేళ్ళ తర్వాత – నేను రికార్డుల వేట సాగిస్తున్న రోజుల్లో తెలిసింది. విలాయత్ ఖాన్ రికార్డు 1950 ప్రాంతంలో ఎప్పుడో వచ్చింది– బాగా పాపులర్ అయింది.

'తెనాలి రామకృష్ణ' సినిమాలో భానుమతి పాడిన 'తీరని నా కోరికలే తీరెను ఈ వేళ' అనే పాటకు ఇన్‌స్పిరేషన్ విలాయత్ ఖాన్ రికార్డే. చాలా అందమైన పాట అది. దానికి సంగీతం కూర్చింది విశ్వనాథం – రామ్మూర్తి. విలాయత్ ఖాన్ ట్యూన్‌ని వీళ్ళు మొత్తంగా కాపీ కొట్టారనడానికి వీల్లేదు. చాలా మార్చి అందంగా తయారు చేశారు.

భాటియాలీ ధున్ బెంగాలీ సంగీత కళాకారులందరికీ ఫేవరెట్. రవిశంకర్, అలీ అక్బర్ ఖాన్‌ల సితార్ – సరోద్ జుగల్బందీ రికార్డులో ఈ 'ధున్' వినిపిస్తుంది. పన్నాలాల్ ఘోష్ (ఫ్లూట్) ఒక రికార్డులో భాటియాలీ ధున్ వాయించాడు. నిఖిల్ బెనర్జీ (సితార్) ఒక రికార్డులో వాయించాడు. 'భాటియాలీ' రాగం కాదు – దానికి ఆరోహణ, అవరోహణ ఉండవు. రాగ లక్షణాలు ఉండవు. అందరి ట్యూన్‌లూ ఒకే రకంగా ఉండవు. కాని, వినగానే ఇది 'భాటియాలీ' అని గుర్తించవచ్చు. ఎస్.డి. బర్మన్‌కి ఈ భాటియాలీ చాలా ఇష్టం. 'సుజాత' సినిమాలో 'సున్ మోరే బంధూరే' అనే పాట ఆయన స్వయంగా పాడాడు. అద్భుతమైన పాట. అది ఆయన పాడితేనే బావుంటుంది.

భాటియాలీలో ఇంకో పాట 'సుజాత' కంటే చాలా ముందు ఒక బెంగాలీ రికార్డులో పాడాడు. దాన్నే మళ్లీ హిందీలో 'ధీరెసె జానా బగియన్ మే భవరా' అంటూ పాడాడు. దాన్ని పారడీ చేస్తూ కిషోర్ కుమార్ చేత 'ధీరెసె జానా ఖటియన్ మే ఖట్మల్' అని పాడించాడు – 'ఛుపా రుస్తుమ్' చిత్రంలో. బర్మన్ పాడిన మరో అద్భుతమైన పాట 'బందిని' సినిమాలోని 'ఒరే మాఝీ... ఒరే మాఝీ... మెరె సాజన్ హై ఉస్ పార్' పాట.

'భాటియాలీ' దక్షిణాది సినిమాల్లోకి కూడా వచ్చింది. 'కలసి ఉంటే కలదు సుఖం' సినిమాలోని 'ముద్ద బంతి పూలు పెట్టి మొగలి రేకులు జడను చుట్టి' అనే పాట ఘంటసాల, సుశీల పాడినది చాలావరకు 'సున్ మోరే బంధూరే' పాటకు అనుకరణే. ఆ పాట పెద్ద హిట్ అయింది. 'కలసి ఉంటే కలదు సుఖం' తాలూకు ఒరిజినల్ తమిళ చిత్రంలో కూడా ఆ పాట అదే ట్యూన్‌తో ఉన్నట్లుంది.

బెంగాలీ 'భాటియాలీ' లాంటిదే రాజస్థానీ 'మాండ్'. అదీ జానపద సంగీత మూలం కలిగినదే. అది రాజస్థాన్ ఎడారిలో బిడారులు పాడుకునే ట్యూన్. బెంగాల్‌లో భాటియాలీ ఎంత ప్రసిద్ధమో రాజస్థాన్‌లో 'మాండ్' అంత ప్రసిద్ధం. రెండూ ఇంచుమించు ఒకే మాదిరిగా ఉంటాయి. సారంగి వాద్య కళాకారులు ఆ రాగాన్ని అద్భుతంగా వాయిస్తారు.

○ నం.పా.సా

# ఐదు శతాబ్దాల మేళత్తూరు భాగవత మేళ

శ్రీరంగంలోని రంగనాథాలయం జరుపుకునే ఉగాది మీకు తెలుసా? ఆ కావేరీ రంగనాథుడు తెలుగు ఉగాదే జరుపుకుంటాడు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనగానే భౌతికమైన ప్రాంతాలు అనే నిర్వచనాన్ని అలవోకగా తీసుకోవడం వల్ల కొన్ని కీలకమైన విషయాలు చేజారిపోయాయేమో అని అనిపిస్తుంది. ప్రతి ఏటా నరసింహ జయంతికి తంజావూరుకు సమీపంలో ఉండే మేళత్తూరు అనే గ్రామంలో తెలుగు భాగవతమేళ సాంప్రదాయం సుమారు ఐదు శతాబ్దాలుగా ఉందంటే తెలుగు పునాదులు ఏ స్థాయిలో ఉన్నాయో గమనించాలి. కావేరీ తీరంలో ఉండే ఈ మేళత్తూరు, తెలుగు భాషతో కర్ణాటక సంగీతానికి పీఠాన్ని, చట్టాన్ని సిద్ధం చేసిన త్యాగరాజస్వామి సమాధి ఉండే తిరువయ్యూరుకు ఎంతో దూరంలో లేదు.

1550లో విజయనగర సామ్రాజ్య చక్రవర్తులు చెవ్వప్ప నాయకుని కుమారుడైన అచ్యుతరాయలను తంజావూరు పాలకుడిగా నియమించారు. కళాదృష్టితో భాగవతమేళ సంప్రదాయ నైపుణ్యంలో నిష్ణాతులైన 500 మంది బ్రాహ్మణులకు భూదానం సమృద్ధిగా చేసి ఆశ్రయం కల్పించారు. అదే అచ్యుతాపురం లేదా ఉన్నతాపురం. దీనినే తమిళంలో మేళత్తూర్ లేదా మేళట్టూర్ అని అంటారు. త్యాగరాజస్వామికి సమకాలీనులైన మేళత్తూరు వెంకటరామశాస్త్రి రచించిన పది నాట్య నాటకాలను ఇప్పుడు ఈ మేళత్తూరు భాగవత మేళ కళారూపానికి ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. వెంకట్రామ శాస్త్రి తండ్రి గోపాలకృష్ణయ్య, కూచిపూడి సిద్ధేంద్రయోగికి మిత్రులు, సమకాలీనులనీ; వీరిద్దరూ నారాయణ తీర్థుల శిష్యులని అంటారు. అంతకుమించి నారాయణ తీర్థులు కూడా కొంతకాలం ఈ మేళత్తూరులో ఉన్నారని కూడా నమ్ముతున్నారు.



కూచిపూడి, భరతనాట్యం వలే సంపద్వంతమైన శాస్త్రీయ కళ 'మేళత్తూరు భాగవతమేళ'. అయితే ఇది నాట్య పద్ధతుల కన్నా విభిన్నమైనది. ఎందుకంటే ఈ కళారూపం నాట్యం, నాటకం మేళవింపు. అంతకుమించి నాట్యంలో అవకాశాలు లేని పురుషులకు అవకాశం కల్పించాలని ఈ ప్రయోగం జరిగింది కనుకనే, ఇందులో నటన, నాట్యం, గానం, సంగీతం ఈ మూడింటిని పురుషులే నిర్వహిస్తారు. అంతకుమించి స్త్రీ పాత్రలను కూడా (ఇప్పటికీ) పురుషులే ధరిస్తున్నారు. అందువల్లనే స్త్రీ పాత్రలకు సంభాషణలు చాలా చాలా తక్కువగా ఉంటాయి లేదా ఉండనే ఉండవు. భరతనాట్యం తమిళ ప్రాంతంలోనూ కూచిపూడి తెలుగు ప్రాంతంలోనూ వృద్ధి చెంది ప్రాచుర్యం గడించాయి. అయితే మేళత్తూరు భాగవతమేళ పూర్తి సాంప్రదాయ బద్ధంగా, కొన్ని కుటుంబాల మధ్యనే నిలిచిపోయింది. సరైన గుర్తింపు, వేదిక లేక పోవడంతో దీనిని జానపద కళారూపంగా కూడా పేర్కొనడం కూడా ఉంది. ఇది తెలుగు కళారూపం కానీ, నిలబడి సాగుతున్నది తమిళ ప్రాంతానికి కేంద్ర స్థానం వంటి తంజావూరు చెంత.

కనుకనే రెండు, మూడు దశాబ్దాల క్రితం దాకా ఈ భాగవతమేళ గురించి ప్రధాన స్రవంతి సమాచారంగా కూడా మనకు తెలుగు ప్రాంతంలో అందుబాటులో ఉండేది కాదు.

ఒకప్పుడు చాలా ప్రాంతాల్లో ఈ భాగవతమేళ నడిచేది. మొన్న మొన్నటిదాకా తంజావూరు ప్రాంతంలో శాలియమంగళం, శూలమంగళం, నల్లూరు, ఊతకాడు, పులిమేడు, గోవిందాపురం, తిరువిళ నెల్లూరు, తేపేరమానల్లూరు వంటి గ్రామాల్లో విరివిగా ప్రదర్శనలు జరిగేవి. ఇప్పటికీ చెదురుమదురుగా జరుగుతున్నాయి కూడా. అయితే వీటిలో ఊరు ఊరుకూ ప్రదర్శనల్లో కొంత తేడా కూడా కనబడుతుంది. కొన్ని చోట్ల నాట్యం ప్రధానంగా ఉండడం, కొన్నిచోట్ల నాటకంలాగా ఎక్కువ సంభాషణలు ప్రధానంగా ఉండడం కూడా గమనించవచ్చు. నిజానికి తెలుగు, తమిళ భాషల్లో మహారక్తి కట్టిన 'భక్త ప్రహ్లాద' సినిమాకు కూడా ఈ కళారూపమే మాతృక అని అన్నా ఆశ్చర్యం లేదు. ఏడెనిమిది సంవత్సరాల క్రితం మేళత్తూరు ప్రదర్శనకు వెళ్ళినప్పుడు, తెల్లవారుజామున మూడు, నాలుగు ఊర్లు కూడా వెళ్లి ఆయా ప్రదర్శనలను కొంత కొంత పరిశీలించిన అనుభవం భవదీయుడుకు ఉంది. అయితే కేంద్ర స్థానం మాత్రం మేళత్తూరు మాత్రమే. ఇప్పటికీ ప్రతి నరసింహ జయంతికి విద్యుత్ దీపాలు లేకుండా, అరటి బోదెల మీదుంచిన ఆముదం దీపాల వెలుగులో ఈ ప్రదర్శనను మహానిష్ఠగా చేస్తున్నారు.

వెంకట్రామశాస్త్రికి ముందే ఈ కళారూపం మొదలై స్థిరపడి ఉండాలి. అయితే శాస్త్రి పది నాట్యనాటకాలను రచించి చక్రాన్ని సిద్ధం చేశారు అందులో 9 తెలుగు కాగా ఒకటి తమిళం. ప్రహ్లాద చరిత్ర, రుక్మిణి కళ్యాణం, సీతా కళ్యాణం, ఉషా పరిణయం, కృష్ణ జనన లీల, మార్కండేయ చరిత్ర, పార్వతీ కళ్యాణం, ధ్రువ చరిత్ర, హరిహర లీలా విలాసం, హరిశ్చంద్ర. తంజావూరు ప్రాంతం తెలుగు నాయకులు, తర్వాత మరాఠీ ప్రభువుల చేతికి వెళ్ళింది. వారు కూడా ఈ కళా సంప్రదాయాన్ని ప్రోత్సహించారనడానికి ఆధారాలు ఉన్నాయి. 1696–1797 మధ్యకాలంలో జీవించిన మహారాజు రెండవ ఏకోజి 'శాకుంతలం' అనే మరాఠీ భాగవత మేళను రచించారు. ఈ కళాసంప్రదాయాలు తాళపత్ర గ్రంథాల కాలం నాటివి. అవి ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు అచ్చు సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. కనుక ప్రధానంగా మౌఖికంగానే వాటిని నేర్చుకొని, నైపుణ్యం సాధించారు. తర్వాతి కాలంలో ఈ కళారూపంలో ప్రవేశించిన వారు తమిళ లిపిలో రాసుకుని ప్రదర్శించడం మొదలైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి ముందు, తర్వాత ఈ కళారూపం పట్ల పెద్దగా ఆసక్తి చూపినట్టు లేదు. అంతకుముందు కాలంలో రాజ సంస్థానాల తోడ్పాటుతో పరిఢవిల్లాయి. గడచిన ఏడు దశాబ్దాలలో మేళత్తూరు గ్రామం తెలుగు ప్రాంతపు సరిహద్దుకు 500 కిలోమీటర్లు కావడంతో మనం చాలా సాంస్కృతిక మూలాలను మరిచిపోయినట్టే దీన్ని కూడా మరచిపోయామేమో!

1964లో భాగవతమేళా నాట్య విద్యా సంఘం ఏర్పడింది. అంతకు ముందు ఎటువంటి బ్యానర్ లేకుండా ఈ ప్రదర్శనలు జరిగేవి. అయితే భారతం నటేశమయ్యర్ ఎంతో కృషి చేశారు. అంటే 60 ఏళ్లుగా ప్రతి నరసింహ జయంతికి తప్పనిసరిగా ఈ మేళత్తూరు వెంకట్రామ శాస్త్రి రచించిన 'ప్రహ్లాద చరిత్ర'ను ప్రదర్శింపబడుతూనే ఉంది. అలాగే మద్రాస్, కాంచీపురం, తిరవయ్యారు, తిరువనంతపురం ఇలా ఈ ప్రదర్శనలు ఆదరణ పాత్రమయ్యాయి. 'హరిశ్చంద్ర' నాట్య నాటకం తాళపత్ర ప్రతి ఈ విద్యా సంఘం దగ్గర జాగ్రత్తగా భద్రపరచబడింది. అలాగే నటేశమయ్యర్ చేసిన పరిశోధనలకు సంబంధించిన ఆధారాలు కూడా ఈ సంస్థ దగ్గరే ఉన్నాయి. 1995లో 'మార్కండేయ' ప్రతిని తొలిసారి వ్యాఖ్యానంతో ప్రచురించారు. 2013లో 'ఏన్షియంట్ టెంపుల్ థియేటర్ ఫామ్స్ ఆఫ్ సౌత్ ఇండియా' మోనోగ్రాఫ్‌ను కూడా ఈ విద్యా సంఘం ప్రచురించింది.

**కూచిపూడి, భరతనాట్యం వలే సంపద్వంతమైన శాస్త్రీయ కళ 'మేళత్తూరు భాగవతమేళ'. ఇది తెలుగు కళారూపం కానీ, నిలబడి సాగుతున్నది తమిళనాడులోని తంజావూరు చెంత. ఈ కళారూపం నాట్యం, నాటకం మేళవింపు. ఇందులో నటన, నాట్యం, గానం, సంగీతం మూడింటిని పురుషులే నిర్వహిస్తారు. మేళత్తూరు భాగవతమేళ సాంప్రదాయ బద్ధంగా, కొన్ని కుటుంబాల మధ్యనే నిలిచిపోయింది.**



ఇప్పుడు రెండు బృందాలు ఈ మేళత్తూరు భాగవతమేళ కళారూపాన్ని పరిరక్షిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఒక బృందానికి సారథి అయిన నటరాజన్ కొన్ని సంవత్సరాల క్రితం కనుమూయగా వారి తమ్ముడు కుమార్ ఈ కృషి కొనసాగిస్తున్నారు. మరొక వ్యక్తి ఆర్.మహాలింగం అయ్యర్. మేళత్తూరులో కె.రామలింగ అయ్యర్, భాగ్యలక్ష్మి దంపతులకు 1954 సెప్టెంబర్ 13న జన్మించిన మహాలింగం ఎనిమిదేళ్ల వయసులో ఈ కళారూపంలోకి స్త్రీ పాత్రల ద్వారా ప్రవేశించారు. 1975లో ఎకనామిక్స్‌తో బీఏ పూర్తి చేసినా, ఈ కళారూపం మీద మక్కువతో ఏ ఉద్యోగంలో చేరకుండా అదే ఊరులోనే ఉండిపోయారు. పద్మశ్రీ బాలు భాగవతార్‌తో పాటు కలైమామణి పీకే సుబ్బయ్యర్, కలైమామణి టిజి పావు పిళ్ళై, కలైమామణి హేమాంబరనాథన్ వంటి వారు మహాలింగం గురువులు.

1989 నుంచి ఒక నిష్ఠగా, మహాలింగం ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఉత్సవంగా కొనసాగిస్తున్నారు. దాతల విరాళం ఉంటుంది, కానీ కొన్నిసార్లు అది సరిపోక ఇబ్బంది పడిన సందర్భాలు లేకపోలేదు. ఒకసారి అగ్ని ప్రమాదంలో ఎంతో నష్టం సంభవించింది కూడా. సినీనటుడు అరవిందస్వామి తండ్రి విడి.స్వామి మేళత్తూరు గ్రామానికి చెందినవారే. వీరు స్థాపించిన 'మెలట్టూరు భాగవతమేళా నాట్య నాటక ట్రస్ట్' నల్లి కుప్పస్వామి ఛైర్మన్‌గా ఈ కార్యక్రమాలు చేస్తోంది. ఆ గ్రామంలో ఉండే నరసింహ దేవాలయం ప్రాంగణంలోనే ఒక స్థిరమైన ఆడిటోరియం కూడా ఇప్పుడు నిర్మాణమైంది. వీటన్నిటికీ కేంద్ర బిందువుగా నిలిచింది మహాలింగం అయ్యర్. మహాలింగం తన బృందంతో ప్రదర్శనలను మేళత్తూరులో ఏటా నిర్వహిస్తూనే; తిరుపతి, హైదరాబాదు, గుంటూరు, రాజమండ్రి వంటి తెలుగు ప్రాంతాలతో సహా ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. దీనికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం, తెలుగు విశ్వవిద్యాలయం వంటివి ఎంతో కొంత సాయం చేస్తున్నాయి. కానీ ఇంకా పెద్ద ఎత్తున దోహదపడాల్సిన అవసరం ఉంది. ఈ భాగవతమేళలో పాల్గొనే నటులు వేర్వేరు ఊళ్ళలో ఉద్యోగాలు చేస్తూ ప్రదర్శన ఉన్న సమయంలో మాత్రం తప్పనిసరిగా వచ్చి పాల్గొనడం రివాజు.

ప్రధాన మేళత్తూరు భాగతమేళా ప్రతులన్నీ తెలుగులోనే ఉన్నాయి, వీటిని తెలుగు తెలియని వారు కంఠస్థం చేసి ప్రదర్శన ఇస్తున్నారు. ఇలా జరిగినప్పుడు జరగబోయే, జరిగే ప్రమాదాలు గమనించి మహాలింగం అయ్యర్ 2016 నుంచి వీటిని పరిష్కరించి ప్రచురిస్తున్నారు. అది కూడా తెలుగులో ఒక పేజీ, దాని కెదురు పేజీలో సంస్కృతంలో ఉంటుంది. ఇంతవరకు ప్రహ్లాద చరిత్ర, సీతా కళ్యాణం, మార్కండేయ చరిత్ర, ఉషా పరిణయం, కృష్ణ జననం ప్రచురించారు. ఈ సంవత్సరం మే 21వ తేదీ నరసింహ జయంతి రోజున మేళత్తూరులో 'హరిశ్చంద్ర' పుస్తక ఆవిష్కరణతో పాటు 'ప్రహ్లాద చరిత్ర' ప్రదర్శన కూడా ఉంటుంది.

▪ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

*(మే 21న నరసింహ జయంతి. మేళత్తూరులో 'ప్రహ్లాద చరిత్ర' ప్రదర్శన, 'హరిశ్చంద్ర' పుస్తకావిష్కరణ)*

## వీసీపై ఆది నుంచి వివాదాలే..

వివరాలు : 6లో..



**PUBLIC NOTICE**

[TO WHOM SO-EVER IT MY CONCERN]

It is to inform the general public that my client Smt. **KHAMAR SULTANA**, W/o. Mohammed Javid Ali, Aged 62 years. Occ: Pvt Employee, R/o. H.No.4-4-109, Kumarpalli, Hanumakonda District, Purchasing the following schedule mentioned House with Open Place bearing H.No. 1-1-506 & 1-1-506/1, (presently running business under the name and style of **ATHER Electric Bike Show Room**), to an extent of 287.50 Sq .Yards, situated at 100 Feet Main Road leads to Hyderabad, opp: NIT(New), REC(old), Waddepally Village, Hanamkonda Mandal, Hanumakonda District from its absolute owner and possessor, **Sri. CHADA SRIDEVI**, W/o, Chada Hemanth Kumar, R/o, H.No. 1-1-1090, Near Ananda Nilayam Apartments, Siddartha Nagar, Kazipet Mandal, Hanumakonda dist, under Regd. Sale Deed Doc.No. **2595/15**, Dt. 16-04-2015, in which Teen Shed with One Room vide H.No. 1-1-506 & 1-1-506/1. The aforesaid document's link document bearing Doc.No. **10087/2007**, in the respect if any person having any valid objection shall approach in person with documentary evidence within Ten(10) days to the above said purchaser (cell: 9182339317) or to the under signed office failing which my client deemed that no Claims and Objections from anybody.

**SCHEDULE OF PROPERTY**

House with Open Place bearing H.No. 1-1-506 & 1-1-506/1, (presently running business under the name and style of **ATHER Electric Bike Show Room**), to an extent of 287.50 Sq .Yards, situated at 100 Feet Main Road leads to Hyderabad, opp: NIT(New), REC(old), Waddepally Village, Hanamkonda Mandal, Hanumakonda District is bounded as follows: **East:** House of K.Aruna, **West:** House of P. Janardhan Reddy & P. Vimala Devi, **North:** House of C. Jayasree, **South:** 100 Feet Road [Hanamkonda-Hyderabad]

Date: 17-05-2024

Sd/- **(CH.AGA REDDY)**
Advocate-Notary
Nakkalagutta, Beside Andhra Bank, Hanamkonda, Warangal, Cell: 9490380382,
Client Cell No: 9948432986, 9182339317

**ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**

ప్రాంతీయ కార్యాలయం : ఎన్‌జీజీఓస్ కాలనీ, రోడ్, పాత బస్‌డిపో సమీపమున, రాంనగర్, హనుమకొండ-506001

### స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నం.54 ఆఫ్ 2002) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల అమ్మకం. బ్యాంక్ బకాయిలు ఫైన్ దిగువ వివరించిన విధంగా వడ్డీ మరియు వ్యయాలు చెల్లించుటలో విఫలమైన దీనరట బకాయిలు వసూలు కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అది" ప్రాతిపదికన దానిని విక్రయించు హక్కుతో పాటు దిగువ రుణ ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన ప్రకటనకు అనుగుణంగా దిగువ ఆస్తిని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు సదరు ఆస్తులు అమ్మకం ద్వారా బ్యాంక్ బకాయిలు వసూలు కొరకు ప్రతిపాదిస్తున్నారు. వెబ్‌పోర్టల్ (https://www.mstcecommerce.com/auctionhome/ibapi) వద్ద ఏర్పాటు చేయబడిన ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా దిగువ సంతకందారుచే అమ్మకం నిర్వహించబడును.

**హన్మకొండ శాఖ**

| క్ర. సం. | రుణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేరు మరియు చిరునామా | స్వాధీనతా విధానం & స్థిరాస్తుల వివరణ | బకాయి మొత్తం | రిజర్వు ధర (రూ.) | బయానా దాఖలుకు చివరి తేదీ & సమయం | ఇ-వేలం తేదీ మరియు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీ అనిశెట్టి వేణు(రుణగ్రహీత), తండ్రి కృష్ణయ్య, ఇ.నం.19-5-141/2, రంగసాయిపేట్, రాములువారి వీధి, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506005. | శ్రీ అనిశెట్టి వేణు పేరునగల గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుల యొక్క ప్రతీ అంతస్తులో 578.50 చ.గ.ల అర్‌సిసి ప్లింత్ ఏరియాతో 625 చ.గ.ల మొత్తం ప్లాట్ ఏరియాతో వరంగల్, రంగసాయిపేట్, సాగర వీధి వద్ద గల ఇ.నం.19-5-141/2 గల నివాసిత భవనం యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: మున్సిపల్ రోడ్, దక్షిణం: ఇతరుల ఇల్లు, తూర్పు: కృష్ణమూర్తి మరియు ఇతరుల ఖాళీ ప్రదేశం, పశ్చిమం: 2వ పార్టీ ఇ.నం.19-5-141 & 141/ఏ.(లాంఛన ప్రాయ స్వాధీనం) | 30.04.2024 నాటికి రూ. 3,85,562/- + తదుపరి వడ్డీ కాంట్రాక్చువల్ రేటు వంతున మరియు రెస్ట్‌లతో పాటు ఖర్చులు, చార్జీలు వగైరా. | రూ. 70,94,950/- బయానా: రూ. 7,09,495/- బిడ్ పెరుగుదల మొత్తం : రూ. 50,000/- 10 ని.ల ఆటో విస్తరణతో | 09-06-2024 సా. 4.00 గం.ల వరకు | 11-06-2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య |
| 2 | 1) శ్రీ వక్కల యాదగిరి (రుణగ్రహీత), తండ్రి కొమరయ్య, డి.నం.3-7, షాపురం గ్రామం, సంగం మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 2) శ్రీమతి వక్కల భాగ్యమ్మ (తనఖాదారు/హామీదారు) భర్త శ్రీ వక్కల యాదగిరి డి.నం.3-7, షాపురం గ్రామం, సంగం మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 3) శ్రీ వక్కల చిరంజీవి (హామీదారు), తండ్రి వక్కల యాదగిరి, డి.నం.3-7, షాపురం గ్రామం, సంగం మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310, టీఎస్ 503203. | శ్రీమతి వక్కల భాగ్యమ్మ, భర్త వక్కల యాదగిరి పేరునగల మొత్తం 1210 చ.గ.ల విస్తీర్ణ భూమి, తెలంగాణ - 506310, వరంగల్ జిల్లా, సంగం మండలం, షాపూర్ గ్రామం, ఇ.నం.3-7 గల నివాసిత భవనం యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: శ్రీ కె లచ్చిరెడ్డి ఇల్లు మరియు ఖాళీ ప్రదేశం, దక్షిణం: గావిచెర్ల నుండి నెక్కొండ రోడ్డు, తూర్పు: వల్లాల బుచ్చయ్య భూమి, పశ్చిమం: దాత భూమి. SARFAESI చట్టం సెక్షన్14 క్రింద వారెంట్ అందుబాటులో ఉంది: CRL M.P.No.33 OF 2024 | 04.10.2023 నాటికి రూ. 33,87,769/- + తదుపరి వడ్డీ కాంట్రాక్చువల్ రేటు వంతున మరియు రెస్ట్‌లతో పాటు ఖర్చులు, చార్జీలు వగైరా. | రూ. 44,93,000/- బయానా: రూ. 4,49,300/- బిడ్ పెరుగుదల మొత్తం : రూ. 50,000/- 10 ని.ల ఆటో విస్తరణతో | 09-06-2024 సా. 4.00 గం.ల వరకు | 11-06-2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య |
| 3 | 1) మెసర్స్ సుముఖ ఎంటర్‌ప్రైజెస్ (రుణగ్రహీత), ప్రస్తుతం దీని ప్రాతినిధ్యం వహించు యాజమాని శ్రీమతి పోలు రమాదేవి, డి.నం. 15-10-232/2, పోతన నగర్, రామన్నపేట్, వరంగల్ సిటీ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506002. 2. శ్రీమతి పోలు రమాదేవి (రుణగ్రహీత/తనఖాదారు), భర్త.కృష్ణమూర్తి, డి.నం. 2-12-278/ఏ, కెయుసి 2వ గేటుకు ఎదురుగా, విద్యారణ్యపురి, హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506001. 3. శ్రీ పోలు కృష్ణ మూర్తి (హామీదారు), తండ్రి రాంచందర్, అర్/ఓ.2-12-278/ఏ, కెయుసి 2వ గేటుకు ఎదురుగా, విద్యారణ్యపురి, హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506001. | శ్రీమతి పోలు రమాదేవి భర్త.కృష్ణమూర్తి, పేరునగల ఉమ్మడి సబ్-రిజిస్ట్రార్ వరంగల్ (అర్బన్) మరియు వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధులలో గల గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ దాని పరిధులలో వరంగల్ అర్బన్ జిల్లా, ధర్మసాగర్ మండలం, రాంపూర్ గ్రామం వద్ద గల స.నం.596లో 480 చ.గ.లు.ఖాళీ విస్తీర్ణం భూమి ఆస్తి యావత్తు. సరిహద్దులు : ఉత్తరం : అమృత య్యకు చెందిన వ్యవసాయ భూమి మరియు 30 అ.ల వెడల్పు రోడ్, దక్షిణం : శ్రీ పోలు కృష్ణమూర్తి దాత యొక్క వ్యవసాయ భూమి, తూర్పు : శ్రీ పోలు కృష్ణమూర్తి దాత యొక్క వ్యవసాయ భూమి, పశ్చిమం : శ్రీ పోలు కృష్ణ మూర్తి దాత యొక్క వ్యవసాయ భూమి, (లాంఛన ప్రాయ స్వాధీనం) | 30.04.2024 నాటికి రూ. 5,98,167/- + తదుపరి వడ్డీ వద్ద కాంట్రాక్చువల్ రేటు వంతున మరియు రెస్ట్‌లతో పాటు ఖర్చులు, చార్జీలు వగైరా. | రూ. 41,04,000/- బయానా: రూ. 4,10,400/- బిడ్ పెరుగుదల మొత్తం : రూ. 50,000/- 10 ని.ల ఆటో విస్తరణతో | 23.06.2024 సా. 4.00 గం.ల వరకు | 25.06.2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య |
| 4 | 1) మెసర్స్ నరసింహా పౌల్ట్రీ ఫామ్ మరియు ఫీడ్ (రుణగ్రహీత), ప్రాతినిధ్యం వహించు దీని యజమాని: రావుల నరసయ్య, డోర్ నం.1-192 గవిచెర్ల, సంగెం మండలం, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 2) శ్రీ రావుల నరసయ్య (రుణగ్రహీత/తనఖాదారు), తండ్రి రాములు, నివాసం1-192 గవిచెర్ల, సంగెం మండలం, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 3) శ్రీమతి రావుల సుగుణమ్మ (హామీదారు/ తనఖాదారు), భర్త రావుల నరసయ్య, నివాసం 1-192 గవిచెర్ల, సంగెం మండలం, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 4) శ్రీ రావుల రామకృష్ణ (హామీదారు), తండ్రి రావుల నరసయ్య, నివాసం1-192 గవిచెర్ల, సంగెం మండలం, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506310. 5) శ్రీ జినుకల నర్సయ్య (హామీదారు/ తనఖాదారు), తండ్రి మల్లయ్య, నివాసం 5-38, లక్ష్మిపల్లి, రామవరం గ్రామం, నరసంపేట్ మండలం, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506331 | తెలంగాణ రాష్ట్రం యొక్క వరంగల్ జిల్లా, పిన్‌కోడ్ :506310 సంగెం మండలం, గవిచెర్ల గ్రామం వద్దగల 1071 చ.అ.ల ప్లింత్ ఏరియాతో 194 చ.గ.ల భూమి మొత్తం గల ఇ.నం.1-156 తో కూడిన ఎమ్‌టి రూఫ్ నివాసిత భవనం యావత్తు. (తనఖాదారు-శ్రీమతి రావుల సుగుణమ్మ, భర్త రావుల నర్సయ్య), సరిహద్దులు ఉత్తరం: శ్రీ రావుల నర్సయ్య ఇల్లు, దక్షిణం: 12 అడుగుల రోడ్డు, తూర్పు: శ్రీ రావుల నర్సయ్య ఇల్లు, పశ్చిమం: శ్రీ రావుల రామచంద్రు ఇల్లు. SARFAESI చట్టంలోని సెక్షన్14 క్రింద వారెంట్ అందుబాటులో ఉంది: CRL. M.P.No.31 OF 2024 | 08.01.2024 నాటికి రూ. 48,33,726/- + తదుపరి వడ్డీ మరియు కాంట్రాక్చువల్ రేటు వంతున ఖర్చులు, చార్జీలు వగైరా. | రూ. 11,84,650/- బయానా: రూ. 1,18,465/- బిడ్ పెరుగుదల మొత్తం : రూ. 50,000/- 10 ని.ల ఆటో విస్తరణతో | 23.06.2024 సా. 4.00 గం.ల వరకు | 25.06.2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య |

ఖాతా వివరాలు : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఖాతా పేరు : SARFAESI సేల్ పార్కింగ్ అకౌంట్, ఖాతా నం. **01730113035001**, IFSC కోడ్: IOBA0000173. కాగోరు టెండరుదారులు అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఆఫీసు పని వేళలలో సంప్ర. ఫోన్ : **0870-2577083** , మొబైల్ నం. **9340503248**

* చట్టబద్ధమైన బకాయిల కంటే బ్యాంకు బకాయిలకు ప్రాధాన్యత కలదు & స్థానిక సెల్ఫ్ గవర్నమెంట్ యొక్క బకాయి మొత్తాలు రూ. లేవు. (ఆస్తి పన్ను, నీటి కాల్స్, విద్యుత్ బిల్లులు మొదలైనవి) నియమాలు మరియు నిబంధనల కొరకు https://www.mstcecommerce.com/auction/home/ibapi (సర్వీసు ప్రొవైడర్ యొక్క ఇ-వేలం వెబ్ పోర్టల్) బ్యాంకు ఆమోదిత సర్వీసు ప్రొవైడర్ M/s. MSTC Ltd. 225-c, A.J.C. బోసురోడ్, కలకత్తా-700020. సంప్రదించు నం. 033-22901004, https://www.ibapi.in; https://www.mstcecommerce.com/auction/home/ibapi

ప్రదేశము : వరంగల్, తేది : 17.05.2024 — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్



## రూ.10లక్షల కోట్లతో వరంగల్ అభివృద్ధి

- రైల్వే వ్యాగన్ కోచ్, మెగాటెక్స్‌టైల్, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- రామప్పకు యునెస్కో గుర్తింపు
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

- 7లో..



## ప్రజా గొంతుకనై పోరాడుతా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి
- మడికొండలో ఎన్నికల సన్నాహక సమావేశం

వివరాలు : 7లో..

# ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పరకాల వాసి

**తెలంగాణ రాష్ట్ర కీర్తిని నలు దిశలా చాటిన చిరంజీవి**



ఎవరెస్ట్ శిఖరంపై చిరంజీవి

పరకాల, మే 18: పరకాల పట్టణానికి చెందిన ఏకు చిరంజీవి ఎవరెస్ట్ శిఖరాన్ని శుక్రవారం అధిరోహించారు. ఈ నెల 9న నేపాల్ దేశంలో అడుగుపెట్టి కాలినడకన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ 8 రోజులు శ్రమించి ఈ నెల 17న ఉదయం 11.55 నిమిషాలకు ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం ఎవరెస్ట్ బేస్ క్యాంపును చేరుకున్నారు. ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఎవరెస్ట్ శిఖరం బేస్‌క్యాంప్ మీద సముద్రమట్టం 17వేల 598 అడుగులు (5వేల 364 మీటర్లు) ఎత్తులో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా భరతమాత చిత్రపటంతోపాటు జాతీయజెండాను రెపరెపలాడించాడు. అదే విధంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్, భగత్‌సింగ్‌ల చిత్రపటాలను సైతం ఆవిష్కరించి దేశ ఔన్నత్యాన్ని చాటారు. కాలినడక 130 కిలోమీటర్లు, 14 రోజులపాటు సాగిన ఈ సాహస ప్రయాణాన్ని కొనసాగించి దేశానికి తిరిగి రాబోతున్నారు. ఇంతకుముందు 2022లో దేశంలోని ఉత్తరాఖండ్, కేదార్ కంఠపర్వతం మీద 13500 అడుగుల ఎత్తులో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించి నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసిన ఘనత చిరంజీవికి ఉంది. ఈ సందర్భంగా చిరంజీవిని పలువురు అభినందించారు.



# ఆది నుంచి వివాదాలే..

**కేయూ వీసీ రమేష్‌పై అవినీతి, అక్రమాల ఆరోపణలు**

**'ఆంధ్రజ్యోతి' కథనాలు, అకుట్ ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలు**

**యూనివర్సిటీ చరిత్రలోనే మొదటిసారిగా వీసీపై విజిలెన్స్ విచారణ**



వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఉపకులపతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టడం మొదటి సారి కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలకు వీసీల నియామకం చేపడుతున్న క్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌పై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. జూన్ 2021లో వీసీగా పదవి చేపట్టిన నాటి నుంచి ప్రొఫెసర్ రమేష్ వివాదాల సుడిగుండంలో చిక్కుకునే ఉన్నారు. అప్పట్లో ఆయన నియామకమే చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో వీసీ పదవి పొందారని బాహాటంగానే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రమేయంతోనే రమేష్ కేయూ వీసీ అయ్యారని వర్సిటీలో ప్రచారం జోరుగానే సాగింది. ఇక కేయూలో భూముల అన్యాక్రాంతం, అధ్యాపకుల నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల్లో జరిగిన పలు అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం, అకుట్, తదితర అధ్యాపక సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో శనివారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం వీసీ రమేష్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### వివాదాల సుడిగుండలోనే..

కేయూ వీసీగా ప్రొఫెసర్ టి.రమేష్ నియామకమైన నాటి నుంచి వివాదాల సుడిగుండలోనే చిక్కుకునే ఉన్నారు. ఆయన నియామకం మొదలుకొని పెన్షన్ ఫైల్ వరకు అన్నీ అవినీతి, అక్రమాల ఆరోపణలతోనే విమర్శలను ఎదుర్కొంటూ వస్తున్నారు. అక్రమంగా పదోన్నతి పొంది వీసీగా నియామకమైనట్లు వర్సిటీవర్గాలు ఆయన నియామకాన్నే వ్యతిరేకించాయి. జూన్ 2021న అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతోనే వీసీగా నియమితులయ్యారని వర్సిటీ వర్గాలు మొదటి నుంచి ఆక్షేపిస్తూనే ఉన్నాయి. అప్పటి ఎమ్మెల్సీ ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి దగ్గరైన రమేష్.. ఆయన పైరవీతోనే వీసీ అయ్యారని బాహాటంగానే విమర్శలు వెల్లువెత్తాయి.

### అవినీతి, అక్రమాల ఆరోపణలు

వీసీ రమేష్‌పై అకుట్‌తో పాటు పలు అధ్యాప సంఘాలు తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేస్తూనే వచ్చాయి. ఆయన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా పలుమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా 16మంది రిటైర్డ్ అధ్యాపకులను అడ్జంట్ ఫ్యాకల్టీగా నియమించి రూ.8లక్షలు ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసినట్లు ఆరోపణలున్నాయి. కేయూ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోకుండా కబ్జాదారులకు కొమ్ముకాసినట్లు విమర్శలున్నాయి. పాలకమండలి లేకుండానే అక్రమ ప్రమోషన్లకు పాల్పడ్డారని, పీహెచ్‌డీ ప్రవేశాల్లో సైతం వీసీ రమేష్ అవినీతికి పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. వీసీగా తన అనర్హత కేసును వాదించేందుకు సంబంధలేని అడ్వకేట్‌కు లక్షల రూపాయలు ఇచ్చారని, యూనివర్సిటీలో స్టాండింగ్ కౌన్సిల్ ఉండగా అదనంగా మరో న్యాయవాదితో వకాలత్ చేయించి అదనంగా రూ.5లక్షలు చెల్లించన విమర్శలను ఆయన ఎదుర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అక్రమ బదిలీలు, ప్రమోషన్లకు, పాలక పదవులు కట్టబెట్టి అవినీతికి పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి.

### గత ప్రభుత్వ పార్టీకి అనుకూలం

వీసీ రమేష్ గత పాలక ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీకి తొత్తుగా ఉంటూ ఆ పార్టీ పెద్దలు చెప్పిన పనులు చక్కబెట్టినట్లు సైతం విమర్శలు వెల్లువెత్తాయి. కేటీఆర్ చెప్పారని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్ రావు దగ్గరి బంధువైన ఖమ్మం పీజీ కళాశాలలో పనిచేస్తున్న రజిత అనే మహిళా లెక్చరర్‌ను హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలకు బదిలీ చేశారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే వర్సిటీ పాలన కొనసాగించినట్లు అధ్యాపక సంఘాలు బాహాటంగానే విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వంలో వీసీ రమేష్‌పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనంగా అధ్యాపకవర్గాలు చెప్పుకుంటున్నాయి.

### ఆంధ్రజ్యోతి కథనాలు, అకుట్ ఫిర్యాదుతో..

కేయూ వీసీ రమేష్ అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలతో పాటు అకుట్, ఇతర అధ్యాపక సంఘాల ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఆంధ్రజ్యోతిలో మార్చి 23న 'అక్రమాలకు కేరాఫ్ కేరాఫ్ కేయూ', ఏప్రిల్ 6న 'కేయూ కబ్జాలపై చర్యలేవి', మే 17న(శుక్రవారం) ప్రచురితమైన 'కేయూ ప్రక్షాళన జరిగేనా' తదితర కథనాల నేపథ్యంలో ప్రభుత్వం ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించింది. అలాగే వర్సిటీలోని అకుట్‌తో పాటు వివిధ అధ్యాపక సంఘాలు వీసీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేయడంతో స్పందించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. వీసీపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సిందిగా వెంకటేశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా వుండగా, ఈ నెల 21న ఆయన పదవీకాలం ముగియనుండడం.. అంతలోనే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం.. వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## విచారణను స్వాగతిస్తున్నా.. : వీసీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిని విజిలెన్స్ విచారణను స్వాగతిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ టి. రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీసీగా మూడేళ్ల పదవీకాలంలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఇక్కడే విద్యనభ్యసించి 30 ఏళ్లకు పైగా పనిచేశానని పేర్కొన్నారు. వీసీగా ప్రతికూల పరిస్థితులను అధిగమించి వర్సిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. తన కృషి ఫలితంగానే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. జాతీయ స్థాయిలో వర్సిటీ హోదా, ప్రతిష్టను పెంపొందించినట్లు పేర్కొన్నారు. తన హయాంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను నిర్వహించామని తెలిపారు. సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన అన్ని రకాల బకాయిలు, అందాల్సిన సదుపాయాలు అందించానని పేర్కొన్నారు. యూనివర్సిటీ చరిత్రలోనే మొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 507 మంది దినసరి, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు 4 నుంచి 5 రెట్లు పెంచామని తెలిపారు. వర్సిటీలో అధ్యాపకులు కొరత ఉన్నప్పటికీ 300 మందికి పైగా నిబంధనల మేరకు పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో తనపై కొందరు ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి విచారణ చేపట్టగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిబంధనల మేరకే పారదర్శకంగా జరిగాయని నివేదిక ప్రభుత్వానికి అందించిందని తెలిపారు. తన కాలంలో ఒక్క పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ జరగలేదని స్పష్టం చేశారు. యూనివర్సిటీకి సంబంధించి ఒక్క గుంట భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగానని తెలిపారు. దొడ్డిదారిలో ప్రమోషన్లు పొందాలని, వర్సిటీ అభివృద్ధిని ఓర్వలేక, వర్సిటీ ప్రతిష్టను దిగజార్చే వ్యక్తులు, అక్రమంగా అడ్మిషన్లు కావాలని గగ్గోలు పెట్టిన వారు చేసిన ఫిర్యాదు మీద ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టడాన్ని తాను హర్షిస్తూ స్వాగతిస్తున్నానని వీసీ పేర్కొన్నారు.

# రూ.10లక్షల కోట్లతో వరంగల్ అభివృద్ధి

- రైల్వే వ్యాగన్ కోచ్, మెగాటెక్స్‌టైల్, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- రామప్పకు యునెస్కో గుర్తింపు
- రూ.500కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మే18: వరంగల్ నుంచి బీజేపీ ఎంపీల ప్రాతినిథ్యం లేకున్నప్పటికీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు రూ.10 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా హంటర్‌రోడ్డులో శనివారం జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన జరిగిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనం, ఉమ్మడి జిల్లాలోని బీజేపీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశాల్లో వేర్వేరుగా కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాకముందు 2,500 కిలోమీటర్ల మేరకే జాతీయ రహదారులుంటే.. ఈ 9 యేళ్లలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న దేశాన్ని.. మోదీ ప్రపంచంలోనే 5వ ఆర్థిక శక్తి మార్చాడని గుర్తు చేశారు. రామగుండంలో థర్మల్ ప్రాజెక్టును ఏర్పాటు చేసి విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటిగా రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి చేశారన్నారు. వేయిస్తంభాల గుడి కల్యాణ మండప పనులను పునరుద్ధరించామన్నారు. దేశంలో 7 మెగా టెక్స్‌టైల్స్ ఉంటే.. ప్రధాని మోదీని ఒప్పించి అందులో ఒకటి వరంగల్‌కు తీసుకు వచ్చామన్నారు. రైల్వే వ్యాగన్‌నుకు శంకుస్థాపన చేసుకొని పనులను వేగవంతంగా చేసుకుంటు న్నామన్నారు. మెనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆర్టికల్ 370ని రద్దు చేశామన్నారు. ధర్మం కోసం, గౌరవం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని, మోదీ ద్వారా దేశానికి గౌరవం దక్కిందన్నారు. మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పుడు 270, రెండోసారి 307 సీట్లు వచ్చాయని, మూడోసారి 400 సీట్లలో బీజేపీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిగా మళ్లీ మోదీ బాధ్యతలు చేపట్టబోతున్నాడని పేర్కొన్నారు.

ప్రతిపక్ష నాయకులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతూ నమ్మిన ప్రజలను మోసం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కడియం, దానం నాగేందర్‌లను నమ్మి ప్రజలు గెలిపిస్తే సిగ్గులేకుండా ఆ పార్టీ రాజీనామా చేయకుండానే అధికార పార్టీలోకి చేరారని మండిపడ్డారు. దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి తేల్చుకోవాలన్నారు. బీజేపీలో 8మంది ఎమ్మెల్యేలున్నారని, వారంతా తెలంగాణ ప్రజల హక్కుల కోసం కొట్లాడుతారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ లెక్క నమ్మిన ప్రజలను మోసం చేయరని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనని, రెండు వేర్వేరు కాదన్న విషయం ప్రజలు గమనించాల న్నారు. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో కి వస్తున్నారని రేవంత్‌రెడ్డి అంటున్నాడని గుర్తుచేశారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతోందని విమర్శించారు. తెలంగాణ సాధనలో సుష్మాస్వరాజ్, ఎల్‌కే అద్వానీ ఆధ్వర్యంలో బీజేపీ ఉద్యమించిన విషయం, జేఏసీతో కలిసి పనిచేసిన విషయం ఉద్యోగులు, మేధావులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కిషన్ రెడ్డి కోరారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 12 సీట్లు బీజేపీ గెలవబోతోందని, అదే స్ఫూర్తితో ఎమ్మెల్సీని గెలిపించి విద్యావంతులు తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టభద్రుల ఎన్నికల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు జనార్ధన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, అజ్మీరా సీతారాంనాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యేగా పోటీచేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# నేను ప్రశ్నించే గొంతుకను..

- మేధావులనే శాసనమండలికి పంపాలి..
- బీజేపీ నన్ను రాజకీయంగా హత్య చేస్తే.. కేసీఆర్ ఆదరించారు..
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు కావడంలేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి


మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

వడ్డెపల్లి, మే 18: ప్రజా, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడి ప్రశ్నించే గొంతుకను అవుతానని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. మేధావులు, విద్యావంతులు తనను ఆశీర్వదించి శాసనమండలికి పంపించాలని కోరారు. మోసగాళ్లు, బ్రోకర్లకు అవకాశం ఇస్తే గోసపడక తప్పదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ తనను రాజకీయంగా హత్య చేసి నడిబజారులో పడేస్తే కేసీఆర్ చేరదీసి గుండెల్లో పెట్టుకున్నారని రాకేష్‌రెడ్డి ఆవేదనతో చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు కావడం లేదని ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆరోపించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వచ్చే వేతనంతో పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రాకేష్‌రెడ్డి తెలిపారు. మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ ఏర్పాటుతో పాటు ఉద్యోగుల పీఆర్సీ సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. వరంగల్‌లో వరదలొస్తే వందలాది మందికి ఆహార ప్యాకెట్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో రెడ్‌జోన్‌లలో తిరిగి ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు వారికి అవసరమైన నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 34 శాసనసభ నియోజకవర్గాల్లో 32మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారని, కేవలం బీఆర్ఎస్‌కు చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని రాకేష్‌రెడ్డి చెప్పారు. బలమైన ప్రతిపక్షం బలమైన నాయకుడిని మండలికి పంపిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. జీవో నంబర్ 46 రద్దు చేస్తామని చెప్పినా.. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ఐదు నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత జీవో నంబర్ 46 రద్దు కోసం ప్రజలతో కలిసి పోరాడు తానని చెప్పారు. తనను ఆదరించి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాకేష్‌రెడ్డి కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్ లెనిన్, గాడిపెల్లి మధు, మస్కపురి సుధాకర్‌తో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుకనై పోరాడుతా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి
- మడికొండలో ఎన్నికల సన్నాహక సమావేశం


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

మడికొండ, మే 18: తనను ఆశీర్వదించి మండలికి పంపిస్తే ప్రజా గొంతుకనై సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య అధ్యక్షన జరిగిన ఎమ్మెల్సీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలని, వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని విదేశాల్లో ఉన్నతమైన ఉద్యోగం వదిలి వరంగల్‌కు వచ్చానన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ కాంగ్రెస్ పార్టీ చెప్పిన మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు వారికి పట్టం కట్టారన్నారు. జాబ్ క్యాలెండర్ హామీ మీద ఇప్పటివరకు ఒక్క ప్రకటన లేదని, నాలుడు వేల నిరుద్యోగుల భృతి మీద చర్చ లేదన్నారు. మెగా డీఎస్సీ మీద ఒక్క మాటలేదని, అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీని గెలిపిస్తే ప్రజాపక్షమై, ప్రజా గళమై, ప్రజాగొంతుకై మండలిలో పోరాడే వ్యక్తిని పంపినట్లవుతుందని తెలిపారు. విద్యావంతులు, నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పట్ల తనకు సంపూర్ణమైన అవగాహన ఉందని, వారి సమస్యల పై పోరాటం సాగించి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన మాయ మాటలతో, ప్రతీ రోజూ పార్టీలు మారుతూ, బెదిరిస్తూ బ్రోకరిజం చేసే తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నీతి, నిజాయితీతో పేదలకు సేవ చేయాలని వచ్చిన రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి చట్ట సభకు పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సుధీర్‌కుమార్, కుడా మాజీ ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికల నిధుల దుర్వినియోగం

- కొందరు అధికారుల నిర్వాకం
- ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు
- విచారణకు కలెక్టర్‌కు సీఈవో ఆదేశం

హనుమకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొందరు అధికారులు నిధులు వినియోగంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. సుమారు రూ.80లక్షల నుంచి రూ.90లక్షల మేరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతాయుతమైన పౌరుడి పేరుతో ఒక అజ్ఞాత వ్యక్తి ఈ విషయమైన ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశాడు. సీఈవో ఈ విషయమై విచారణ జరపాల్సిందిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కోరారు. వివరాల్లోకి వెళితే..

కిందటేడు నవంబరులో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టరేట్లకు అందుబాటులో ఉంచింది. ఇదే అవకాశంగా తీసుకొని కొందరు అధికారులు నిధుల వినియోగంలో చేతివాటం ప్రదర్శించినట్లు ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాడు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో కీలక హోదాలో ఉన్న ఒక అధికారి, ఒక డిప్యూటీ తహసీల్దార్ దొంగ బిల్లులు పెట్టి సుమారు రూ.80 నుంచి రూ.90లక్షల వరకు దుర్వినియోగం చేశారని, కలెక్టర్‌ను తప్పుదోవపట్టించారని అందులో పేర్కొన్నాడు. మరో డిప్యూటీ తహసీల్దార్ పరకాల నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పెద్దఎత్తున నిధులను దుర్వినయోగానికి పాల్పడ్డాడని, ఇట్లా అడ్డంగా సంపాదించిన నిధులతో ఇటీవలే విలాసవంతమైన కియా కార్‌ను కొనుగోలు చేశాడని, అంతే కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో కూడా నిధుల దుర్వినియోగానికి ఎత్తుగడ వేశాడని తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు నాటికి హనుమకొండ కలెక్టర్‌లో పని చేసిన పూర్వ ఆర్‌డీవోకు అత్యంత సన్నిహితులైన మరో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు కూడా తప్పుడు బిల్లులు సమర్పించి పెద్ద మొత్తంలో నిధులు స్వాహా చేశారని కూడా ఆరోపించారు. ఈ నలుగురు ఉద్యోగులు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ నాయకులకు పూర్తిగా సహాయ, సహకారాలు అందించి తద్వారా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించారని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆయన కోరారు. తన దగ్గర పూర్తి వివరాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదుపై సీఈవో వికాస్‌రాజ్ సానుకూలంగా స్పందించారు. దీనిపై విచారణ జరపాల్సిందిగా కోరుతూ హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను ఆదేశించారు. కలెక్టర్ దీనిపై అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై కలెక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఫిర్యాదు అందగానే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.


ర్యాంకులు సాధించిన ఎస్సార్ విద్యార్థులు

# ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎంపీసీ విభాగంలో కొంతం మణితేజ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించగా దొంతుల మనీష్ 24, టి. తేజస్వీ 161, ముంకాల గణేష్ 199, కె. శ్రీరామ్‌రెడ్డి 291, చల్ల హర్షిత 334, ఆర్. దీపాన్షరెడ్డి 412, కె.వర్షిణి 494, ఎస్.రాహుల్ 546, జి.రాజీవ్ 552, అబుతల్హా 554 ర్యాంకు సాధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను వినూత్నమైన పద్ధతుల్లో బోధించడం వల్లనే నిరంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని వరదారెడ్డి అన్నారు. 50 యేళ్లుగా పటిష్టమైన ప్రణాళికతో హైస్కూల్, జూనియర్ కళాశాలలు, ఎప్‌సెట్, ఐఐటీ, నీట్‌లలో బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఎస్సార్ విద్యార్థులు ఎప్పటికప్పుడు ఫలితాల్లో ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పుతున్నారన్నారు. డైరెక్టర్లు సంతోష్ రెడ్డి, మధుకర్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

# శివాని విద్యార్థుల విజయదుందుభి


ర్యాంకులు సాధించిన శివాని విద్యార్థులు



వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయదుందుభి మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు చరిత్ర తిరగరాస్తూ మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గుర్రం వర్షిత 3854 ర్యాంకు, చీమకుర్తి సాద్విక 4036, వోడపెల్లి అస్మిత 5731, కుసుమ శ్రీజ 6316, దాసరి స్వేత 8917, తిప్పారపు గణేష్ 9080, అరికిల్ల నిస్సి 9732, రాయబోయిన తిరుపతి 9813, వడ్డె రిషితప్రియ 10668 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు సైతం ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ టి.స్వామి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేశ్, ఏ.మురళీధర్, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

# ఎంసెట్‌లో షైన్ విజయకేతనం


ర్యాంకులు సాధించిన షైన్ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: ఎంసెట్ - 2024 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 466, 1370 ర్యాంకు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు షైన్ విద్యాసంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తెలిపారు. మెడికల్ కేటగిరిలో టి.హేమప్రియ 466, ఎండి.సోహెల్ 732, ఆర్.వైష్ణవి 7645, ఆర్.ధనస్మిత 8525 సాధించగా, ఇంజనీరింగ్ కేటగిరిలో వి.సరయురెడ్డి 1370 ర్యాంకు, సిమి రిజ 1385 ర్యాంకు, బి.రుణ్ 3154, సిహెచ్.చరణ్‌తేజ 6371, పి.జయంత్ 9103 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు మెడికల్ కేటగిరిలో 22 మంది విద్యార్థులు 15వేల లోపు మార్కులు, ఇంజనీరింగ్ కేటగిరిలో 36 మంది 15వేలలోపు మార్కులు సాధించారని ఆయన తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ, మోటివేషన్‌తో మాములు విద్యార్థులను కూడా తీర్చదిద్దుతామన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగుల రమ, మూగుల రమేశ్, మారబోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాస్‌గౌడ్, ప్రవళిక, అధ్యాపక బృందం అభినందించింది.

# భద్రకాళి దేవికి వసంతోత్సవం



వరంగల్ కల్చరల్, మే 18: నగరంలోని భద్రకాళి దేవస్థానంలో శనివారం (తొమ్మిదో రోజు) భద్రకాళి అమ్మవారికి వసంతోత్సవం పూజలు కన్నుల పండువగా జరిగాయి. ప్రధానార్చకులు భద్రకాళి శేషు వసంతోత్సవం పూజలు నిర్వహించారు. తెలంగాణ, వరంగల్ ఉమ్మడి జిల్లా గౌడ సంఘం ఉభయ దాతలుగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో కుల పెద్దలు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం సర్వభూపాల వాహనంపై ఉత్సవమూర్తి ఊరేగారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నకిరేకంటి మోహన్‌గౌడ్, చింత రమేష్‌గౌడ్, దూలం రాజేందర్‌గౌడ్, పరమేశ్వర్‌గౌడ్, రాజుగౌడ్, రజినీకాంత్ గౌడ్, బీమగాని సౌజన్య పాల్గొన్నారు.





## ఇంటర్ వర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: ఇంటర్ వర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఎంపికవడం హర్షనీయమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అన్నారు. కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విగ్నేష్, లక్ష్మీప్రణయ్‌లు ఎంపికయ్యారన్నారు. చెన్నైలోని ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, పీడీ డాక్టర్ భాస్కర్‌లతో కలిసి అభినందించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

## బీజేపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడాలి

**కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి**

**హసన్‌పర్తిలో పట్టభద్రుల సన్నాహక సమావేశం**

హసన్‌పర్తి, మే 18: ప్రతీ ఒక్క కార్యకర్త కష్టపడితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు బీజేపీదేనని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. హసన్‌పర్తి బీజేపీ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు బాధ్యతాయుతంగా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తే గెలుపు మనదే అవుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే స్థితిలో, బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో యువకులు లేరన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ లోక్‌సభ ప్రభారి మురళీధర్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, నాయకులు మారెపెల్లి రాంచంద్రారెడ్డి, తాళ్లపెల్లి కుమా రస్వామి, పిట్టల కుమారస్వామి, పృథ్వీరాజ్‌గుప్త, మేకల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తికావొస్తున్న ధాన్యం కొనుగోళ్లు

**• ఇప్పటికే 61.59 వేల మెట్రిక్ టన్నులు సేకరణ • రూ.115 కోట్లు చెల్లింపులు**

**• నాలుగు మండలాల నుంచి ధాన్యం రాక ఆలస్యం • జూన్ 10వ తేదీలోగా కొనుగోళ్లు పూర్తి**



హనుమకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు దాదాపు తుది దశకు చేరుకున్నది. జిల్లాలోని 14 మండలాల్లో నాలుగు మినహా మిగతా పది మండలాల్లో కొనుగోలు పూర్తి కావొచ్చాయి. ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల మండలాల్లో పంట ఆలస్యంగా చేతికి రావడంవల్ల కొనుగోళ్లు ఇటీవలే ప్రారంభమయ్యాయి. అన్ని మండలాల్లో జూన్ 10వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు పూర్తవుతాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలోనూ ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం కలుగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

### 61.59వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు

జిల్లాలో శుక్రవారం వరకు మొత్తం 61,591 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్ ఏ రకం ధాన్యం 58,527 మెట్రిక్ టన్నులు కాగా, కామన్ రకం 3,064 మెట్రిక్ టన్నులు. ఈ మొత్తాన్ని 160 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఇందులో ఐకేపీ 48 కాగా, పీఏసీఎస్ 112. ఐకేపీల కన్నా పీఏసీఎస్ కేంద్రాల ద్వారానే ఎక్కువ ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. వీటి ద్వారా 44,911 మెట్రిక్ టన్నులు సేకరించగా, ఐకేపీ ద్వారా 16,660 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించారు. కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో 61,073 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించారు. ఇంకా 518 మెట్రిక్ టన్నులను తరలించాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో దీనిని కూడా తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### చెల్లింపులు

కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు వెంటవెంటనే చెల్లింపులు జరుపుతున్నారు. 12,991 మంది రైతుల నుంచి సేకరించిన మొత్తం ధాన్యం విలువ రూ.135.62కోట్లు కాగా, ఈ మొత్తంలో 52,206 మెట్రిక్ టన్నులకు సంబంధించి 11,854 మంది రైతులకు రూ.115కోట్లను (91.41 శాతం) చెల్లించారు. మిగతా రైతుల చెల్లించాల్సిన డబ్బు వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. వీరికి వారం రోజుల్లో చెల్లింపులు జరుగనున్నాయి. ధాన్యం రాక పూర్తికావడంతో ఆరు కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. ఈ యాసంగిలో 90వేల మెట్రిక్ టన్నులను సేకరించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంకా 29వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల మండలాల్లో సేకరించే ధాన్యంతో టార్గెట్ పూర్తవుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు యాసంగి సీజన్‌లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, తదితర ప్రాంతాల్లో రైతులు సన్నధాన్యాన్ని ఎక్కువగా సాగు చేయడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మిల్లర్లు సైతం రూ.2,500 నుంచి రూ.2,800వరకు కొనుగోలు చేశారు. దీనితో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండా నేరుగా మిల్లర్లకే విక్రయించారు. ఈ కారణంగా కేంద్రాలకు అనుకున్నదానికన్న తక్కువ ధాన్యం వచ్చిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### స్థలం లేక ఇబ్బందులు

గత సీజన్లలో రాష్ట్రవ్యాప్తంగా మిల్లుల్లో పేరుకు పోయిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు బహిరంగ మార్కెట్‌లో టెండరు దర ప్రకారం అమ్మేసింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సదరు ఏజెన్సీ నిర్వాహకులు మిల్లుల నుంచి ఖాళీ చేయడం లేదు. ధాన్యం తరలింపులో ప్రభుత్వం సైతం సదరు ఏజెన్సీలపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పక్షం రోజుల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలోనూ భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో విల్లుల్లో స్థలం లేకపోయినా కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో తరలివస్తున్న ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో తెలియక మిల్లర్లు తలలు పట్టుకుంటున్నారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు వెంట వెంటనే మిల్లులకు తరలిస్తుండడంతో అన్‌లోడ్ చేసుకోవడంలో మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



ఆరాధనోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, మే 18: వరంగల్ భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం నేత్రపర్వంగా జరిగా యి. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, దేవాలయం అధ్యక్షుడు మారేడోజు సదానందచారి, ప్రధాన కార్యదర్శి జల్లపెల్లి పెం టయ్యచారి, సలహాదారులు కొక్కొండ శంకరయ్య, గౌరవ అధ్యక్షుడు రామగిరి సోమలింగాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు జరిగాయి. వేద పండితులు శ్రీనివాసచార్యులు, వినితాచార్యులు ఆలయంలో ఉదయం నుంచి హోమాలు, ప్రత్యేకపూజలు వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. వైశాఖ శుద్ధ దశమి రోజున వీరబ్రహ్మేంద్రస్వామి సజీవంగా భూఅంతర్భాగంలో తపోశక్తితో ఉండడం జరిగిందని తెలిపారు. ఆ రోజును ఆరాధన మహోత్సవంగా జరుపబడుతుందని పురోహితులు తెలిపారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నోజు రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు శ్రావణపెల్లి రవీంద్రచారి, కార్యదర్శి వెలిషోజు వెంకటేశ్వర్లు, వెలిసోజు సాంబయ్య, రాంపెల్లి శేఖర్, వెలిషోజు రమణాచారి, బీజేపీ నాయకులు పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వర్‌రావు, మారెపెల్లి రాంచంద్రారెడ్డి, శీలం యాదిగిరి, మేకల హరిశంకర్, దాసరి రాజు, ఎస్టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి చేయండి

**నగర పాలక సంస్థ కమిషనర్**

**అశ్విని తానాజీ వాకడే**



బాలసముద్రంలో డిసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 18: వరంగల్ నగరంలోని 66 డివిజన్‌ల పరిధిలో నాలాల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను వేగవంతంగా పూర్తిచేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం వరంగల్ నగరంలోని పలుప్రాంతాల్లో డిసిల్టింగ్ పనులను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. కేడీసీ, జ్యూపార్క్, నందిహిల్స్, జులైవాడ, కాజీపేట, రాంనగర్, అంబేద్కర్‌భవన్, గుండ్ల సింగారం ప్రాంతాల్లో డిసిల్టింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో వారం రోజుల్లో డిసిల్టింగ్ పనులు పూర్తిచేయాలని అన్నారు. నాలాల్లో వరదనీరు ఆటంకం లేకుండా సక్రమంగా ప్రవహించే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డిసిల్టింగ్ పనులు పక్కాగా జరిగితే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడరని అధికారులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, శ్రీకాంత్, ఏఈలు హరికుమార్, మేనక, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పోలెపాక అనీల్, కరుణాకర్, భీమయ్యలు పాల్గొన్నారు.

### పారిశుధ్య సిబ్బంది గైర్హాజరుకాకుండా చూడండి

గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు గైర్హాజరు కాకుండా చూడాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డంపర్‌బిన్‌లు, కాంపాక్ట్ బిన్‌లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైనేజీలు, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ప్రతీరోజు డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని సూచించారు. అధికారులు పారిశుధ్య సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులు చేయించాలని అన్నారు. అంతేకాకుండా పారిశుధ్య సిబ్బంది హాజరుపట్టికను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. అధికారులు లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని అన్నారు. పారిశుధ్య సమస్యలపై ఎస్ఐలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికుల పనితీరుపై ఒక డ్రాఫ్ట్ తయారు చేయాలని సీఎంహెచ్‌వో రాజేశ్‌ను ఆదేశించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా, లిఫ్టింగ్ చార్జిలు వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, భాస్కర్, నరేందర్‌లతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**గ్రూప్-1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మే18: ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత, పర్యవేక్షణ ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులకు పరీక్షల నిర్వహణకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో మూడు కిలోమీటర్ల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్‌లను మూసివేయించాలని కలెక్టర్ సూచించారు.

### గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

టీఎస్‌పీఎస్ గ్రూప్-1 పరీక్షను జిల్లాలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జూన్ 9వ తేదీన నిర్వహించే ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని, 22,665 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం దగ్గర బందోబస్తు కోసం ఇద్దరు మహిళా, ముగ్గురు పురుష కానిస్టేబుళ్లను నియమించాలన్నారు. పరీక్ష జరిగేరోజు విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చూడాలన్నారు. ఆర్టీసీ బస్సులు ఉదయం 6గంటల నుంచి అభ్యర్థుల సౌకర్యార్థం నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. రవాణా శాఖ అధికారులు ప్రశ్నాపత్రాల చేరవేతకు, పరీక్ష అనంతరం తిరిగి తీసుకువచ్చేటప్పుడు తగినన్ని వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్ రెడ్డి, డీసీపీ రవీందర్, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి గోపాల్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 11 తులాల బంగారం చోరీ

హసన్‌పర్తి, మే 18: ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్థరాత్రి ఇంట్లో దొంగలు చొరబడి బంగారు నగలు, వెండి, డబ్బును దోచుకెళ్లిన సంఘటన హసన్‌పర్తిలోని నల్లగుట్టు గుట్ట ఎదురుగా గల శివసాయికాలనీలో జరిగింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి శివసాయి కాలనీకి చెందిన మహ్మద్ ఖురేషి ప్రైవేటు ఉద్యోగి. శుక్రవారం రాత్రి ఖురేషి కుటుంబసభ్యులు భోజనం ముగించుకుని రాత్రి 11 గంటలకు నిద్రించారు. వీళ్లు శనివారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి ప్రధాన ద్వారం తలుపులు తెరుచుకుని ఉన్నాయి. బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 5 తులాల నల్లపూసల గొలుసు, 2 తులాల రెండు ఉంగరాలు, 1 తులం చెవి బుట్టాలు, 3 తులాల చెవి కమ్మలు, అరతులం చెవి పువ్వులు, అర తులం మాటీలు, 2 తులాల వెండి కాళ్ల మట్టెలు, 48 తులాల వెండి కాళ్ల పట్టీలు, 2 మొబైల్ స్మార్ట్ ఫోన్లు, రూ.16 వేలు నగదు దోచుకెళ్లారు. దొంగలించబడిన సొత్తు విలువ రూ.3.9లక్షలు ఉంటుందన్నారు. బాధితుడు ఖురేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

వరంగల్ స్పోర్ట్స్, మే 18: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాణించిన వర్థమాన, సీనియర్స్ (మాస్టర్స్) క్రీడాకారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకుని ప్రోత్సహించాలని అంతర్జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో దేశం తరపున పాల్గొని దేశానికి, రాష్ట్రానికి పలు పతకాలు సాధించిన తనలాంటి సీనియర్ క్రీడాకారులను గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తనలాంటి నిరుపేద క్రీడాకారులను గుర్తించి తగిన ప్రోత్సాహం అందిచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్, జూనియర్స్ క్రీడాకారులతో కలిసి హనుమకొండ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని ప్రకటనలో వెల్లడించారు.

## ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు



హసన్‌పర్తిలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

హసన్‌పర్తి, మే 18: మండల కేంద్రంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలు పురోహితులు దహగాం రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దైనందిన కార్యక్రమాలతో పాటు ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలన్నారు. వాసవీమాత విశ్వమాత అని తెలిపారు. పార్వతీదేవి అవతారమని, భక్తితో కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు చిదర పురవర్ధన్, నాగమల్ల మాధవశంకర్, బెలిదిలక్ష్మణ్, అప్పని రమేశ్, నాగమల్ల సుధీర్, వెలగందుల భీష్మనాథం, అనుగం సతీష్, సంద్రు నాగేందర్, చకిలం సులోచన, సంద్రు నిరోషా, గౌరిశెట్టి కవిత, మనోజ, పల్లవి, నీరజ, శోభ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు తూముకు మరమ్మతులు చేపడతాం



చెరువు తూమును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ క్రిష్ణప్రసాద్

మడికొండ, మే 18: మడికొండలోని పెద్ద చెరువు తూము పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో రానున్న వర్షాకాలంలో చెరువు నిండితే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెంది అధికారులకు తెలిపారు. శనివారం ఇరిగేషన్ డీఈ క్రిష్ణ ప్రసాద్ చెరువు వద్దకు చేరుకొని తూమును పరిశీలించారు. అత్యవసర పనుల కింద తక్షణమే పనులు చేపట్టి తూము మరమ్మతులు చేపడతామని ఆందోళన చెందవద్దని రైతులకు డీఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీపీసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

# బయల్పడిన ఎరుకల నాంచారమ్మ విగ్రహం

**పూజలు నిర్వహించిన ఏకలవ్య కులస్తులు**



పూజలు నిర్వహిస్తున్న ఏకలవ్య కులస్తులు

మడికొండ, మే 18: మడికొండ శివారులో శనివారం ఎరుకల నాంచారమ్మ పురాతన విగ్రహం బయల్పడింది. ఏకలవ్య కులస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో గల ఓ వెంచర్‌లో చెట్లు తీసివేసి భూమి చదును చేస్తుండగా ఎరుకల నాంచారమ్మ విగ్రహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఏకలవ్య కులస్తులు ఆ స్థలానికి చేరుకొని తమ కుల దైవమైన ఎరుకల నాంచారమ్మ విగ్రహం అని తెలుసుకొని కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. విషయం తెలిసిన పలువురు గ్రామస్తులు ఆ స్థలానికి చేరుకొని విగ్రహాన్ని ఆసక్తిగా తిలకించగా మరికొందరు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, మానుపాటి రమేష్, లోకిన సమ్మయ్య, మడికొండ ఏకలవ్య సంఘం సభ్యులు మానుపాటి సారయ్య, దేవర మహేశ్, దేవర సారయ్య, మానుపాటి రాజు, మానుపాటి రమేష్, పల్లకొండ రాజేందర్, లోకిని రవీందర్, రమేష్, ప్రేమ్‌కుమార్, లావణ్య, సుమలత, సాంబమూర్తి, సూరయ్య, సమ్మయ్య, మానుపాటి పుష్ప, లోకిని లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# కేయూ వీసీపై విజిలెన్స్ విచారణ హర్షనీయం

**అకుట్ జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి**

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని అకుట్ జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అకుట్ ఫిర్యాదు మేరకే ప్రభుత్వం వీసీ రమేష్‌పై చర్యలకు ఉపక్రమించినట్లు అయన పేర్కొన్నారు. వీసీ అక్రమాలపై కేయూ పాలకమండలికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ప్రభుత్వాన్ని ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. జనవరి 14, 24వ తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వీసీ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ధిక్కరిస్తూ యూనివర్సిటీ చట్టానికి వ్యతిరేకంగా యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి రిటైర్డ్ ఫ్యాకల్టీని అడ్జంట్ ఫ్యాకల్టీగా నియమించి రూ.8లక్షలు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారని తెలిపారు. కేయూ భూములను కబ్జాచేసిన వారిని ప్రోత్సహించారని ఆరోపణలు చేశారు. అర్హత లేకున్నా గత ప్రభుత్వంలో పైరవీతో వీసీగా పదోన్నతి పొందారని విమర్శించారు. ప్రైవేటు కోర్టు కేసులకు ప్రభుత్వ ధనాన్ని ఖర్చుచేశారని, ఎన్నికల కోడ్‌లోనూ తన ఇష్టానుసారంగా పాలన కొనసాగించారన్నారు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కేయూ వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు.

### కేయూ వీసీ పెన్షన్‌ను నిలిపివేయాలి

కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పెన్షన్‌ను నిలిపివేయాలని హైదరాబాద్ చెందిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మూడేళ్లుగా కేయూ వీసీగా కొనసాగుతున్న రమేష్ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. వీసీ రమేష్‌పై ఎఫ్ఐఆర్, విజిలెన్స్ విచారణ, హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండగా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఎలాంటి కేసులు లేవని స్టేట్ ఆడిట్ ఆఫీసర్‌కు నివేదిక పంపించడాని ఆయన తప్పుబట్టారు. వీసీపై ఉన్న కేసుల విషయాన్ని కప్పిపెట్టి తప్పుడు సమాచారాన్ని అందజేసిన మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని, వీసీ పెన్షన్‌ను నిలిపివేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అలాగే వీసీ పెన్షన్ ఫైల్‌ను సరిగ్గా విచారణ చేయకుండా ఆమోదం తెలిపిన కేయూ ఆడిట్ ఆఫీసర్‌పై సైతం ఆడిట్ ఆఫీస్ ప్రిన్సిపల్ డైరెక్టర్, హైదరాబాద్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

## ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్. జుమ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. http://iti.telangana వెబ్‌సైట్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాలకు వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

## రేపటి నుంచి చెస్ శిక్షణ శిబిరం ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్, మే 18: కన్న చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20నుంచి జూన్ 5వ తేదీ వరకు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డు లోని తమ అకాడమీలో వేసవి చెస్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కన్న చెస్ అకాడమీ నిర్వాహకుడు కన్న ఒక ప్రకటనలో తెలిపారు. 5 యేళ్ల నుంచి 15 యేళ్ల వయస్సు కలిగిన బాలబాలికలకు చెస్‌లో శిక్షణ అందించడంతోపాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సెలవులు మినహాయించి ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నామమాత్రపు ఫీజు తీసుకొని శిక్షణ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## కారుచీకట్లో పున్నేలు క్రాస్ రోడ్డు



సంవత్సరం కాలం నుంచి పున్నేలు క్రాస్‌రోడ్డులో వెలుగని లైట్లు

ఐనవోలు, మే18: జాతీయ రహదారిపై ఉన్న పున్నేలు క్రాస్ రోడ్డు రద్దీగా ఉండే ప్రాంతం. ఈ కూడలికి నిత్యం వేలాదిమంది వస్తారు. ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయానికి ఇటు వరంగల్, అటు ఖమ్మం ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ క్రాస్‌రోడ్డు నుంచి ఐనవోలుకు వెళ్లాలి. ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ గతంలో హైమాస్ లైట్లను ఏర్పాటు చేశారు. పున్నేలు గ్రామ పంచాయతీ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన హైమాస్ లైట్లు గత సంవత్సరం నుంచి వెలుగడంలేదు. దీంతో సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అక్కడికి వచ్చే ప్రయాణికులు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. క్రాస్ రోడ్డు నుంచి, పున్నేలు, ఐనవోలు, వెంకటాపురం, గర్మిళ్లపల్లి, ఒంటిమామిడిపల్లి తదితర గ్రామాలకు నిత్యం వేలాదిగా ప్రయాణిస్తారు. సాయంత్రం 6 అయిందంటే ఆటోలు, బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు చీకట్లో ప్రధానంగా మహిళలు నిల్చోలేని పరిస్థితి ఉంది. అంతేకాదు.. క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతుంటాయి. పక్కనే వైన్స్‌షాపు ఉండడంతో ఆరు బయట మద్యం ప్రియుల సందడి, వాహనాల రాకపోకలు ఉంటున్నాయి. హైమాస్ లైట్లు వెలగడంలేదని పున్నేలు గ్రామ పంచాయతీ పాలకులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదు. ప్రత్యేక అధికారుల పాలనలోనైన లైట్లను వెలిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నవ్య ఆదివారం
కుటుంబ కదంబం




ప్రస్తుతం సోషల్ మీడియా చాలా విస్తృతంగా వ్యాపిస్తోంది. దీని ప్రభావం అన్ని రంగాలపైనా కనిపిస్తోంది. ఒకప్పుడు బుల్లి తెర నటులకు స్టార్‌డమ్ వచ్చినట్లే- సోషల్ మీడియాలో స్టార్స్‌కు ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. వారిలో కొందరు సినిమాలలోకి ప్రవేశిస్తున్నారు. అలాంటి ఇన్‌ఫ్లుయన్సర్స్‌లో ఒకరు **నిఖిల్ విజయేంద్ర సింహ**. మూడు వందలకు పైగా ఇంటర్వ్యూలతో లక్షల మంది ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న నిఖిల్ సినిమా హీరోగా కూడా మారాడు. ఈ నేపథ్యంలో- ప్రస్తుతం సోషల్ మీడియాలో పరిస్థితుల గురించి 'నవ్య'కు వివరించారు.

# ఇక్కడ చాలా విషయాలు దాచలేం..

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్‌గా ఉన్న మీరు హీరోగా రంగ ప్రవేశం చేయడం ఎలా జరిగింది?**

చిన్నప్పటి నుంచి నాకు కళారంగం అంటే చాలా ఇష్టం. అమ్మ కూడా నన్ను ఎంతో ప్రోత్సహించేది. స్కూల్లో, కాలేజీలో అనేక కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొనేవాడిని. నేను వైజాగ్ గీతమ్ కాలేజీలో చదివాను. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చేశాను. నా రెజ్యూమ్ పట్టుకొని ఎన్నో ఆఫీసులకు తిరుగుతూ ఉండేవాడిని. ఒకరోజు అనుకోకుండా ఒక డిజిటల్ మీడియా సంస్థకు వెళ్లాను. అక్కడ నాకు తొలి అవకాశం లభించింది. నేను ఎప్పుడూ డిజిటల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ కావాలని అనుకోలేదు. అనుకోకుండా అయ్యా. తెలుగు సినీ రంగంలో పెద్ద పెద్ద స్టార్స్ అందరినీ ఇంటర్వ్యూలు చేశా. ఆ మధ్య నాకు బెంగుళూరు నుంచి ఒక కాల్ వచ్చింది. "లహరీ ఫిల్మ్స్ వారు సినిమా తీస్తున్నారు.. మీరు బెంగుళూరుకు వస్తే కథ చెబుతాం" అన్నారు. బెంగుళూరుకు వెళ్లా. కథ బాగా నచ్చింది. వెంటనే ఒప్పేసుకున్నా.

**డిగ్రీ చదివిన పిల్లలు ఉద్యోగాలు చేయాలని తల్లితండ్రులు అనుకుంటారు.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ అవుతానంటే ఇంట్లో వాళ్లు అభ్యంతరం చెప్పలేదా?**

అమ్మ రాజముఖి, నాన్న వరప్రసాద్ - నాకు చిన్నప్పటి నుంచి చాలా సపోర్ట్‌గా ఉన్నారు. అమ్మ సూర్యావతి ఎన్‌జీఓలో పనిచేసేది. బాగా గిటార్ వాయిస్తుంది. నన్ను కూడా చిన్నప్పటి నుంచి డ్యాన్స్, మ్యూజిక్ క్లాసుల్లో చేర్పింది. నాన్నకు రియల్ ఎస్టేట్ కంపెనీ ఉంది. ఆయన కూడా చిన్నప్పటి నుంచి నన్ను ప్రోత్సహించారు. మా అన్నయ్య కుద్రు సినీ దర్శకుడు. 'హేయ్ నాన్న' అనే చిత్రానికి దర్శకత్వం వహించాడు. చిన్నప్పటి నుంచి మేమిద్దరం సినిమాలు, సోషల్ మీడియా వెనక తిరుగుతూ ఉండేవాళ్లం. అమ్మ, నాన్నల స్నేహితులు- "ఏంటి... మీ వాళ్లిద్దరూ ఆ దారిలో వెళ్లారు...అక్కడ సక్సెస్ చాలా కష్టం కదా.." అనేవారు. కానీ వాళ్లు ఎప్పుడూ ఆ మాటలను పట్టించుకోలేదు. మాకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు.

**రీల్స్, ఇన్‌స్టా, యూట్యూబ్- ఇలా సోషల్ మీడియా అంటే చాలామందిలో ఒక చిన్న చూపు కనిపిస్తూ ఉంటుంది. "రీల్స్ చేయటం సులభమేగా!" అంటూ ఉంటారు. దీనిలో నిజమెంత?**

ఒక సినిమాకు ఎంత కష్టపడతామో, ఒక యూట్యూబ్ షూట్‌కు అంత కష్టపడాల్సి ఉంటుంది. కెమెరా, మేకప్, లైటింగ్, సౌండ్- ఇలా అన్నీ కుదరకపోతే మంచి యూట్యూబ్ కంటెంట్ రాదు. బహుశా నిడివి తక్కువగా ఉండటం వల్ల చాలామందికి దాని వెనక ఉన్న కష్టం తెలియదు. రీల్స్ చేయటం కూడా చాలా కష్టం. నేను వచ్చినప్పుడు యూట్యూబ్ అంటే కొంత చులకన భావం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులు మారుతున్నాయి. సోషల్ మీడియా వ్యాప్తి బాగా పెరిగింది. లక్షల మంది వీటిని ఫాలో అవుతున్నారు.

**యూట్యూబ్‌లో, ఇన్‌స్టాలో లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ కనిపిస్తూ ఉంటారు. ఈ సంఖ్యలను ఎంత వరకు నమ్మవచ్చు?**

కొందరు థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా సబ్‌స్క్రైబర్స్‌ను కొనుక్కుంటూ ఉంటారు. ముఖ్యంగా ఇది ఇన్‌స్టాలో ఎక్కువగా జరుగుతుంది. యూట్యూబ్‌లో తక్కువగా ఉంటుంది. అయితే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయమేమిటంటే- మనకు లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉన్నట్లు చూపించి మోసం చేయలేం. ఉదాహరణకు ఒకరికి మిలియన్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారనుకుందాం. ఆమె ఒక పోస్ట్ పెడితే వంద లైక్‌లు వస్తే- ఎక్కడో తేడా ఉన్నట్లే లెక్క కదా! సోషల్ మీడియాలో చాలా విషయాలను దాచలేం. అంతేకాకుండా ఇలా సబ్‌స్క్రైబర్స్‌ను కొనుక్కుంటే- మానిటైజేషన్ (యూట్యూబ్ ద్వారా సొమ్ము పొందటం) విషయంలో సమస్యలు ఏర్పడతాయి.



**ఈ మధ్యకాలంలో బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేక మంది నష్టపోతున్నారు. వీటిని కొంద రు ఇన్‌ఫ్లుయన్సర్స్ ప్రమోట్ చేస్తున్నారు కదా... దీనిపై మీ అభిప్రాయమేమిటి?**

నా ఉద్దేశంలో బెట్టింగ్ లాంటివి వ్యక్తిగతమైన విషయాలు. ఇది కూడా పేక ఆడటం లాంటిదే. దీనికి రెండు కోణాలు ఉన్నాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లుయన్సర్స్ - జాగ్రత్తగా ఉండమని ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా చెబుతారు. ఇక రెండోది- కొందరు ఇన్‌ఫ్లుయన్సర్స్‌కు ఆర్థికపరమైన ఇబ్బందులు వస్తాయి. వారికి జీవనాధారం వేరే ఏదీ ఉండదు. ఆ సమయంలో బెట్టింగ్ యాప్‌ల వారు ప్రమోషన్ చేస్తే ఎక్కువ మొత్తం డబ్బులు ఇస్తామంటారు. దాంతో వారు ప్రమోషన్ చేయటానికి మొగ్గు చూపుతారు. వేల మంది ఇన్‌ఫ్లుయన్సర్స్ ఉంటే టాప్‌లో ఉన్న కొందరు మాత్రమే వీటిని ప్రమోట్ చేస్తారు. ఈ మధ్య కాలంలో దీనిపై వివాదం నెలకొన్న తర్వాత చాలా మంది వీటిని ప్రమోట్ చేయటానికి ఇష్టపడటం లేదు.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

# చరిత్ర మరచిన దివాన్!



అలనాటి కథ



హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని కోరుకున్నవారిలో సర్ మీర్జా ఇస్మాయిల్ ఒకరు. 1946లో హైదరాబాద్ దివాన్‌గా పదవిని చేపట్టిన ఇస్మాయిల్ ఎప్పుడూ అవిభాజ్య భారతదేశాన్ని కోరుకున్నారు. ఆయన హైదరాబాద్ సంస్థానానికి రాకముందు- మైసూర్ మహరాజా వద్ద దివాన్‌గా పనిచేశారు. ఆ సమయంలో మేము ఊటీ వెళ్లాలంటే బెంగుళూరు మీద నుంచి వెళ్లేవాళ్లం. ఆ సమయంలో సర్ ఇస్మాయిల్ నాకు పరిచయం.

మేము చిన్నప్పుడు ఊటీకి వెళ్లాలంటే- మద్రాసు మీదగా కాకుండా- బెంగుళూరు మీదగా వెళ్లేవాళ్లం. మేము ఊటీ వెళ్తున్నామని తెలిస్తే- మైసూర్ మహరాజా మమల్ని కొద్ది కాలం బెంగుళూరు, మైసూర్‌లలో విడిది చేయమని ఆహ్వానించేవారు. దాంతో ముందు బెంగుళూరు, మైసూర్‌లకు వెళ్లి అక్కడ కొద్దికాలం ఉండేవాళ్లం. సాధారణంగా మేము వెళ్లే సమయానికి మైసూర్ ప్యాలెస్‌లో గుల్‌మొహర్ పూలు పూసేవి. ప్యాలెస్ చాలా పెద్దదిగా ఉండేది. దీనితో మమల్ని ప్యాలెస్ చూడటానికి కార్లలో తీసుకువెళ్లేవారు. ఆ తర్వాత అమ్మ షాపింగ్‌కు వెళ్లి- మైసూర్ సిల్క్ చీరలు, మంచి గంధం నూనె కొనేది.

ఆ రోజుల్లో మైసూర్ చూడటానికి చాలా అందంగా ఉండేది. ఆ రోజుల్లో మన దేశంలో ఉన్న అందమైన నగరాల్లో మైసూర్ కూడా ఒకటని చెప్పుకొనేవారు. మైసూర్‌కు వెళ్లినప్పుడల్లా- సర్ ఇస్మాయిల్- అమ్మనాన్నలను ఒక రోజు లంచ్‌కి.. మరొక రోజు డిన్నర్‌కు పిలిచేవారు. కొన్ని సార్లు అమ్మనాన్నలతో మేము కూడా లంచ్‌లకు వెళ్లేవాళ్లం. మైసూర్ సంస్థానంలో సర్ ఇస్మాయిల్‌కు మంచి పేరు ఉండేది. మైసూర్ మహరాజా వడయార్‌కు ఆయన చాలా సన్నిహితంగా ఉండేవారు. సర్ సి.వి. రామన్, సి.పి. రామస్వామి అయ్యర్ వంటి వారు ఆయనకు స్నేహితులు. మైసూర్ మహరాజుకు ఏడీసీగా ఉద్యోగాన్ని ప్రారంభించిన సర్ ఇస్మాయల్ తన మేధతో దివాన్ పదవిగా ఎదిగారు.

అలా ఒక సారి మైసూర్ వెళ్లినప్పుడు- సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను కలిసాను. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అప్పటికే కృష్ణరాజసాగర్ నిర్మాత సారథిగా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. చూడటానికి చాలా సాదాసీదాగా కనిపించే విశ్వేశ్వరయ్య తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చాలా స్పష్టంగా.. అందరికీ అర్థమయ్యేలా చెప్పేవారు. ఆయనతో జరిగిన భేటీకి సర్ ఇస్మాయిల్ కూడా వచ్చిన జ్ఞాపకం. దాదాపు 75 సంవత్సరాల తర్వాత కూడా ఆయనతో సమావేశం ఇంకా గుర్తు ఉందంటే - ఆయన నాపై ఎలాంటి ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చు. ఆ పర్యటనలో మరచిపోలేని మరో జ్ఞాపకం- మహరాజా తోబుట్టువులను కలుసుకోవటం. సాధారణంగా రాజకుటుంబీకులకు కలుసుకోవాలంటే - వారి కుటుంబ పెద్ద అనుమతి తీసుకోవాల్సి ఉండేది. మైసూర్ మహరాజా వారి తోబుట్టువులను కలుసుకోవటానికి మాకు అనుమతి ఇచ్చారు. దాంతో మేమందరం వారిని కలవటానికి ఒక ప్యాలెస్‌కు వెళ్లాం.

ఇక సర్ ఇస్మాయిల్‌ను ఊటీలో కూడా తరచూ కలుస్తూ ఉండేవాళ్లం. ఊటీలోని మైసూర్ ప్యాలెస్ మా ఇంటి వెనకే ఉండేది. అందువల్ల అప్పుడప్పుడు సర్ ఇస్మాయల్ అక్కడికి వచ్చేవారు. వచ్చినప్పుడు ఆయన మా ఇంటికి పార్టీకి వచ్చేవారు. మైసూర్ నుంచి ఆయన జయపూర్ దివానుగా.. ఆ తర్వాత హైదరాబాద్ దివానుగా వచ్చారు. హైదరాబాద్‌లో మా ఇంటికి చాలా సందర్భాలలో వచ్చిన జ్ఞాపకం. 1946లో మనకు స్వాతంత్ర్య రావటానికి ఎక్కువ సమయం పట్టదనే



విషయం అందరికీ తెలిసిపోయింది. దీనితో రాజసంస్థాలన్ని బ్రిటన్ వారుతో మంతనాలు జరపటం మొదలుపెట్టాయి. నిజాంకు హైదరాబాద్ సంస్థానాన్ని భారత సమాఖ్యలో విలీనం చేయటం ఏ మాత్రం ఇష్టం లేదు. దీనితో నిజాం తరఫున సర్ ఇస్మాయిల్ బ్రిటిష్ వారితో మంతనాలు జరపటం మొదలుపెట్టారు. అయితే ఈ చర్చలేమి ఫలించలేదు. ఈ లోపులో గాంధీజీ హత్య జరిగింది. దేశవ్యాప్తంగా అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులు తనకు అనుకూలిస్తాయని నిజాం భావించారు. ఎటువంటి పరిస్థితుల్లో భారత సమాఖ్యలో హైదరాబాద్‌ను విలీనం చేయనని స్పష్టం చేశారు. దీనితో సర్ ఇస్మాయిల్ తన పదవికి రాజీనామా చేశారు. హైదరాబాద్ సంస్థానం చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పుడు సర్ ఇస్మాయిల్ తన మేధను ఉపయోగించి మేలు చేయటానికి ప్రయత్నించి విఫలమయ్యారు. చరిత్ర మరచిపోయిన హైదరాబాద్ దివానుల్లో సర్ ఇస్మాయిల్ ఒకరు అనటంలో అతిశయోక్తి లేదు.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

## శ్రీచైతన్య.. ర్యాంకుల సునామీ

» రెండు విభాగాల్లోనూ మొదటి ర్యాంకులు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ర్యాంకుల సునామీ సృష్టించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఇంజనీరింగ్‌లో 1వ ర్యాంకుతోపాటు 10లోపు 4 ర్యాంకులు, 100లోపు 51 ర్యాంకులు, అగ్రి-ఫార్మసీలో 1వ ర్యాంకుతోపాటు 10లోపు 8 ర్యాంకులు, 100లోపు 59ర్యాంకులు దక్కించుకున్నారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు విభాగాల్లోనూ వరుసగా ఏడుసార్లు 1వ ర్యాంకు సాధించి, విజయాన్ని ఆనవాయితీగా మార్చుకున్నామని పేర్కొన్నారు. ఫలితాల అనంతరం మీడియాతో సుష్మ మాట్లాడారు. అనితర సాధ్యమైన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్టు పేపర్లు, నిపుణులైన అధ్యాపక బృందం శిక్షణ.. తమ విజయంలో కీలంగా నిలిచాయని పేర్కొన్నారు. పోటీ పరీక్ష ఏదైనా, పరీక్ష విధానాలు ఎలా మారినా నంబర్-1గా నిలిచేది తమ విద్యార్థులేనని స్పష్టం చేశారు. జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షల్లోనూ ఇదే తరహా ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. టాప్ ర్యాంకులు సాధించిన వారిలో ఎక్కువ మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే కావడం విశేషమని పేర్కొన్నారు.

## నారాయణ విద్యార్థుల విజయభేరి

» రెండు విభాగాల్లో కలిపి 100లోపు 50ర్యాంకులు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు సంచలనాలు సృష్టించారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి.సింధూర నారాయణ, డైరెక్టర్ పి.శరణి నారాయణ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 4, 5, 7, 8, 12తోపాటు 100లోపు 34 ర్యాంకులు, అగ్రి-ఫార్మసీ విభాగంలో 5, 18, 19తోపాటు 100లోపు 16 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఫలితాల విడుదల అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రెండు విభాగాల్లో కలిపి 100లోపు 50 ర్యాంకులు సాధించడం ద్వారా తల్లిదండ్రుల ఆశయ సాధన నారాయణతోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందన్నారు. నారాయణ విశిష్ట విద్యా ప్రణాళిక ద్వారానే ఇంతటి ఘన విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, రోజూ వారీ పరీక్షలు, వాటిపై సమగ్ర విశ్లేషణ వల్ల ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లడానికి కారణమైందని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఎస్సార్ విద్యార్థుల ప్రభంజనం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో కొంతం మణితేజ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. అలాగే, దొంతుల మనీష్ 24, టి.తేజస్వీ 161, ముంకాల గణేష్ 199, కె.శ్రీరామ్‌రెడ్డి 291, చల్ల హర్షిత 334, ఆర్.దీపాన్స్‌రెడ్డి 412, కె.వర్షిణి 494, ఎస్.రాహుల్ 546, జి.రాజీవ్ 552, అబుతల్హా 554 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డితో కలిసి విద్యార్థులను ఆయన అభినందించారు.

## సత్తా చాటిన భాష్యం విద్యార్థులు



సాయియశంత్‌రెడ్డి, జిష్ణు సాయి, హర్షిత

గుంటూరు(విద్య), మే 18 : టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 5, ఎం.జిష్ణుసాయి 11, కె.హర్షిత 13, కె.మనీస్‌చౌదరి 28, కె.ప్రభాస్ 31, టి.మునికార్తీక్ 58, పి.శ్యామ్ 63, ఎం.సాయిజశ్వంత్‌రెడ్డి 65, ఎం.గణేష్‌దత్తా 93, ఎం.శ్రీచరితసాయి 94, డి.పూజ 97, కెఆర్ఎస్ సుమస్విత 100వ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. మొత్తంగా 100లోపు 12 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు తదితరులు అభినందించారు.

# ఏపీ-తెలంగాణకు సగం.. సగం

(మొదటిపేజీ తరువాయి)

కావడం గమనార్హం. జేఎన్టీయూ క్యాంపస్‌లో శనివారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, జేఎన్టీయూ వీసీ నర్సింహారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. టీఎస్ ఎప్‌సెట్‌లో భాగంగా ఈ నెల 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ, 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగాయి. ఏపీ, తెలంగాణ నుంచి ఇంజనీరింగ్ పరీక్షకు 2,40,618 మంది, అగ్రికల్చర్-ఫార్మసీ పరీక్షకు 91,633 మంది హాజరయ్యారు. ఈ మేరకు ఇంజనీరింగ్‌లో 1,80,424 మంది (74.98శాతం) ఉత్తీర్ణత సాధించగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలో 82,163మంది (89.67శాతం) అర్హత సాధించారు. గత ఏడాదితో పోలిస్తే ఇంజనీరింగ్‌లో 5.35శాతం, అగ్రికల్చర్-ఫార్మసీలో 3.35శాతం మేర ఉత్తీర్ణత తగ్గింది.

### రికార్డు సమయంలో ఫలితాల విడుదల

ఎప్‌సెట్ పరీక్షల ఫలితాలను రికార్డు సమయంలో (7 రోజుల్లోనే) విడుదల చేశామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. వర్షం కారణంగా ఒకటి, రెండు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు మినహా.. ఎప్‌సెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. పరీక్షల నిర్వహణతోపాటు అతి తక్కువ సమయంలో ఫలితాలను వెల్లడించేందుకు కృషి చేసిన సెట్ కన్వీనర్ నర్సింహారెడ్డి, కన్వీనర్ డీన్ కుమార్, కో కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తదితరులను ప్రశంసించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 1.64లక్షలపైగా ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయని, అడ్మిషన్ల నిమిత్తం వారంలోగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. తెలంగాణ అభ్యర్థులకు సరిపడా సీట్లు ఉన్నాయని, ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ కోర్సులకే డిమాండ్ ఉంటోందని చెప్పారు. బీ-కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా కేటాయించే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లను కూడా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసే ఆలోచన ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు తీసుకున్న శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీ విషయంలో మేనేజ్‌మెంట్ కోటాను రద్దు చేశామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**ఇంజనీరింగ్ తొలి 10 ర్యాంకర్లు వీరే..**

| ర్యాంకు | పేరు | జిల్లా/రాష్ట్రం | మార్కులు |
|---|---|---|---|
| 1 | సతివాడ జ్యోతిరాదిత్య | శ్రీకాకుళం(ఏపీ) | 155.63 |
| 2 | గొల్లలేఖ హర్ష | కర్నూలు(ఏపీ) | 152.08 |
| 3 | రిషిశేఖర్ శుక్లా | సికింద్రాబాద్(టీజీ) | 150.66 |
| 4 | భోగలపల్లి సందేశ్ | హైదరాబాద్(టీజీ) | 149.59 |
| 5 | మురసాని యశ్వంత్‌రెడ్డి | కర్నూలు(ఏపీ) | 145.64 |
| 6 | పుట్టి కుశల్ కుమార్ | అనంతపురం(ఏపీ) | 142.82 |
| 7 | హుందేకర్ విదీత్ | రంగారెడ్డి(టీజీ) | 142.58 |
| 8 | పబ్బా రోహన్ సాయి | హైదరాబాద్(టీజీ) | 141.83 |
| 9 | కొంతం మణితేజ | వరంగల్(టీజీ) | 141.46 |
| 10 | ధనుకొండ శ్రీనిధి | విజయనగరం(ఏపీ) | 141.00 |

**అగ్రికల్చర్, ఫార్మసీ తొలి 10 ర్యాంకర్లు వీరే**

| ర్యాంకు | పేరు | జిల్లా/రాష్ట్రం | మార్కులు |
|---|---|---|---|
| 1 | ఆలూరు ప్రణీత | అన్నమయ్య(ఏపీ) | 146.44 |
| 2 | నాగుదాసరి రాధాకృష్ణ | విజయనగరం(ఏపీ) | 145.42 |
| 3 | గడ్డం శ్రీవర్షిణి | హనుమకొండ(టీజీ) | 145.25 |
| 4 | సోంపల్లి సాకేత్ రాఘవ్ | చిత్తూరు(ఏపీ) | 145.10 |
| 5 | రేపాల సాయివివేక్ | హైదరాబాద్(టీజీ) | 144.62 |
| 6 | మహమ్మద్ అజాన్‌సాద్ | హైదరాబాద్(టీజీ) | 144.61 |
| 7 | వడ్లపూడి ముకేశ్ చౌదరి | తిరుపతి(ఏపీ) | 143.51 |
| 8 | జెన్ని భార్గవ్ సుమంత్ | మేడ్చల్(టీజీ) | 143.50 |
| 9 | జయశెట్టి ఆదిత్య | హైదరాబాద్(టీజీ) | 142.99 |
| 10 | పూల దివ్యతేజ | సత్యసాయి(ఏపీ) | 141.01 |

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధిస్తా



జేఈఈ మెయిన్స్‌లో 100 పర్సంటైల్ వచ్చింది. అడ్వాన్స్డ్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందని ధీమాగా ఉన్నా. 10వ తరగతి వరకు బోయిన్‌పల్లిలో చదువుకున్నా. అల్వాల్‌లోని ఓ పాఠశాలలో సీబీఎస్సీ సిలబస్‌లో 12వ తరగతి చదివా. టీఎస్ఎప్‌సెట్‌లో రాష్ట్రంలోనే 3వ రాంకు రావడం సంతోషంగా ఉంది.

- రిషి శేఖర్ శుక్లా, ఇంజనీరింగ్‌లో 3వ ర్యాంకర్



### డాక్టర్ కావడమే లక్ష్యం

నీట్ పరీక్షకు ప్రిపేరవుతున్నా. డాక్టర్ కావడమే నా లక్ష్యం. టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో 5వ ర్యాంకు రావడం సంతోషం కలిగించింది. నాన్న కిరణ్ టీచర్. అమ్మ త్రివేణి డాక్టర్. అమ్మ ప్రోత్సాహంతోనే డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నా.

- సాయి వివేక్, అగ్రి-ఫార్మసీలో 5వ ర్యాంకర్

## పోస్టింగ్ ఇప్పించండి

» ఎన్నికల కమిషన్‌కు ఏబీవీ లేఖ

» సీఈసీకి పంపిన సీఈవో

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) తీర్పును అనుసరించి తనకు పోస్టింగ్ ఇప్పించాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు శనివారం లేఖ రాశారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న తనకు పోస్టింగ్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని, న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోనే అందరికన్నా సీనియర్ ఐపీఎస్ అయిన తన సస్పెన్షన్ చెల్లదంటూ పది రోజుల క్రితమే క్యాట్ తీర్పు ఇచ్చిందంటూ లేఖతోపాటు ఆ కాపీని జత చేశారు. ఈ లేఖను సీఈవో కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపించారు. సీఈసీ నిర్ణయం మేరకు ఏబీవీకి పోస్టింగ్ లభించే అవకాశం ఉంది.

### కోడ్ ముగిసినా స్పందించని సర్కారు

రాష్ట్రంలో ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏ తప్పూ చేయని ఏబీ వెంకటేశ్వరరావుపై కక్ష సాధింపులకు పాల్పడింది. అసలు కొనుగోలే చేయని పరికరాల్లో అవినీతి జరిగిందంటూ ఆయనపై సస్పెన్షన్లు విధిస్తూ వేధించింది. న్యాయ పోరాటం చేస్తున్న వెంకటేశ్వర రావుకు ఈ నెల 8న క్యాట్ తీర్పు పెద్ద ఉపశమనాన్ని కల్పించింది. తీర్పు వచ్చిన మూడు రోజుల్లోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలిసిన ఏబీవీ.. తనకు పోస్టింగ్ ఇవ్వాలని దరఖాస్తు సమర్పించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సీఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉందని చెప్పిన సీఎస్ నుంచి, ఆ తర్వాత కూడా ఎలాంటి స్పందనా లేకపోవడంతో నేరుగా రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ అందజేశారు.

# పవిత్రతో ఐదేళ్లుగా సహజీవనం

» ఆమె పరిచయం తర్వాత శాడిస్టులా హింసించాడు

» బుల్లితెర నటుడు చందు భార్య శిల్ప

» ఐదేళ్లుగా మాకు దూరంగానే: చందు తండ్రి

» పవిత్ర మరణాన్ని జీర్ణించుకోలేకే చందు ఆత్మహత్య : పోలీసులు





చందు భార్య శిల్ప, పిల్లలు

నార్సింగ్/రెజిమెంటల్ బజార్, హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): పదకొండేళ్ల ప్రేమ తర్వాత తనని పెళ్లి చేసుకున్న తన భర్త .. నటి పవిత్ర జయరాం పరిచయంతో తనకు దూరమయ్యాడని బుల్లితెర నటుడు చంద్రకాంత్(40) అలియాస్ చందు భార్య శిల్ప ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర జయరాంతో సహజీవనం చేసిన చందు ఐదేళ్లుగా తనకు, తమ పిల్లలకు దూరంగా ఉన్నారని తెలిపారు. కన్నయ్య అని పిలుస్తూ తనతో ఎంతో ప్రేమగా ఉండే చందు.. పవిత్ర పరిచయమయ్యాక శాడిస్టులా మారి తనని హింసించాడని చెప్పారు. చందు- పవిత్ర మధ్య బంధాన్ని పవిత్ర జయరాం కుమారుడికి చెబితే తాము అభ్యంతరం చెప్పలేమని తెలిపారన్నారు. ఇక, తన భర్త కోసం పవిత్రను మందలిస్తే.. ఆయన నచ్చాడు వదలను.. అని స్పష్టం చేసిందని శిల్ప చెప్పారు. తన భర్త కూడా పవిత్రను వదిలి ఉండలేనంటే.. ఎక్కడున్నా సంతోషంగా ఉంటాడని ఆలోచనతో తన పిల్లలతో కలిసి ఐదేళ్లుగా అత్తమామలతో ఉంటున్నానని చెప్పారు. 'పవిత్ర రెండు రోజుల్లో నీ దగ్గరకు వస్తా' అని చందు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టు గురించి ప్రశ్నిస్తే ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడిని కాదని తల్లిదండ్రులకు చెప్పిన చందు ఇలా చేస్తాడనుకోలేదని శిల్ప ఆవేదన వ్యక్తం చేశారు. బుల్లితెర నటుడు చంద్రకాంత్ అలియాస్ చందు(40) హైదరాబాద్, మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. తాను ఎంతగానో ప్రేమించిన పవిత్ర జయరాం ఆకస్మిక మరణంతో మనస్తాపం చెందడం వల్లే చందు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. చందు తండ్రి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై దర్యాప్తు చేసిన నార్సింగ్ పోలీసులు ఆత్మహత్యకు కారణాన్ని వెల్లడించారు. సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్‌కు చెందిన వెంకటేష్, వెంకటమ్మ దంపతుల రెండో కుమారుడు చందు 2015లో శిల్పను ప్రేమ వివాహం చేసుకున్నాడు. చందు దంపతులకు దీక్షిత(8), లక్ష్య(4) అనే పిల్లలు ఉన్నారు. అయితే, సహచర నటి పవిత్ర జయరాంతో చందుకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలకు దూరంగా ఉంటున్న చందు.. పవిత్రతో కలిసి ఐదేళ్లుగా మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మే 12న మహబూబ్‌నగర్ దివిటిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పవిత్ర జయరాం మరణించింది. స్వల్ప గాయాలతో బయటపడిన చందు.. పవిత్ర మరణంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. పవిత్ర అంత్యక్రియలు ముగిసిన 3 రోజులు తర్వాత బెంగళూరు నుంచి ఇంటికి తిరిగొచ్చిన చందు.. పవిత్ర చనిపోయిందని, తానీ లోకంలో ఉండలేనని భార్య శిల్ప, తండ్రి వెంకటేష్ వద్ద కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే తాను నివాసముంటున్న ఫ్లాట్‌లో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చందు అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో జరిగాయి. కాగా, ఐదేళ్లుగా తమకు దూరంగా ఉంటున్న చందు.. పవిత్ర అంత్యక్రియల అనంతరం తమ వద్దకు వచ్చాడని అతని తండ్రి వెంకటేష్ తెలిపారు. పవిత్ర దగ్గరకు వెళ్లిపోతా, చనిపోతాననిఅంటే ధైర్యం చెప్పామని, శుక్రవారం ఉదయం మణికొండలోని ఫ్లాట్‌కు వెళ్లిపోయాడని చెప్పారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్లు చేసినా చందు నుంచి స్పందన లేకపోవడంతో అతని స్నేహితులతో కలిసి మణికొండలోని ఫ్లాట్‌కు వెళ్లి చూస్తే అప్పటికే ఉరి వేసుకుని కనిపించాడని తెలిపారు.

## హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా స్ట్రీన్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

## క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టూ విస్సాప్రగడ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

## సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/QCfS9Ui లో చదవండి.

## సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్ధార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

## అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.

## రొమాంటిక్ సిల్క్ శారీ



వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

## మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.

## దిక్సూచి DIKSUCHI

## ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు**

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

**అర్హత:** బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

**ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

## ఐఐఎస్సీలో బీటెక్

**(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)**

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

**ఎంపిక:** 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

## తెలంగాణ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలు



హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ - ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ సంస్థల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎన్‌సీవీటీ విధానంలో కోర్సులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ట్రేడ్‌ను అనుసరించి కోర్సు వ్యవధి ఏడాది/రెండేళ్లు. అభ్యర్థులు తాము ఎంచుకొన్న ఐటీఐ సంస్థలు, ట్రేడ్‌ల ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తులో సూచించాలి. అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. క్రాఫ్ట్స్‌మన్ ట్రెయినింగ్ స్కీమ్ కింద శిక్షణ ఇస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ ట్రెయినింగ్, థియరిటికల్ ట్రెయినింగ్, ట్రేడ్ థియరీ, వర్క్‌షాప్ క్యాలిక్యులేషన్ & సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఉంటాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది. ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు వెబ్ ఆప్షన్స్ సబ్మిట్ చేయాలి.

**ట్రేడ్‌లు:** కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్, మెకానికల్), డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండరీమన్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(కెమికల్ ప్లాంట్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, లేబరేటరీ అసిస్టెంట్(కెమికల్ ప్లాంట్), లిథో ఆఫ్‌సెట్ మెకానిక్ మైండర్, మెషినిస్ట్(గ్రిండర్), మెషినిస్ట్, మెకానిక్(మోటార్ వెహికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఆటోబాడీ పెయింటింగ్ 20, ఆటోబాడీ రిపేర్, డీజిల్), ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, స్యూయింగ్ టెక్నాలజీ, షీట్ మెటల్ వర్కర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్(ఇంగ్లీష్), టర్నర్, వెల్డర్, వైర్‌మన్.

**అర్హత:** ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **వెబ్‌సైట్:** iti.telangana.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x4Jo3xJలో చదవండి.

## ఉత్తర, దక్షిణ డిస్కమ్‌ల పేర్లలో మార్పు

**టీఎస్ నుంచి టీజీకి మారుస్తూ సంస్థల నిర్ణయం**

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దక్షిణ, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలు తమ పేర్లలో మార్పు చేసుకున్నాయి. ఇప్పటి వరకు టీఎస్ ఎస్పీడీసీఎల్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ పేరును తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థగా (టీజీ ఎస్పీడీసీఎల్)గా అలాగే టీఎస్ ఎన్పీడీసీఎల్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పేరును తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థగా (టీజీ ఎన్పీడీసీఎల్)గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు వాటి లోగోల్లో కూడా మార్పు చేశాయి. తెలంగాణ స్టేట్ (టీఎస్) స్థానంలో తెలంగాణ (టీజీ) పేరుతో నామకరణాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు యుద్ధప్రాతిపదికన ఈ నిర్ణయాన్ని అమలు చేశాయి. దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఉత్తర డిస్కమ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## తడిసిన ధాన్యాన్నీ కొంటాం: సీతక్క

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క ప్రకటించారు. రైతులు అధైర్యపడొద్దన్నారు. యూపీలోని రాయ్‌బరేలీలో ప్రచారం నిర్వహిస్తున్న ఆమె.. శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఇక నుంచి పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఆమె పేర్కొన్నారు.

## మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుంటే.. మోదీ జీర్ణించుకోలేకపోతున్నారు: పొన్నం

హైదరాబాద్/కరీంనగర్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుంటే ప్రధాని స్థాయిలో ఉన్న మోదీ జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కొన్ని రాష్ట్రాలు వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వాస్తవానికి ఆర్టీసీలో ప్రయాణానికి, మెట్రో రైలులో ప్రయాణానికి సంబంధం లేదన్నారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో ప్రధాని మోదీ ఎందుకు అలా మాట్లాడారు? రాజకీయ లబ్ధి కోసమే ఆయన మాట్లాడారా?" ఆయన అని నిలదీశారు. కాగా, మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యాన్ని కల్పించడంపై ప్రధాని మోదీ అక్కసు వెళ్లగక్కడం.. ఆయన మహిళా వ్యతిరేకి అన్నదానికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు.

## అయోధ్య ఆలయం గేట్లు తెరిచిందే రాజీవ్

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయం గేట్లను 1986లో తెరిచిందే మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని, అప్పుడు మోదీ ఎక్కడ ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కోర్టు తీర్పును, హిందువుల మనోభావాలను గౌరవిస్తూ రామ్ లల్లా గేట్లను రాజీవ్ తెరిపించారని గుర్తు చేశారు. ప్రధాని హోదాలో ఎన్నికల నియమావళిని గౌరవించాల్సిన మోదీ.. ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూలుస్తారంటూ మోదీ చేస్తున్న వ్యాఖ్యలు.. మత విశ్వాసాలను రెచ్చగట్టడం కిందకే వస్తాయన్నారు. తక్షణం తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో.. కాంగ్రెస్‌కే మా మద్దతు: సీపీఎం

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సీపీఎం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమికి మద్దతు ఇచ్చామని, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కూడా బీజేపీని ఓడించడానికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. కాగా, సబ్బండ వర్గాల గొంతుకగా ప్రశ్నించే మల్లన్నను శాసన మండలికి పంపేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ తెలిపింది.

## నార్సింగ్ మునిసిపాలిటీ కాంగ్రెస్ కైవసం..

**ఎల్లారెడ్డి మునిసిపాలిటీలో సీన్ రివర్స్**

**కాంగ్రెస్‌లో చేరిన చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం**

నార్సింగ్/ఎల్లారెడ్డి, మే 18 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం నార్సింగ్ మునిసిపాలిటీని అధికార కాంగ్రెస్ దక్కించుకోగా.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మునిసిపాలిటీలో మాత్రం ఆ పార్టీకి షాక్ తగిలింది. అక్కడ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మునిసిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టగా బీఆర్ఎస్ సభ్యులతో పాటు కాంగ్రెస్ సభ్యులు కూడా అనుకూలంగా ఓటేశారు. శనివారం నార్సింగ్ మునిసిపాలిటీలో బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా ఉన్న రేఖ, వైస్‌చైర్మన్‌గా ఉన్న వెంకటేశ్ యాదవ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందింది. దీంతో వారు తమ పదవులను కోల్పోయారు. మొత్తం 18 మంది కౌన్సిల్ సభ్యులుండగా.. 14 మంది అనుకూలంగా ఓటేశారు. ఇటు లోక్‌సభ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డి మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణకు వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం 12 మంది కౌన్సిలర్లలో బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మందితో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సైతం తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. రాష్ట్రంలో అవిశ్వాసం పెట్టిన మునిసిపాలిటీల్లో అధికార కాంగ్రెస్సే చైర్మన్ పదవులను నెగ్గుతూ వచ్చింది. కానీ ఎల్లారెడ్డిలో మాత్రం ఆ పార్టీకి షాక్ తగిలింది.

## ఆలయాల అభివృద్ధికి కృషి

**వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదు**

**అబుధాబిలోని హిందూ ఆలయాన్ని సందర్శించిన విప్ ఆది శ్రీనివాస్**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్‌ప్రతినిధి)



బాప్స్ హిందూ మందిరం వద్ద విప్ ఆది శ్రీనివాస్

తెలంగాణలోని ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి ఇందుకోసం కట్టుబడి ఉన్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం వేములవాడ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తామని చెప్పిందని, కానీ చేసిందేమీ లేదన్నారు. శనివారం యూఏఈ రాజధాని అబుధాబిలోని ప్రతిష్ఠాత్మక బాప్స్ హిందూ మందిరంలో జరిగిన సత్యనారాయణ వ్రతం, రుద్రాభిషేకం కార్యక్రమాల్లో విప్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి యూఏఈ ఎన్నారై సెల్ అధ్యక్షుడు యస్వీ రెడ్డితో కలిసి వచ్చిన ఆయనకు కార్యక్రమ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆది శ్రీనివాస్‌కు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని కూడా అబుధాబిలోని ఆలయం తరహాలో ఆధునికీకరణకు ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యేను ఈ సందర్భంగా కొందరు ప్రవాసీయులు కోరారు.

## నగదు రహిత చికిత్స అందించండి

**ఆరోగ్య శాఖ మంత్రికి పింఛనుదారుల జేఏసీ వినతి**

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): పింఛనుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారులకు నగదు రహిత చికిత్స అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ పింఛనుదారుల జేఏసీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు విజ్ఞప్తి చేసింది. మంత్రి సానుకూలంగా స్పందించారని జేఏసీ చైర్మన్ కె. లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## క్యాబినెట్ భేటీకి అనుమతి కోసం మంత్రులంతా ఢిల్లీకి!

(మొదటిపేజీ తరువాయి)

రాత్రి 7 గంటల వరకు సచివాలయంలో వేచి చూసినా అనుమతి రాకపోవడంతో వెను దిరిగామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న తరుణంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని ఎక్కడా చెప్పలేదన్నారు. రైతు సంక్షేమం, రుణ మాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంట ప్రణాళిక, నిధుల సమీకరణ, విభజన సమస్యలు, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వంటి అంశాలపై మంత్రివర్గంలో చర్చించాలనుకున్నామని వెల్లడించారు. ఎన్నికల సంఘం అనుమతించక పోవడంతో ముఖ్యమైన సమస్యలపై ఏం చేయాలనే విషయమై చర్చించే అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని పోలింగ్ మర్నాడే సీఎం రేవంత్ నిర్ణయించారు. దేశవ్యాప్త లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ సమావేశానికి అనుమతి కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. శనివారం రాత్రి వరకు ఈసీ నుంచి ఎలాంటి అనుమతీ రాకపోవడంతో అధికారికంగా మంత్రివర్గ సమావేశం నిర్వహించలేదు. ఈసీ నుంచి ఏ క్షణమైనా అనుమతి వస్తుందని మంత్రులందరూ శనివారం మధ్యాహ్నమే సచివాలయానికి వచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. రైతు రుణ మాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన ఇతర పలు కీలకమైన విషయాలపై మంత్రివర్గంలో చర్చించాలని ఎజెండాను సిద్ధం చేశారు. ఎన్నికల సంఘం నుంచి స్పందన లేకపోవటంతో అత్యవసరమైన అంశాలపై చర్చించలేక పోయామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఉందని, వేడుకల నిర్వహణతో పాటు పెండింగ్‌లో ఉన్న పునర్విభజన అంశాలపై మంత్రివర్గంలో చర్చించాలని భావించామని సీఎం చెప్పారు. సమావేశం వాయిదా పడటంతో చర్చించలేక పోయామన్నారు. ఈసీ నుంచి అనుమతి ఎప్పుడు వస్తే అప్పుడే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సోమవారం కూడా అనుమతి రాకపోతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తామని ప్రకటించారు.

# అధ్యయనం, మరమ్మతులు ఏకకాలంలో!

**నెల రోజుల్లో పూర్తి చేద్దామంటున్న అధికారులు.. 3 బ్యారేజీల అధ్యయనం 3 కేంద్ర సంస్థలకు**

**రేవంత్ నేతృత్వంలోని భేటీలో నిర్ణయం**

**మరమ్మతు ఖర్చు నిర్మాణ సంస్థలదే**

**అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టీకరణ**



హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థితిగతులపై ఏకకాలంలో మూడు కేంద్ర సంస్థలతో అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మేడిగడ్డ బ్యారేజీని ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం(సీఎస్ఎంఆర్ఎస్)తో, అన్నారం బ్యారేజీని పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్)తో, సుందిళ్ల బ్యారేజీని హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)తో అధ్యయనం చేయించనున్నారు. బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దానిపై ఈ మూడు సంస్థలతో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయించాలని సూచిస్తూ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ ఇటీవలే నివేదిక ఇచ్చింది. నివేదికపై శనివారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు చర్చించారు. ఇతర మంత్రులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. మధ్యంతర నివేదికలో ఏమేం సిఫారసులున్నాయి? బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలేంటి? ప్రభుత్వం చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. బ్యారేజీల అధ్యయనంతో పాటు రిపేర్లు ఏకకాలంలో చేపట్టాలని నిర్దేశించారు. సమాంతరంగా చేపట్టడం వల్ల నాలుగు వారాల్లోగా మరమ్మతులు, పరీక్షలు పూర్తవుతాయని అధికారులు చెప్పారు. పరీక్షలపై నోడల్ అధికారిగా నీటి పారుదల శాఖలోని డిజైన్ల విభాగం చీఫ్ ఇంజనీరును నియమించాలని శనివారం నాటి సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకొని, వెనువెంటనే అధ్యయనం చేసేలా చూడాలని నిర్దేశించారు. ఆనకట్టల భద్రత జాతీయ సంస్థ నివేదిక ప్రకారం మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బ్యారేజీల మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేశారు. 2019 జూన్‌లో మూడు బ్యారేజీలు ప్రారంభం కాగా.. అదే సంవత్సరం వచ్చిన వరదలకు బ్యారేజీలు దెబ్బతిన్నాయని, 2019 నవంబరులోనే లోపాలు బయటపడ్డాయని నీటిపారుదల శాఖ అధికారులు సీఎంకు నివేదించారు. బ్యారేజీల నిర్మాణం పూర్తి కాకముందే పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేశారని, ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని, బ్యారేజీలు పూర్తి కానట్లుగానే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు నివేదించారు. పూర్తయిన ఆర్నెల్లకే లోపాలు బయట పడినందున వాటిని సరి చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని, లోపాలు బయట పడినప్పుడే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేసి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదని అధికారులు చెప్పారు. పునరుద్ధరణ/మరమ్మతుల ఖర్చు నిర్మాణ సంస్థలు భరించాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

### వారం రోజుల్లో కాళేశ్వరం పంపుల వద్దకు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), కాసిపేట(సుందిళ్ల) పంప్‌హౌస్‌లను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలను పరిశీలించినప్పటికీ పంప్‌హౌస్‌లను మాత్రం పరిశీలించలేదు. బ్యారేజీల్లో నీటిని నిల్వచేస్తే పంప్‌హౌస్‌లు పంపింగ్‌కు అనుకూలంగా ఉన్నాయా? లేవా? అనేది వారం రోజుల్లో జరిగే పర్యటనలో ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు.

### 2019లోనే లోపాలు: ఉత్తమ్

2019 జూన్‌లో కాళేశ్వరం బ్యారేజీలు ప్రారంభం కాగా... అదే ఏడాది నవంబరులో వరదల అనంతరం గేట్లు మూయగానే సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురు అయ్యాయని, బ్యారేజీ లోపల, బయట అప్రాన్లు కూడా దెబ్బతిన్నాయని, బ్యారేజీల్లో లోపాలు బయట పడినా రిపేర్లు చేయలేదని నీటి పారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంతో పాటు మంత్రులకు వివరించారు. ఇక మేడిగడ్డ బ్యారేజీలోని 7వ నంబర్ బ్లాక్‌కు మరింత నష్టం జరగకుండా ప్రస్తుత పరిస్థితిలో నిర్వహించే ఎలాంటి నివారణ చర్యలైనా తాత్కాలికమేనని, మరింత దెబ్బతినకుండా యథాతథ స్థితిని కొనసాగించడం కోసమే ఈ మరమ్మతులని చెప్పారు. ఈ మరమ్మతుల తర్వాత కూడా అత్యంత విపత్కర పరిస్థితిలో ఉన్న 7వ బ్లాక్ మరింత ముప్పుకు గురయ్యే అవకాశాలను తోసిపుచ్చలేమని ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికలో ఉందని ప్రస్తావించారు.

### బ్యారేజీలపై క్యాబినెట్‌లో చర్చిస్తాం: రేవంత్

మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఈలోగా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బ్యారేజీలను రిపేర్లు చేయాలా? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? మరింత నష్టం జరగకుండా ఏమేం చర్యలు చేపట్టాలనేది నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. శ నివారం మంత్రివర్గ సమావేశం జరగకపోవడంతో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలకమైన అంశాలపై చర్చించలేక పోయామని చెప్పారు.

### సుందిళ్ల ఖాళీ!

**ఐదు గేట్లు ఎత్తి నీటి విడుదల**

**మరమ్మతుల కోసమే?**

మంథని రూరల్, మే 18: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుందిళ్ల బ్యారేజీలో ఐదు గేట్లను ఎత్తి నిల్వ ఉన్న కొద్దిపాటి నీటిని శనివారం దిగువకు విడుదల చేశారు. నీటి విడుదలకు సంబంధించిన కారణాలను వెల్లడించలేదు. బ్యారేజీ పూర్తిగా ఖాళీగా కనిపిస్తోంది. చేపలను పట్టుకోవడానికి జనం ఎగబడుతున్నారు. మరమ్మతుల కోసమే నీటిని దిగువకు వదిలినట్లు చర్చ జరుగుతోంది.

## ఐటీ పార్కుకు భూ కేటాయింపులు సబబే

**వాటికి రిజర్వు ఫారెస్టు అన్న గుర్తింపు లేదు**

**ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ 'పిల్'ను కొట్టివేసిన హైకోర్టు**

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఐటీ పార్కుకు భూములు కేటాయించడం సబబేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేటాయింపులను సవాలు చేస్తూ ఫోరంఫర్ బెటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఓఎం డెబెరా, డాక్టర్ రావు వీబీజే చెలికానిలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఇమరత్ కంచ గ్రామంలోని 4,067 ఎకరాలు, సరూర్‌నగర్ మండలం మామిడిపల్లిలోని 2,400 ఎకరాల అటవీ భూములను డీనోటిఫై చేయకుండా అటవీయేతర అవసరాలకు కేటాయించారని పిటిషనర్లు ఆరోపించారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. మొత్తం 6,468 ఎకరాల అటవీభూములను అటవీయేతర అవసరాలకు కేటాయించడం చట్టవిరుద్ధమని.. ఈ భూములన్నింటికీ తెలంగాణ అటవీశాఖను యజమానిగా ప్రకటించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. హైదరాబాద్ ఫారెస్ట్ యాక్ట్ - 1355 ఫాల్సీ ప్రకారం వివాదంలో ఉన్న భూములను రిజర్వుఫారెస్టుగా గుర్తించలేదని పేర్కొన్నారు. ప్రైవేటు ప్రతివాదులు స్టార్‌గేజ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, జేటీ హోల్డింగ్స్ తరఫున సీనియర్ న్యాయవాది పీ శ్రీరఘురాం, ఇండూటెక్ జోన్ తరఫున బీ విజయ్ కుమార్, ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ తరఫున జాగృతి దుగార్ వాదనలు వినిపించారు. వాదనలు నమోదుచేసుకున్న ధర్మాసనం.. "ప్రస్తుత వివాదంలో భూముల బదలాయింపులన్నీ ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ 1980 అమలులోకి రాకముందు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ ఫారెస్ట్ యాక్ట్ - 1355 ఫాల్సి, ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ) ఫారెస్ట్ యాక్ట్ - 1967 కింద ఈ భూములను రిజర్వుఫారెస్ట్‌గా గుర్తించలేదు. చట్టప్రకారం ఎలాంటి ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలు లేవు. ప్రస్తుత దశలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమ"ని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టేసింది.

## రేవంత్.. హామీలను నెరవేర్చలేరు

**ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌కు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గుడ్ బై**

**రాష్ట్రంలో ప్రత్యామ్నాయం మేమే: కిషన్‌రెడ్డి**



భువనగిరి టౌన్/హనుమకొండ టౌన్, మే 18: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని తెలిపారు. భువనగిరిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక భేటీలో, హనుమకొండలో జరిగిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనం, బీజేపీ కార్యకర్తల భేటీలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని పొగుడుతూ, విపక్షాలను విమర్శిస్తూ కాలయాపన చేయడం రేవంత్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీలో ఉండే పరిస్థితి లేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ మొదలుకుని అన్ని పదవులకు బీజేపీ పోటీ చేస్తుందని, అందుకు స్థానిక నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే దానం, కడియం తరహాలో పార్టీ మారతాడని.. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రేవంత్‌రెడ్డి జపం చేస్తాడని అన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రజా గొంతుకగా నిలుస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు.

### సీఎంను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు..

మంత్రులు గొడవలు పడి ప్రభుత్వాన్ని కూల్చుకుంటే తామేమీ చేయలేమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావ్ పటేల్, పైడి రాకేశ్ రెడ్డి సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని, రుణమాఫీ చేయాలని కోరారు.

### వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయాలి: రఘునందన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని బీజేపీనేత రఘునందన్‌రావు తెలిపారు. కేసులో ఆధారాలున్నా ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి డీజీపీ రవిగుప్తాను రఘునందన్ శనివారం కలిశారు. అనంతరం.. ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి వియ్యంకుడు అయినందునే వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయలేదా..? అని డీజీపీని అడిగామని చెప్పారు.

# 'స్థానికానికి' రిజర్వేషన్ల సెగ

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువగా ఉండి, బీసీలు తక్కువగా ఉంటే.. ఆ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు పోను మిగిలిన రిజర్వేషన్‌లో బీసీలకు కేటాయించాల్సి వస్తోంది. దీంతో బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం దక్కడం లేదు. ఈ విధానం కోసమైతే ఓటర్ల జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే సరిపోతుంది. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్రంలోని డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని బీసీ డెడికేటెడ్ కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల కోడ్ తొలగిపోగానే ఈ రిపోర్టును రూపొందించేందుకు వీలుగా వివరాలు సేకరించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ప్రశ్నావళి కూడా అందజేసింది. అదే సమయంలో తాజా ఓటర్ల జాబితాను కూడా పరిశీలిస్తోంది. అనంతరం ఆయా కులాల వారీగా రిజర్వేషన్‌ను నిర్ణయించే అవకాశం ఉంది. కానీ, బీసీల రిజర్వేషన్ మాత్రం తేలడంలేదు. ఇలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన కులగణనను పూర్తిచేసిన తరువాత వాటి ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేయాలంటే అందుకు చాలా సమయం పడుతుంది. పైగా కులగణనలో బీసీలు అధికంగా ఉన్నారని తేలితే.. అప్పుడు కూడా వారికి కేటాయించే రిజర్వేషన్లలో మళ్లీ ఈ 50 శాతం సమస్యే తలెత్తుతుంది.

### పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేసినా..

బీఆర్ఎస్ సర్కారు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. అందులో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. ఆ విధానంలోనే 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లను తగ్గించడంపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారించిన హైకోర్టు రిజర్వేషన్లను తగ్గించి ఎన్నికలు జరపాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని అభిప్రాయపడింది. అంతేకాకుండా రిజర్వేషన్లను పాటించని ఎన్నికలను ఎందుకు రద్దు చేయకూడదని కూడా ప్రశ్నించింది. దీంతో.. 2024లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సుప్రీం మార్గదర్శకాలను అమలుచేస్తామని కోర్టుకు ప్రభుత్వం వివరణ ఇచ్చుకుంది. అయితే సుప్రీం మార్గదర్శకాల ప్రకారం చేయాలంటే అందుకు రాష్ట్రంలోని బీసీల జనాభాను తేల్చాలి, బీసీ గణన జరిపి జనాభాలో వారి శాతాన్ని ఖరారు చేయాలి. కానీ, గత ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోలేదు. దీంతో ఇప్పుడు ఈ అంశమే ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. అయితే 2018లో సవరణలు చేసిన పంచాయతీరాజ్ చట్టంలోనే మరోసారి కొన్ని సవరణలు చేస్తే బీసీల రిజర్వేషన్‌లో మార్పులు చేసేందుకు అవకాశం ఉంది. అలా చేయాలంటే ముందుగా రాష్ట్రంలో బీసీ జనాభా ఎంత, రాజకీయ ప్రాతినిధ్యం, వెనుకబాటుతనానికి కారణాలేంటన్న వివరాలను పరిశీలించాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయితేనే సవరణలు చేసి రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే అలా చట్టాన్ని మార్చినా రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్రానికి లేదు.

### రాష్ట్రాలకు లేని రిజర్వేషన్ల పెంపు అధికారం

రిజర్వేషన్ల పెంపు అంశం రాష్ట్రాల పరిధిలో లేదు. ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్లను కులాల వారీగా పెంచాలంటే భారత ప్రభుత్వం రాజ్యాంగంలో సవరణలు చేయాల్సి ఉంది. పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు పెట్టి.. దానిని ఆమోదిస్తేనే రిజర్వేషన్ల పెంపునకు అవకాశం ఉంటుంది. కానీ, దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తింపజేయాల్సి ఉంటేనే కేంద్రం అందుకు అంగీకరిస్తుంది. కాగా, ఒడిసా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించి స్థానిక ఎన్నికలను నిర్వహించింది. ఒకవేళ దాని ప్రకారం తెలంగాణలోనూ ఎన్నిక నిర్వహించేందుకు అవకాశం ఉన్నా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని గతేడాది అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతో బీసీల రిజర్వేషన్లను తేల్చకుండా ఎన్నికలు నిర్వహించడం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారుతుంది. కాగా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలోని డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని బీసీ కమిషన్‌నే పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్‌గా ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ గతంలో తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పర్యటించి.. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల అంశాలపై పరిశీలన జరిపింది. ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న బీసీ రిజర్వేషన్లు సహా పలు విషయాలపై అధ్యయనం చేసింది. కానీ, గత ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందించకపోవడంతో నివేదిక ఇవ్వలేకపోయింది. ప్రస్తుత ం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో కులగణన నిర్వహించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసింది. అయితే కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ అంశాలు రెండూ వేరువేరుగా ఉన్నాయి. దీంతో ముందుగా స్థానిక ఎన్ని కల్లో బీసీల రిజర్వేషన్‌ను తేల్చేందుకు అవసరమైన కసరత్తును డెడికేటెడ్ కమిషన్ ప్రారంభించింది. పార్లమెంటు ఎన్నికల కోడ్ అయిపోగానే క్షేత్రస్థాయిలో బీసీలకు సంబంధించి అన్ని వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

### ఆశావహుల్లో ఆందోళన..

స్థానిక సమరంలో రిజర్వేషన్ల వేడి రోజురోజుకు పెరుగుతుండగా.. తమకు పోటీ చేసే అవకాశం వస్తుందో, రాదోనని ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల సమయంలో రిజర్వేషన్‌లో మార్పులు జరిగి ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ప్రతిసారీ ఎవరో ఒకరికి అవకాశం వస్తోంది. కానీ, ఈసారి బీసీలకు రిజర్వేషన్ అంశం తేలకపోవడంతో.. క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల కోసం పనిచేసిన వారికి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పోటీచేసేందుకు అవకాశం వస్తుందో లేదోననే చర్చ జరుగుతోంది.

# కాకతీయ వర్సిటీ వీసీ రమేష్‌పై విజిలెన్స్ విచారణ

**ఆదేశించిన ప్రభుత్వం**

**అవినీతి, వర్సిటీ భూముల అన్యాక్రాంతం, అక్రమ పోస్టింగ్‌లపై ఆరోపణలు..**

**ఆంధ్రజ్యోతి కథనాలు, అకుట్ ఫిర్యాదుతో స్పందించిన ప్రభుత్వం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విధుల నుంచి టెర్మినేట్ చేసిన బోధనా సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా విధుల్లోకి తీసుకోవడం, అక్రమ బదిలీలు, నియామకాలు, నకిలీ ప్రాజెక్టులు ఆమోదించి అక్రమాలకు పాల్పడ్డారంటూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు గతంలో అనేకసార్లు ఆరోపించారు. అలాగే యూనివర్సిటీ భూముల అన్యాక్రాంతం, అక్రమ పోస్టింగ్‌లపై ఆరోపణలు రావడం, ఆంధ్రజ్యోతిలో కథనాలు, అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) ఫిర్యాదుతో ప్రభుత్వం వీసీ రమేష్‌పై చర్యలకు ఉపక్రమించింది. 'ఆంధ్రజ్యోతి'లో మార్చి 23న 'అక్రమాలకు కేరాఫ్ కేయూ', ఏప్రిల్ 6న 'కేయూ కబ్జాలపై చర్యలేవీ', మే 17న 'కేయూ ప్రక్షాళన జరిగేనా' తదితర కథనాల నేపథ్యంలో ప్రభుత్వం ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం సేకరించింది. వర్సిటీలోని అకుట్‌తో పాటు వివిధ అధ్యాపక సంఘాలు వీసీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేయడంతో స్పందించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. వీసీపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిందిగా వెంకటేశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ నిర్ణయాన్ని వీసీ రమేష్ స్వాగతించారు. గత మూడేళ్ల పదవీకాలంలో వర్సిటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని, న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడతోపాటు 300మందికిపైగా పీహెచ్‌డీ ప్రవేశాలు పూర్తి చేశామన్నారు. ఉద్యోగులు, పింఛనర్లకు రావాల్సిన అన్నిరకాల బకాయిలు విడుదల చేశానని తెలిపారు. వర్సిటీ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేశారన్నారు. ప్రభుత్వ విచారణను ఆహ్వానిస్తున్నానని తెలిపారు.

## వైద్య పరీక్షల కోసం అమెరికాకు చంద్రబాబు

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు సతీమణి భువనేశ్వరి కూడా ఉన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయన అమెరికా వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన గతంలో కూడా ఒకసారి అమెరికాలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇప్పుడు మరో సారి వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లారు. ఐదారు రోజుల్లో ఆయన తిరిగి రానున్నారు. ఆయన కుమారుడు లోకేశ్ కొద్దిరోజుల క్రితం కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లారు.

## కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ కాదు



శనివారం అమేఠీలో ప్రియాంక ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ, మే 18: కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ కానే కాదని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ నోట వెలువడిన చిట్టచివరి పదాలు 'హే రామ్'.. కాంగ్రెస్ పార్టీ హిందుత్వ మూలాలకు నిదర్శనమని తేల్చిచెప్పారు. శనివారం ఇండియా టుడే టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు. 'బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాపై హిందూ వ్యతిరేక పార్టీ అనే ముద్ర వేశారు. మా పార్టీకి అతిపెద్ద నేత ఎవరు? మహాత్మాగాంధీ. మహాత్మాగాంధీని తుపాకీతో కాల్చినప్పుడు ఉచ్చరించిన చివరి పదాలు హే రామ్.. మరి మేం హిందూ వ్యతిరేక పార్టీ ఎలాగవుతాం? కానేకాదు' అని ప్రియాంక పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ ప్రచారంపై దృష్టి పెట్టేందుకే తాను ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయట్లేదని ప్రియాంక తెలిపారు. రాహుల్‌గాంధీ, తాను ఇరువురూ ఎన్నికల్లో పోటీ చేస్తే బీజేపీకే మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్తులోనైనా ఎన్నికల్లో పోటీ చేస్తారా? అని ప్రశ్నించగా, 'నేను పోటీ చేయాలని పార్టీలోనివారు భావిస్తే.. అప్పుడు పోటీ చేస్తా' అని చెప్పారు. కాగా, యూపీలోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాహుల్‌గాంధీ ఈ నియోజకవర్గాన్ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాయ్‌బరేలీ మరోసారి ఈ దేశానికి ప్రగతి దారి చూపాలని వ్యాఖ్యానించారు.

> రాహుల్ ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నారు. దేశం గుండె చప్పుడు ఆయనకు తెలుసు. అందుకే మంచి ప్రధాని అవుతారు. అయితే, ఎన్నికలు ముగిశాక ఇండియా కూటమి దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
> - ప్రియాంక

### బహిరంగ చర్చకు నేను రెడీ.. కానీ మోదీ రారు: రాహుల్

న్యూఢిల్లీ, మే 18: వివిధ అంశాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి ప్రధాని మోదీకి సవాలు విసిరారు. చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ ప్రధానే ముందుకు రాకపోవచ్చని అన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ "ప్రధాని కోరుకున్న సమయంలో కోరుకున్న చోట చర్చలకు రెడీ ఉన్నా. అయితే ఆయన వస్తారని అనుకుంటున్నారా? నాకు తెలుసు.. ఆయన రారు. ఎందుకంటే నేను అడిగే మొదటి ప్రశ్న..అదానీతో ఉన్న మీకున్న సంబంధం ఏమిటని? ఇది అడుగుతాను కాబట్టే ఆయనకు ఇష్టం ఉండదు" అని అన్నారు.

# గాంధీల కోటపైనే అందరి కళ్లు!

## ఐదోవిడతలో రాయ్‌బరేలీ, అమేఠీ.. ఈ విడతలో యూపీలో 14సీట్లకు పోలింగ్

- 2019లో అమేఠీ సహా 13 సీట్లు బీజేపీ సొంతం.. రాయ్‌బరేలీలో కాంగ్రెస్ గెలుపు
- ఈసారి రాయ్‌బరేలీపైనా బీజేపీ గురి
- ఇక్కడ రాహుల్‌గాంధీ పోటీతో ఆసక్తి
- రేపు 49స్థానాలకు ఐదోవిడత పోలింగ్

న్యూఢిల్లీ, మే 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ముగింపునకు వస్తున్నాయి. ఈ నెల 20వ తేదీన ఐదో విడతలో 49 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, అందులో 14 నియోజకవర్గాలు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. గాంధీల కుటుంబంతో ముడిపడిన రాయ్‌బరేలీ, అమేఠీలకు ఈ విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ విడత ఎన్నికలు దేశం దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. అలాగే.. గత ఎన్నికల్లో ఒక్క రాయ్‌బరేలీని తప్ప తక్కిన 13 సీట్లనూ యూపీలో బీజేపీ కైవసం చేసుకోవడం మరో విశేషం. అలాంటిదే మరో ముఖ్యమైన సీటు లఖనవూ. 2019 నాటి ఊపును ఈసారీ కొనసాగించడంతోపాటు రాయ్‌బరేలీని కూడా దక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. మోదీ గ్యారంటీలు, ఉచిత రేషన్, రామ మందిరం వంటి అంశాలు తమకు కలిసివస్తాయని ధీమాతో ఉంది. అయితే, అదంత ఈజీ కాదని రాయ్‌బరేలీ రాజకీయ చరిత్రను చూస్తేనే తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో రాయ్‌బరేలీ పేరు గాంధీల కుటుంబంతో ముడిపడిపోయింది. ఇన్నాళ్లలో మూడుసార్లు తప్ప (1977, 1996, 1998) ప్రతిసారీ గాంధీలే కేతనం ఎగురవేశారు. 20 ఏళ్లపాటు సోనియాగాంధీ ఇక్కడినుంచి పార్లమెంటుకు ఎన్నిక అవుతూ వచ్చారు. ఇప్పుడు తన కుమారుడు రాహుల్‌ను ఇక్కడ నిలిపారు. 'నా బిడ్డను మీకు అప్పగిస్తున్నాను' అంటూ రాయ్‌బరేలీ ప్రజలతో సోనియా అనడం ఈ నియోజకవర్గంతో గాంధీల కుటుంబానికి ఉన్న భావోద్వేగ బంధానికి నిదర్శనం. ఈ గాంధీల కోటపైనే బీజేపీ గురిపెట్టి ప్రచారాన్ని ఉధృతం చేసింది. కమలం పక్షాన రాష్ట్ర మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ పోటీలో ఉన్నారు. అయితే, గాంధీల విజయం రాయ్‌బరేలీలో పక్కా అని, మెజారిటీ ఎంత అనేదే తెలియాల్సి ఉన్నదని ఓ రిక్షా కార్మికుడు అనడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలి పెద్దఎత్తున వీచిన 2019 ఎన్నికల్లోనూ సోనియా 1.67 లక్షల భారీ మెజారిటీతో గెలిచారు.



దినేశ్ సింగ్ రాహుల్ గాంధీ

### 'కూటమి'పైనే కాంగ్రెస్ భారం..

ఐదో విడతలో బీజేపీపై పోరుకు ఇండియా కూటమిపార్టీలపైనే కాంగ్రెస్ ఆధారపడనుంది. ఈ విడతలో మొత్తం 49 స్థానాలకుగాను, కాంగ్రెస్ కేవలం 18 చోట్ల మాత్రమే పోటీ చేస్తోంది. మిగతా స్థానాలలో కూటమి పార్టీలైన శివసేన(యూబీటీ), ఎస్పీ, ఆర్జేడీ, ఎన్సీపీ(శరద్‌పవార్) తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. ఇక బీజేపీ 40 చోట్ల పోటీ చేస్తోంది. మిగతా చోట్ల శివసేన(షిండే), ఇతర ఎన్డీఏ పక్షాలు బరిలో ఉన్నాయి. కాగా, జమ్మూలోని బారాముల్లాకు బీజేపీ దూరంగా ఉంది. ఆర్టికల్ 370తో జమ్మూకశ్మీర్‌లో తమపార్టీకి సానుకూల పవనాలున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నప్పటికీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. ఇక.. మహారాష్ట్ర(13), పశ్చిమబెంగాల్(7), బిహార్, ఒడిశా(5), జార్ఖండ్(3), లద్దాఖ్(1) స్థానాల్లో మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

### బరిలో ప్రముఖులు..

బిహార్‌లోని సరన్ నుంచి ఆర్జేడీ అధినేత లాలూ కుమార్తె రోహిణి ఆచార్య, హాజీపూర్ నుంచి రాంవిలాస్ పాశ్వాన్ చిరాగ్, ముంబై నార్త్ నుంచి కేంద్ర మంత్రి గోయల్, ముంబై నార్త్ సెంట్రల్ బరిలో.. ముంబై దాడుల కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. బారాముల్లాలో ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్నారు.

### గాంధీలు దూరం..

ఆమేఠీ మరో కాంగ్రెస్ కంచుకోట. అయితే, ఈసారి గాంధీలు ఆమేఠీకి దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో రాహుల్‌ను కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఓడించి.. గాంధీల పరంపరకు గండికొట్టారు. ఈసారి గాంధీలు ఆమేఠీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ తరఫున కేఎల్ శర్మ పోటీలో ఉన్నారు. ఆమేఠీలోనూ, రాయ్‌బరేలీలోనూ ప్రచారాన్ని ప్రియాంక తన భుజాలపై వేసుకుని.. ప్రతిష్ఠాత్మక విజయం కోసం శ్రమిస్తున్నారు. మరోవైపు.. స్మృతి ఆమేఠీలో బీజేపీకి మరోసారి విజయం అందించడానికి చెమటోడుస్తున్నారు. ఇక..సీనియర్ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లఖ్‌నవూలో హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. ఇక.. కైసర్‌గంజ్ సీటు ఇటీవలి వివాదాల కారణంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మహిళా రెజ్లర్ల ఆగ్రహానికి, ఢిల్లీ ఆందోళనలకు కేంద్ర బిందువుగా ఉన్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు, కైసర్‌గంజ్ సిట్టింగ్ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌కు బీజేపీ సీటు నిరాకరించింది. ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది.

## లోకం తీరు




### ఇంటి నుంచి ఓటేసిన
## మన్మోహన్, ఆడ్వాణీ

**హమీద్ అన్సారీ, మనోహర్ జోషి కూడా**

న్యూఢిల్లీ, మే 18: మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని మన్మోహన్, బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే అడ్వాణీ, మురళీ మనోహర్ జోషి తమ తమ ఇళ్ల దగ్గర నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూత్‌లకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓట్లు వేయిస్తున్నారు. ఈ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మే 24వరకు జరగనుంది. అన్సారీ గురువారమే ఓటు వేయగా, శుక్రవారం మన్మోహన్, మనోహర్ జోషి, శనివారం ఆడ్వాణీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరంతా న్యూఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేశారు.



# మా వల్లే పాక్ భిక్షాపాత్రతో తిరుగుతోంది

- మనకు కీడు తలపెట్టాలంటే వందసార్లు ఆలోచిస్తారు
- హరియాణా ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 18: గత డెబ్బయి ఏళ్లగా చేతిలో బాంబులు పెట్టుకొని బెదిరించిన పాకిస్థాన్ ఇప్పుడు భిక్షాపాత్ర పట్టుకొని తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లగా కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. హరియాణాలోని అంబాలాలో శనివారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటే శత్రువులు కూడా ఏదన్నా చేయాలంటే వంద సార్లు ఆలోచిస్తారని చెప్పారు. తమది బలమైన ప్రభుత్వం కాబట్టే ఆర్టికల్ 370 గోడలు బద్దలు కొట్టామని వ్యాఖ్యానించారు. కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వం ఉంటే జమ్మూ కశ్మీరు పరిస్థితిని మార్చగలిగేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హరియాణాకు చెందిన సైనిక యోధుల తల్లుల కంటి మీద కునుకు ఉండేది కాదన్నారు. గత పదేళ్లగా ఉగ్రవాదుల కార్యకలాపాలు ఆగిపోయాయని చెప్పారు. ఆర్టికల్ 370ని ధైర్యం చేసి రద్దు చేయడం వల్లే కశ్మీరు అభివృద్ధి పథంలో పయనిస్తోందని ప్రకటించారు. ఇండీ కూటమి దేశ వ్యతిరేకుల కూటమి అని మోదీ అభివర్ణించారు.

### రాముడు కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వడు

అయోధ్యలోని బాల రాముడు కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వడని యూపీ సీఎం యోగి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ముంబయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాజా ఎన్నికలు రామ భక్తులకు, రామ ద్రోహులకు మధ్య జరుగుతున్నాయన్నారు. రాముడికి ఆలయం కట్టడంతో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తీవ్ర మనస్తాపానికి గురయ్యాయని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే అయోధ్యలో ఆలయాన్ని కూల్చేస్తామని కొందరు కాంగ్రెస్ నేతలు అంటున్నారని చెప్పారు.

## బీబీసీపై రూ.10వేల కోట్లకు పరువు నష్టం దావా

- ప్రధానిపై తప్పుడు డాక్యుమెంటరీ రూపొందించినట్టు ఆరోపణ

న్యూఢిల్లీ, మే 18: గోద్రా అల్లర్లకు సంబంధించి ప్రధాని మోదీపై తప్పుడు డాక్యుమెంటరీని రూపొందించిందని ఆరోపిస్తూ గుజరాత్‌కు చెందిన జస్టిస్ ఆన్ ట్రయల్ అనే స్వచ్ఛంద సంస్థ బీబీసీపై రూ.10వేల కోట్లకు పరువు నష్టం దావా వేసింది. డాక్యుమెంటరీ భారత దేశ, న్యాయవ్యవస్థల ప్రతిష్ఠతోపాటు ప్రధాని మోదీ గౌరవానికి భంగం కలిగించిందని ఆరోపించింది. పరువు నష్టం దావా వేసే సమయంలో పరిహారం కోరిన మొత్తంలో నిర్ణీత శాతాన్ని కోర్టులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే తమ సంస్థను 'నిరుపేద వ్యక్తి'గా పరిగణించి ఆ డిపాజిట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఈ దావా శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ అనుప్ జైరాం భంభాని ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ విచారణ నుంచి తనను తప్పించి వేరే వారికి అప్పగించాలని ఆయన కోరారు.

# మత స్వేచ్ఛను కాపాడతాం!

## అయోధ్య నిర్మాణం పూర్తిచేస్తాం.. రామ మందిరం కూలుస్తామన్న మోదీ వ్యాఖ్యలు దారుణ అబద్ధాలు

- ఇండియా' కూటమి నేతల ఫైర్
- బుల్డోజర్ సంస్కృతి బీజేపీదేనని ఎద్దేవా



ముంబై, మే 18: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరాన్ని బుల్డోజర్‌తో నేలమట్టం చేస్తారన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కూటమి పార్టీల అగ్రనేతలు నిప్పులు చెరిగారు. అయోధ్య నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు దేశంలో మత స్వేచ్ఛను కాపాడతామని స్పష్టం చేశారు. తన అబద్ధాలతో మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదో దశ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం ఇండియా కూటమి అగ్రనేతలు కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌లు ముంబైలో సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. ఖర్గే మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లకు ఎలాంటి భంగం వాటిల్లదని, అవి అలానే కొనసాగుతాయని తెలిపారు. "మేం ఎవరి మీదా బుల్డోజర్ ప్రయోగించలేదు. బుల్డోజర్ సంస్కృతి బీజేపీదే. మోదీకి అబద్ధాలు చెప్పడం, ప్రజలను తపుదోవ పట్టించడం అలవాటైపోయింది" అని అన్నారు. "ఆయన(మోదీ) ఎక్కడికి వెళ్లినా సమాజాన్ని విభజించేలా మాట్లాడుతున్నారు" అని దుయ్యబట్టారు. "నా 53 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రధానిని ఎప్పుడూ చూడలేదు. సమాజాన్ని విభజించడం మోదీకి అలవాటుగా మారింది. విపక్షాలను విచ్ఛిన్నం చేసేందుకు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు" అని ఖర్గే నిప్పులు చెరిగారు. మహారాష్ట్రలోని 48 పార్లమెంటు స్థానాలకు 46 స్థానాలను ఇండియా కూటమి కైవసం చేసుకుంటుందన్నారు.

### వారికి కూటమి వ్యతిరేకం కాదు

ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ.. బీజేపీ నకిలీ పార్టీ అని, ఆర్‌ఎస్‌ఎస్ నకిలీ సంఘ్ అని దుయ్యబట్టారు. బీజేపీకి జన్మనిచ్చిన సంస్థను ఆ పార్టీ ఎప్పుడో వదిలేసిందని విమర్శించారు. జూన్ 4 నుంచి దేశానికి మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు. ఇండియా కూటమి హిందువులకు వ్యతిరేకం కాదని తేల్చి చెప్పారు. బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

### మమత మాతోనే

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమతోనే ఉంటారని, ప్రభుత్వంలో భాగస్వామ్యం అవుతామని ఆమె ఇటీవలే చెప్పారని ఖర్గే వ్యాఖ్యానించారు. మమతను నమ్మలేమన్న అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. అధిర్ ఎలాంటి నిర్ణయాలూ తీసుకునే స్థాయిలో లేరని వ్యాఖ్యానించారు. "ఈ విషయంపై నిర్ణయం తీసుకునేది నేను, లేదా హైకమాండ్. మా నిర్ణయాలతో ఏకీభవించలేని వారు బయటకు పోవచ్చు" అని అధిర్‌ను ఉద్దేశించి ఖర్గే అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో.. మావోయిస్టులదని వ్యాఖ్యానించిన ప్రధానిపై ఖర్గే మండిపడ్డారు. "మీ(మోదీ) సలహాదారు ఎవరండీ? ఇది హాస్యాస్పదం. ప్రజలను ప్రతిసారీ మోసం చేయలేరు" అని అన్నారు.

# సుప్రీంను చేరిన ఎన్నికల పర్వం

- పోలింగ్‌శాతాల్లో తేడాలపై ఏడీఆర్ పిటిషన్
- తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈసీ వాదనలు

న్యూఢిల్లీ, మే 18 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం, ఓటింగ్ శాతాల ప్రకటనల్లో తేడాలపై అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఓటింగ్ వివరాల్లో ఇంత భారీ వ్యత్యాసం గతంలో ఎప్పుడూ లేదని, పోలింగ్ ముగిసిన రోజు సాయంత్రమే ఈసీ దాదాపు కచ్చితమైన వివరాలను వెల్లడించేదని వాదించాయి. మిగిలిన దశల ఎన్నికల్లోనైనా.. పోలింగ్ ముగిసిన సాయంత్రమే విలేకరుల సమావేశం నిర్వహించి ఓటింగ్ వివరాలు వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని కోరాయి. వారు లేవనెత్తిన ప్రశ్నలకు ఈ నెల 24 లోపు సమాధానం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఈసీని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. అసలు పిటిషన్‌ను విచారణకు తీసుకోవద్దని ధర్మాసనాన్ని ఒప్పించటానికి ఈసీ తీవ్రంగా ప్రయత్నించింది. పిటిషన్‌పై విచారణ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైనప్పుడు ఈసీ తరఫున న్యాయవాది అమిత్‌శర్మ ధర్మాసనం ముందు హాజరయ్యారు. పిటిషనర్లు కోరుకుంటున్నట్లుగా ఫామ్ 17 సీని (పోలింగ్ బూత్‌ల వారీగా ఓటు వేసిన వారి సంఖ్య) ఈసీ వెబ్‌సైట్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేరని సీజేఐ ప్రశ్నించారు. దీనికి శర్మ సమాధానమిస్తూ.. ప్రతీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల నుంచి ఫామ్ 17లను తెప్పించుకుంటామని, దానికి సమయం పడుతుందని, రాత్రికి రాత్రి అప్‌లోడ్ చేయలేమని చెప్పారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. సరే! మర్నాడు వస్తాయని అనుకుందాం.. మరి, అప్పుడైనా ఎందుకు అప్‌లోడ్ చేయరు అని ప్రశ్నించారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు విచారణ కొనసాగినప్పుడు.. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్‌సింగ్ హాజరయ్యారు. ఈవీఎంలు సరైనవేనన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ పిటిషన్‌పై మళ్లీ విచారణ అక్కర్లేదన్నారు. "ఇది ఎన్నికల ప్రక్రియను అడ్డుకొనే చర్య. ఇప్పుడు పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ వచ్చినంత మాత్రాన.." అంటుండగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ జోక్యం చేసుకున్నారు. "ఎవరు వచ్చారన్నది కాదు.. ప్రశాంత్ భూషణ్ ఒక పిటిషన్ వేశారు, దీనిపై ప్రత్యుత్తరం ఇవ్వాలా? వద్దా? అన్నది ఈసీ నిర్ణయించుకోవాలి" అని అన్నారు. దీంతో ప్రత్యుత్తరం దాఖలు చేస్తామని మణిందర్‌సింగ్ తెలిపారు. పిటిషన్‌పై విచారణను కోర్టు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

### ఎన్నికల ప్రచారం ముందు
## సినిమా షూటింగ్‌లు ఓ జోక్



న్యూఢిల్లీ, మే 18: ఎన్నికల ప్రచార సందడి ముందు సినిమాలు తీయడం ఓ జోక్‌లా కనిపిస్తోందని నటి, మండీ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో తన అనుభవాలను వివరిస్తూ ఆమె ఇన్‌స్టాగ్రాంలో వీడియోను పోస్టు చేశారు. "ఆరు బహిరంగ సభలు..పలుమార్లు కార్యకర్తలతో భేటీలు, వారికి పలకరింపులు..ఒకే రోజు ఏకధాటిగా 450 కి.మీ. ప్రయాణం.. భోజనం ఎప్పుడు చేస్తున్నానో...స్నాక్స్ ఎప్పుడు తింటున్నానో... కారులో తిరుగుతునే ఉన్నా...ఈ హడావిడి ముందు సినిమాలు తీయడానికి చేసే సినీ పోరాటం ఓ జోక్‌లా అనిపిస్తోంది. ఉఫ్ఫ్.."అంటూ వ్యాఖ్యానించారు.

## మా కుటుంబంపై రాజకీయ కుట్ర: దేవెగౌడ

బెంగళూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాసలీలల వివాదంలో చిక్కుకున్న ప్రజ్వల్‌పై చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా తమకు అభ్యంతరం లేదు అని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. తన 91వ జన్మదినం సందర్భంగా బెంగళూరులోని వెంకటేశ్వర ఆలయంలో శనివారం పూజలు జరిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజ్వల్ వివాదంపై తొలిసారి స్పందించారు. 'మా కుటుంబంపై రాజకీయ కుట్ర జరిగింది. కుట్రలో అనేకమంది పాత్ర ఉంది. లోక్‌సభ ఫలితాల తర్వాత మాట్లాడతా' అని దేవెగౌడ అన్నారు.

# కిర్గిస్థాన్‌లో హింస

## దక్షిణాసియా విద్యార్థులపై దాడులు.. భయాందోళనలో తెలుగు విద్యార్థులు

- పార్ట్‌టైం ఉద్యోగాల అంశంలో వివాదం
- పాక్, బంగ్లా తప్పునకు మూల్యం చెల్లిస్తున్న భారతీయులు.. అప్రమత్తం చేసిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో అల్లర్లు చెలరేగాయి. దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులే లక్ష్యంగా స్థానికులు దాడులకు తెగబడుతున్నారు. ఈ హింసాత్మక ఘటనలతో భారతీయ విద్యార్థులు తీవ్రభయాందోళనతో గడుపుతున్నారు. అల్లర్ల నేపథ్యంలో ఇల్లు వదిలి బయటకు రావొద్దని భారత విద్యార్థులను కిర్గిస్థాన్‌లోని భారత ఎంబసీ సూచించింది. బిష్కెక్‌లోని పలు వైద్య కళాశాలల్లో దక్షిణాసియాకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. భారత్ సహా ఇతర దక్షిణాసియా దేశాల విద్యార్థులు తరచూ వెళ్లే ఓ రెస్టారెంట్ వద్ద మూడ్రోజుల క్రితం ఘర్షణ జరిగింది. విదేశీ విద్యార్థులు, కిర్గిస్థాన్ యువకులకు మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో కొందరు పాక్ విద్యార్థులు కిర్గిస్థాన్ యువకులపై దాడి చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో స్థానికులు శుక్రవారం అర్ధరాత్రి విదేశీయులు ఉండే హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థులను చితకబాదారు. ఈ దాడులకు సంబంధించి సోషల్ మీడియాలో ఉన్న కొన్ని వీడియోలు భయానకంగా ఉండటంతో భారతీయ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నట్టుగా ప్రాథమిక సమాచారం ఉందని కిర్గిస్థాన్‌లోని ఆదం విశ్వవిద్యాలయ భారతీయ ప్రతినిధి అశోక్ వెల్లడించారు. కాగా, ఈ ఘర్షణల్లో కొందరు పాక్ పౌరులు మరణించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని కిర్గిస్థాన్ ప్రభుత్వం ఖండించింది. ఒక్క విదేశీయుడు మరణించలేదని శనివారం ప్రకటించింది. ప్రభుత్వం నుంచి సమాచారంలేకుండా ఘర్షణలగురించి ఎలాంటి ప్రకటనలు చేయవద్దని విదేశీ ఎంబసీలను కోరింది. విదేశీ విద్యార్థులు వీసా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారంటూ జరుగుతున్న నిరసన ప్రదర్శనలను సమర్థించింది. అల్లర్లకు పాల్పడిన పలువురు విదేశీ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్టు బిష్కెక్ నగర పోలీసు కమిషనర్ అజామత్ టోక్నోల్వీను ఉటంకిస్తూ స్థానిక మీడియా కథనం వెల్లడించింది. కాగా దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు స్టూడెంట్ వీసాపై కిర్గిస్థాన్‌కు వెళ్లి చదువుకుంటూ మరోపక్క డెలివరీ బాయ్‌లుగా పని చేస్తున్నారు. విదేశీయులు తక్కువ వేతనాలకు పనిచేస్తుండడంపై స్థానిక నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్న వారిలో పాక్, బంగ్లా పౌరులే అధికంగా ఉన్నారని కిర్గిస్థాన్ ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ పట్టుబడి దేశ బహిష్కరణ ఎదుర్కొంటున్న వారిలోనూ పాక్, బంగ్లా విద్యార్థులే అధికంగా ఉంటున్నారు. భారత్‌తో పోలిస్తే కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుకు ఖర్చు చాలా తక్కువ. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికెళ్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రకారం కిర్గిస్థాన్‌లో 14,500 మంది భారత విద్యార్థులున్నారు. దాడుల నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరపరిస్థితుల్లో సాయానికి 0555710041 నంబర్‌కు ఫోన్ చేయాలని కిర్గిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయం ట్వీట్ చేసింది. బిష్కెక్‌లో అలర్లు తగ్గి ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ ట్వీట్ చేశారు.



దాడిలో ధ్వంసమైన ఓ హాస్టల్ తలుపులు. గాయపడిన విద్యార్థి (ఇన్‌సెట్‌లో)



సెయింట్ రేగిస్ రెడ్ సీ రిసార్ట్‌లో మోడల్స్

## ఆధునిక పంథాలో సౌదీ

- తొలిసారి స్విమ్‌సూట్ ఫ్యాషన్ షో నిర్వహణ

న్యూఢిల్లీ, మే 18: ఛాందసవాద ఇస్లామిక్ దేశమైన సౌదీ అరేబియా.. కొంతకాలంగా ఆధునిక పంథాలో పయనిస్తోంది. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, ప్రగతిశీల ఆలోచనా ధోరణితో చేపట్టిన సంస్కరణలు, ఆ దేశాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్నాయి. తాజాగా మరో సంచలనానికి సౌదీ తెరతీసింది. మునుపెన్నడూ లేని విధంగా అక్కడ తొలిసారి 'స్విమ్ సూట్ ఫ్యాషన్' షో నిర్వహించారు. నిన్నమొన్నటిదాకా మహిళలు కళ్లు మినహా ఆపాదమస్తకం బురఖా(అబయా)లోనే కనిపించాలన్న నిబంధన ఉన్న సౌదీలో స్విమ్ సూట్లలో మోడళ్లు తళుకులీనారు. రెడ్ సీ ఫ్యాషన్ వీక్ పేరుతో సౌదీలోని పశ్చిమ తీరంలో సెయింట్ రేగిస్ రెడ్ సీ రిసార్ట్‌లో స్విమ్ సూట్ ఫ్యాషన్ షో శుక్రవారం ప్రారంభమైంది. మొరాకోకు చెందిన డిజైనర్ యాస్మినా క్వాంజాల్ ప్రత్యేకంగా మోడల్స్ కోసం ఎరుపు, బీజ్, నీలం రంగుల్లో స్విమ్ సూట్లను రూపొందించారు. మోడళ్లలో కొందరు భుజాలు, నడుం భాగాలు కనిపించేలా వన్ పీస్ సూట్లలో హొయలుపోయారు.

# 22,500 ఎగువకు నిఫ్టీ

## మళ్లీ 74,000 దాటిన సెన్సెక్స్

### రూ.412 లక్షల కోట్లకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్

ముంబై: స్టాక్ ఎక్స్ఛేంజీలు శనివారం నిర్వహించిన ప్రత్యేక ట్రేడింగ్‌లోనూ సెన్సెక్స్, నిఫ్టీ ర్యాలీ కొనసాగింది. ప్రత్యేక ట్రేడింగ్ రెండో సెషన్ ముగిసేసరికి, సెన్సెక్స్ 88.91 పాయింట్ల వృద్ధితో 74,005.94 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 35.90 పాయింట్లు పెరిగి 22,502 వద్ద క్లోజైంది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. సూచీలు లాభపడటం వరుసగా ఇది మూడో రోజు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

నెస్లే ఇండియా షేరు 2.33 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం పెరిగాయి. అన్ని రంగాల సూచీలు పాజిటివ్‌గా ముగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.412.37 లక్షల కోట్లకు చేరుకుంది. కాగా, ఈ వారంలో సెన్సెక్స్ 1,341.47 పాయింట్లు (1.84 శాతం), నిఫ్టీ 446.8 పాయింట్లు (2 శాతం) పుంజుకున్నాయి.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 74,620 ▲ | 68,400 ▲ | 96,500 ▲ |
| ముంబై | 73,383 ▼ | 67,219 ▼ | 86,373 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 19వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 550 | విజయవాడ | 540 |
| వరంగల్ | 552 | గోదావరి | 540 |
| చిత్తూరు | 628 | విశాఖపట్నం | 550 |
| | | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 150 | గోదావరి | 154 |
| వరంగల్ | 150 | విజయవాడ | 154 |
| కరీంనగర్ | 150 | గుంటూరు | 154 |
| మహబూబ్‌నగర్ | 152 | ఒంగోలు | 154 |
| కర్నూలు | 152 | చిత్తూరు | 160 |
| విశాఖపట్నం | 146 | | |

## ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఈ రంగాలు ముందుకే

**ప్రభుదాస్ లీలాధర్**

లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంతో సంబంధం లేకుండా ఎఫ్ఎంసీజీ, ఆటో, హెల్త్‌కేర్, ఐటీ సేవలు, ప్రైవేట్ బ్యాంక్‌లు, క్యాపిటల్ గూడ్స్ రంగాలు మెరుగైన పనితీరును కనబర్చనున్నాయని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ప్రభుదాస్ లీలాధర్ తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల ఫలితాల ప్రతికూల ప్రభావం నుంచి ఈ రంగాల షేర్లు రక్షణ కల్పించగలవని అభిప్రాయపడింది. తిరిగి ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే ఇన్‌ఫ్రా, రక్షణ, క్యాపిటల్ గూడ్స్, పునరుత్పాదక ఇంధనం, పర్యాటక రంగాలు మెరుగైన పనితీరు కనబరచనున్నాయని రిపోర్టులో ప్రస్తావించింది. గ్రామీణ మార్కెట్ గిరాకీ మళ్లీ పుంజుకుంటుడటంతో పాటు ఈసారి సాధారణ వర్షపాతం నమోదు కావచ్చన్న అంచనాలు వినియోగదారు వస్తువులు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల కంపెనీలకు ఊతమివ్వనున్నాయని ప్రభుదాస్ లీలాధర్ అంటోంది.

# ఎఫ్ అండ్ ఓ శాచెటైజేషన్‌ను పునఃపరిశీలించాలి..

**సీఈఏ అనంత నాగేశ్వరన్**



న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో గృహ పొదుపును పెట్టుబడిగా పెట్టడంపై ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ శాచెటైజేషన్‌ను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రత్యేక ఆర్థిక పరిజ్ఞానం అవసరమని శనివారం జరిగిన 'సీఐఐ వార్షిక బిజినెస్ సదస్సు 2024'లో అన్నారు. ప్రస్తుతం ఎఫ్ అండ్ ఓల్లో పెట్టుబడులు పెడుతున్నవారిలో చాలా మందికి వాటిపై పూర్తి అవగాహన లేదన్నారు. ఆర్థిక ఉత్పత్తులు లేదా సేవలను సామాన్యులకు చేరువ చేసేందుకు తక్కువ ధర లేదా పరిమాణంలో అందుబాటులోకి తేవడాన్నే శాచెటైజేషన్ అంటారు. ఉదాహరణకు, గతంలో పెద్ద సైజు ప్యాకింగ్‌లో మాత్రమే అందుబాటులో ఉండే షాంపూ ప్రస్తుతం రూపాయి, రూ.2కు విక్రయించే చిన్న సైజు శాచెట్లలోనూ లభిస్తున్నాయి. తద్వారా కంపెనీలు షాంపూ అందుబాటును విస్తృతం చేయగలిగాయి. సీఐఐ సదస్సులో నాగేశ్వరన్ ఇంకా ఏమన్నారంటే..

- మిగతా దేశాల్లోనూ ఆర్థిక రంగ అభివృద్ధి జాతీయాభివృద్ధిని విఎంచిపోయిన కథలేవీ సుఖాంతమవలేదు. 1997-98 నాటి ఆసియా సంక్షోభమే చాలా ముఖ్య ఉదాహరణ.
- ప్రపంచంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ లావాదేవీలు అత్యధికంగా నమోదవుతున్నది భారత్‌లోనేనని గర్వపడుతున్నప్పటికీ, ఇది పురోగతా లేదా ఆందోళనకు సంకేతమా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.
- గృహ పొదుపు ఉత్పాదక ప్రయోజనాల కోసం వినియోగించుకోగల రంగాల్లో క్యాపిటల్ మార్కెట్ వృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత ఆర్థిక సేవల రంగంపై ఉంది.

**ప్రభుత్వ డేటా ప్రకారం..**

గత మూడేళ్లలో కుటుంబ పొదుపు రూ.9 లక్షల కోట్లు తగ్గి 2022-23 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.14.16 లక్షల కోట్ల స్థాయికి పడిపోయింది. కాగా, 2020-21లో రూ.64,084 కోట్ల స్థాయిలో నమోదైన మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు.. మూడేళ్లలో దాదాపు మూడింతలై 2022-23 నాటికి రూ.1.79 లక్షల కోట్లకు చేరుకున్నాయి. షేర్లు, డిబెంచర్లలోకి పెట్టుబడిగా వచ్చిన గృహ పొదుపు దాదాపు రెండింతలైంది. 2020-21లో రూ.1.07 లక్షల కోట్ల స్థాయిలో ఉండగా.. 2022-23 నాటికి రూ.2.06 లక్షల కోట్లకు పెరిగింది. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పెరుగుతుండటంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ఈ మధ్యనే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విభాగంలో రిటైల్ ట్రేడింగ్‌పై పర్యవేక్షణ లేకపోతే మార్కెట్‌తోపాటు ఇన్వెస్టర్ల సెంటిమెంట్, గృహ ఆర్థిక వ్యవస్థకూ భవిష్యత్‌లో సవాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

'ఎఫ్ అండ్ ఓ'ల్లో పెట్టుబడులు పెడుతున్న వారిలో 90 శాతం మంది నష్టపోతున్నప్పటికీ ఈ విభాగ ట్రేడింగ్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతుండటం తనకు విస్మయం కలిగించిందని గత ఏడాది నవంబరులో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. సెబీ అధ్యయన నివేదిక ప్రకారం.. ఎఫ్ అండ్ ఓ సెగ్మెంట్లో ట్రేడింగ్ చేపడుతున్న 45.24 లక్షల మంది వ్యక్తిగత ఇన్వెస్టర్లలో కేవలం 11 శాతం మందే లాభాలు ఆర్జించగలిగారు. కొవిడ్ సంక్షోభ సమయంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌ను చేపట్టే రిటైల్ మదుపరుల సంఖ్య అసాధారణ స్థాయిలో పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 7.1 లక్షలుగా నమోదైన వీరి సంఖ్య ఏకంగా 500 శాతం పెరిగింది.

## తగ్గిన విమ్టా ల్యాబ్స్ లాభం

హైదరాబాద్: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన త్రైమాసికంలో విమ్టా ల్యాబ్స్ రూ.80.2 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.12.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2.6 శాతం తగ్గింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.322.30 కోట్ల ఆదాయంపై రూ.41 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.321.60 కోట్లుగా ఉండగా లాభం రూ.48.2 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం తర్వాత చివరి త్రైమాసికంలో మంచి రికవరీని సాధించినట్లు విమ్టా ల్యాబ్స్ ఎండీ హరిత వాసిరెడ్డి తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో అనుకోకుండా కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ 2024-25లో మంచి పనితీరును కనబరచవచ్చని అంచనా వేస్తున్నట్లు హరిత చెప్పారు.

## దొడ్ల డెయిరీ లాభంలో 108% వృద్ధి

హైదరాబాద్: దొడ్ల డెయిరీ లిమిటెడ్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ రూ.787.40 కోట్ల ఆదాయంపై రూ.46.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 8.7 శాతం (రూ.724.30 కోట్లు), లాభం ఏకంగా 107.9 శాతం (రూ.22.5 కోట్లు) పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.3,125.50 కోట్ల ఆదాయంపై రూ.166.70 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.2,812 కోట్లుగా ఉండగా లాభం రూ.122.30 కోట్లుగా ఉంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాలు (వీఏపీ) 16.3 శాతం వృద్ధి చెంది రూ.861.90 కోట్లుగా ఉన్నాయి.

2023-24లో కంపెనీ పాల సేకరణ, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తరించటంతో పాటు వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల (వీఏపీ)పై దృష్టి పెట్టడంతో ఆదాయం తొలిసారిగా రూ.3,000 కోట్ల మైలురాయిని అధిగమించిందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు.

# వడ్డీ మీద జీఎస్‌టీ చెల్లించాలా..?



ఇదీ GST

రాంబాబు గొండాల

ఒక జిల్లా కేంద్రంలో మూర్తి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ కంపెనీలకు సంబంధించిన ఏసీ, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు సహా ఇతర గృహోపకరణాలను విక్రయిస్తుంటాడు. ఆయా వస్తువులను కంపెనీల నుంచి కొనుగోలు చేసే క్రమంలో సాధారణంగా నగదు చెల్లించి తీసుకుంటాడు. ఒక సందర్భంలో తన షోరూమ్‌ను విస్తరించాలని, దానికి ఎక్కువగా స్టాక్ కావాలని భావించి ఆయా కంపెనీలను సంప్రదించగా అరువు మీద ఎక్కువ స్టాక్ ఇవ్వటానికి ఒప్పుకున్నాయి. మూడు నెలల్లో ఆ మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని, గడువు దాటితే వడ్డీకి అదనంగా పెనాల్టీ చెల్లించే విధంగా ఒప్పందం కుదిరింది. మూర్తి కొంత మొత్తాన్ని మూడు నెలల్లో చెల్లించాడు. మిగతా దానిని తర్వాత చెల్లించాడు. అనుకున్న విధంగా నిర్ణీత సమయంలో చెల్లించిన మొత్తానికి వడ్డీ, తరువాత చెల్లించిన మొత్తానికి వడ్డీతో పాటుగా పెనాల్టీ చెల్లించాడు. కానీ, తాను చెల్లించిన వడ్డీ, పెనాల్టీల మీద జీఎస్‌టీ కూడా చెల్లించాలని ఆయా కంపెనీలు అడగటంతో మూర్తి అవాక్కయ్యాడు. ఎందుకంటే తాను కొనుగోలు చేసినప్పుడు ఆయా వస్తువుల మీద జీఎస్‌టీ చెల్లించాడు. ఇప్పుడు వడ్డీ, పెనాల్టీల మీద కూడా జీఎస్‌టీ చెల్లించటమనేది తనకు అదనపు భారంగా పరిణమిస్తుంది.

నిజానికి మూర్తి లాగానే, వడ్డీ, పెనాల్టీల మీద కూడా జీఎస్‌టీ వర్తిస్తుందని చాలా మందికి తెలియదు. ఏదేనీ సరఫరా జరిగినప్పుడు ఎంత విలువ మీద పన్ను చెల్లించాలనే దానికి జీఎస్‌టీ చట్టంలో కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి. దీని ప్రకారం ఆ సరఫరాకు సంబంధించిన ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, కమీషన్ మొదలైనవి విలువలో కలిపి మొత్తం మీద పన్ను చెల్లించాలి. అలాగే జీఎస్‌టీ కాకుండా ఇతర పన్నులు, సెస్సులు కూడా విలువలో కలపాలి. ఆ సరఫరాకు సంబంధించిన వడ్డీ, పెనాల్టీ కూడా ఇదే కోవలోకి వస్తాయి. అంటే వడ్డీ, పెనాల్టీ కూడా సరఫరాదారుడు జీఎస్‌టీ వసూలు చేసి దానిని ప్రభుత్వానికి చెల్లించాలి. దీని మీద ఎంత శాతం జీఎస్‌టీ చెల్లించాలంటే, ఆ సరఫరా (అంటే వస్తువులు కావచ్చు లేదా సర్వీసులు కావచ్చు)కు ఎంత శాతం జీఎస్‌టీ వర్తిస్తుందో అంతే శాతం ఈ వడ్డీ, పెనాల్టీలకు కూడా వర్తిస్తుంది.

మరి అన్ని రకాల వడ్డీలకు జీఎస్‌టీ వర్తిస్తుందా అంటే లేదనే చెప్పాలి. పన్ను పరిధిలోకి వచ్చే సరఫరాలు జరిగినప్పుడే ఇది వర్తిస్తుంది. అంటే, బ్యాంకులకు సంబంధించిన రుణాలు, డిపాజిట్లు బయటి వ్యక్తులకు ఇచ్చే అప్పులకు సంబంధించిన వడ్డీ మీద ఈ జీఎస్‌టీ వర్తించదు. అయితే, క్రెడిట్ కార్డు సంస్థలు వసూలు చేసే వడ్డీ మీద మాత్రం జీఎస్‌టీ వర్తిస్తుంది. ఈ రోజుల్లో చాలా వ్యాపారాలు అప్పు ఆధారంగానే నడుస్తుంటాయి. పెద్ద పట్టణాలను విఎనహాయిస్తే ఇప్పటికీ మండల కేంద్రాల్లో ఉండే దుకాణాలు అరువు మీద వస్తువులను అమ్మటం, కొనుగోలు చేయటం చేస్తుంటాయి. కాబట్టి వ్యాపారస్తులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

## బ్యాంకింగ్ దిగ్గజం వాఘుల్ కన్నుమూత



ముంబై: బ్యాంకింగ్ రంగ దిగ్గజం, ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చైర్మన్ నారాయణన్ వాఘుల్ ఇకలేరు. 88 ఏళ్ల ఎన్ వాఘుల్ శనివారం మధ్యాహ్నం చెన్నైలోని అపోలో హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. ఇంట్లో జారి పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను రెండ్రోజుల క్రితమే ఆసుపత్రిలో చేర్చారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు సంతానం విదేశాల్లో స్థిరపడ్డారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం చెన్నైలో జరగనున్నాయి. ఆయన మృతిపట్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సహా బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

బ్యాంకింగ్ రంగానికి అందించిన విశేష సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం వాఘుల్‌ను 2010లో మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మ భూషణ్'తో సత్కరించింది. దేశీయ బ్యాంకింగ్ పరిశ్రమలో వాఘుల్ పలు నాయకత్వ పదవులను చేపట్టారు. ఐసీఐసీఐకి 1985 నుంచి 11 ఏళ్లపాటు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా వ్యవహరించారు. ఐసీఐసీఐని పబ్లిక్ ఫైనాన్స్ కంపెనీ నుంచి యూనివర్సల్ ప్రైవేట్ బ్యాంక్‌గా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే.

మద్రాస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వాఘుల్.. 1960 దశకంలో ఎస్‌బీఐలో ఆఫీసర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎస్‌బీఐలో ఉద్యోగం వీడి పుణెకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్‌లో పాఠాలు చెప్పే కొలువులో చేరారు. అనతికాలంలోనే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఎదిగారు. ఆ తర్వాత సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిరిగి బ్యాంకింగ్ రంగంలోకి పునఃప్రవేశం చేశారు. 1981లో బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎండీగా నియమితులయ్యారు. అప్పుడు ఆయనకు 44 ఏళ్లు. అంత చిన్న వయసులో ప్రభుత్వ రంగ బ్యాంక్ పగ్గాలు చేపట్టిన ఘనత కూడా వాఘుల్‌దే. ఆ తర్వాత ఐసీఐసీఐ సీఎండీగా బాధ్యతలు చేపట్టారు.





## ఆఖరాట ఆడేశాడా?

### మహీ ముద్ర ఎల్లవేళలా

పొట్టి క్రికెట్‌కు ఐపీఎల్ కేరాఫ్ అయితే..ఆ ఐపీఎల్‌కు వన్నె తెచ్చిన క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ. అధికారికంగా ప్రకటించకపోయినా మహీకి ఇదే చివరి ఐపీఎల్ అని భావిస్తున్నారు. 42 ఏళ్ల వయస్సులో..అందునా..టీ20 క్రికెట్‌లో కొనసాగడమంటే ఆషామాషీ కాదు. కానీ అటు కీపింగ్ ఇటు బ్యాటింగ్‌లోనూ ఏమాత్రం సత్తా తగ్గలేదు మహీకి. ఈ ఐపీఎల్‌లో యువ కీపర్లను మించి క్యాచ్‌లు అందుకోవడం, బ్యాటింగ్‌లో చివరన వచ్చి అలవోకగా సిక్సర్లు, ఫోర్లు కొట్టిన ధోనీని చూశాం. మరి అలాంటి ఆటగాడు ఐపీఎల్‌కు పర్యాయపదంగా మారడం అతిశయోక్తి కాదు. దేశంలో ఏ వేదికలో చెన్నై బరిలో దిగినా..స్టేడియం యావత్తు పుసుపుమయం అయిందంటే అది చెన్నై జట్టుకున్న క్రేజ్ కంటే.. మహీ మానియానే కారణమని వేరే చెప్పక్కర్లేదు. ఐపీఎల్ ఆవిర్భావం నుంచి (మధ్యలో సీఎస్‌కేపై నిషేధం విధించిన రెండేళ్లు మినహా.) లీగ్‌పై ఆటగాడిగా, సీఎస్‌కే కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు ధోనీ. ఈక్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించడం ఆటగాడిగా మహీ అందుకొన్న ఘనత. అందుకే..తమిళ తంబిలకు ధోనీ అంటే క్రేజ్..కాదు ప్రాణం. అలాంటి తమ ఆరాధ్య క్రికెటర్‌కు ఇదే చివరి ఐపీఎల్ అంటే డై హార్డ్ ఫ్యాన్స్ జీర్ణించుకోవడం కష్టమే. కానీ ఏ క్రికెటరైనా ఏదో ఒక సమయంలో రిటైర్ కావాల్సిందే. ఇప్పుడు మహీకి ఆ సమయం వచ్చేసినట్టే. వయస్సు కూడా పైబడుతోంది. ఏడాది మొత్తం పోటీ క్రికెట్ ఆడుతూ ఫిట్‌నెస్ కాపాడుకోవడం వేరు. కానీ సంవత్సరంలో రెండు నెలలు జరిగే టోర్నీకోసం ఫిట్‌గా ఉండడం మాటలు కాదు. కానీ నాలుగు పదులు పైబడినా మైదానంలో అంత చురుగ్గా కదులుతున్నాడంటే అది ధోనీకే చెల్లు. కానీ ఎల్లప్పుడూ అలా ఉండడం సాధ్యం కాదు కదా. గత ఏడాది మోకాలి గాయంతోనే ఐపీఎల్ ఆడడమేకాదు జట్టును చాంపియన్‌గానూ నిలిపాడు ధోనీ. ఆ గాయం పూర్తిగా మానలేదని, ఈసారీ అది మహీని బాధిస్తోందట. దీంతో అతడికిదే చివరి ఐపీఎల్ అని విశ్వసనీయ సమాచారం. రిటైరైనంత మాత్రాన ధోనీ చెన్నై జట్టును వీడకపోవచ్చు. కెప్టెన్ రుతురాజ్‌కు మార్గదర్శనం చేస్తూ, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుతూ ఐపీఎల్‌లో సీఎస్‌కేను తిరుగులేని జట్టుగా కొనసాగించడంలో తన ముద్రను అతడు సుదీర్ఘ కాలం కొనసాగించడం ఖాయం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

## తుది పోరుకు సాత్విక్ జోడీ




బ్యాంకాక్: భారత టాప్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్‌కు చేరుకొన్నారు. శనివారం జరిగిన సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-11, 21-12తో చైనీస్ తైపీకి చెందిన లు మింగ్ చె-టాంగ్ కై వి పై వరుస గేముల్లో అలవోకగా నెగ్గింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో చైనా జోడీ చెన్ బొ యంగ్-లు యితో సాత్విక్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది. 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో భారత జంట పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

## నిఖత్ పసిడి పంచ్



ఎలోర్డా కప్ బాక్సింగ్

అస్తానా (కజకిస్థాన్): వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఆమెతోపాటు మీనాక్షి కూడా పసిడి పతకంతో మెరిసింది. శనివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ రికార్డు స్థాయిలో 12 పతకాలు సాధించింది. జరీన్, మీనాక్షిగాక ఇద్దరు భారత బాక్సర్లు రజతాలు, ఎనిమిదిమంది కాంస్య పతకాలు గెలుపొందారు. గత ఏడాది ఇక్కడ మన బాక్సర్లు కేవలం ఐదు పతకాలే నెగ్గడం గమనార్హం. 52 కేజీల విభాగం ఫైనల్లో నిఖత్ 5-0తో ఝజీరా ఉరబయేవా (కజకిస్థాన్)ను చిత్తు చేసి టైటిల్ అందుకుంది. ఇక 46 కిలోల తుది పోరులో మీనాక్షి 4-1తో ఉజ్బెక్ బాక్సర్ రహమొనోవా సిదాహోన్‌పై గెలుపొంది విజేతగా నిలిచింది. అనామిక (50కి.), మనీషా (60కి.) టైటిల్ ఫైట్‌లో ఓటమితో రజత పతకానికి పరిమితమయ్యారు.

**నేటి మ్యాచ్‌లు**

| మ్యాచ్ | సమయం / వేదిక |
|---|---|
| సన్‌రైజర్స్ x పంజాబ్ | మ.3.30 వేదిక హైదరాబాద్ |
| రాజస్థాన్ x కోల్‌కతా | రాత్రి 7.30 వేదిక గువాహటి |

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 13 | 9 | 3 | 1 | 19 | 1.428 |
| రాజస్థాన్ | 13 | 8 | 5 | 0 | 16 | 0.273 |
| హైదరాబాద్ | 13 | 7 | 5 | 1 | 15 | 0.406 |
| బెంగళూరు | 14 | 7 | 7 | 0 | 14 | 0.459 |
| చెన్నై | 14 | 7 | 7 | 0 | 14 | 0.392 |
| ఢిల్లీ | 14 | 7 | 7 | 0 | 14 | -0.377 |
| లఖ్‌నవూ | 14 | 7 | 7 | 0 | 14 | -0.667 |
| గుజరాత్ | 14 | 5 | 7 | 2 | 12 | -1.063 |
| పంజాబ్ | 13 | 5 | 8 | 0 | 10 | -0.347 |
| ముంబై | 14 | 4 | 10 | 0 | 8 | -0.318 |

# చెన్నై ఇంటికి బెంగళూరు ముందుకు

## ప్లేఆఫ్స్‌కు డుప్లెసి సేన ● 27 పరుగులతో విజయం


విజయానందంలో సిరాజ్, డుప్లెసి, కోహ్లీ


బెంగళూరు: అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. వరుసగా ఆరు పరాజయాలతో ఇక ఇంటికే అనుకున్న ఈ జట్టు ఆ తర్వాత పోరాడితే పోయేదేమీ లేదనే తరహాలో చెలరేగింది. ఓటములను దిగమింగుతూ.. ఉత్కంఠభరిత పోరులో వరుసగా ఆరో విజయంతో వహ్వా అనిపించుకుంది. ఇక చెన్నై అర్హత సాధించేందుకు ఆఖరి ఓవర్‌లో 17 పరుగులే కావాల్సి ఉన్నా.. పేసర్ యష్ దయాల్ పొదుపైన బౌలింగ్‌కు చిత్తయ్యింది. దీంతో 27 పరుగులతో గెలిచిన డుప్లెసి సేన అంబరాన్నంటే సంబరాల్లో మునిగింది. చివరి ఐదు సీజన్లలో వీరికిది నాలుగో ప్లేఆఫ్స్. ఒకవేళ ఓటమి తేడా 18 రన్స్‌లోపే ఉంటే చెన్నై ముందుకెళ్లేది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగులు చేసింది. డుప్లెసి (39 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 54), కోహ్లీ (29 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 47), రజత్ పటీదార్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 41), గ్రీన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 38 నాటౌట్) వేగం కనబర్చారు. శార్దూల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడింది. రచిన్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), జడేజా (22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 నాటౌట్), రహానె (22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 33), ధోనీ (13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 25)ల పోరాటం సరిపోలేదు. యష్ దయాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డుప్లెసి నిలిచాడు.

**ఒత్తిడికి తలొగ్గి..:** ఛేదనలో చెన్నై ఆరంభమే సరిగా లేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే కెప్టెన్ రుతురాజ్‌ను మాక్స్‌వెల్ డకౌట్ చేయగా.. డారిల్ మిచెల్ (4)ను మూడో ఓవర్‌లో దయాల్ అవుట్ చేశాడు. ఈ దశలో ఓపెనర్ రచిన్, రహానె సమన్వయ ఆటతీరుతో ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ రిస్కీ షాట్లకు వెళ్లకుండా పరుగులు రాబట్టారు. ఆరో ఓవర్‌లో రచిన్ ఫోర్, రహానె రెండు ఫోర్లతో 15 పరుగులు వచ్చాయి. అయితే చక్కగా కుదురుకున్న ఈ జోడీని పదో ఓవర్‌లో ఫెర్గ్యూసన్ విడదీశాడు. రహానె వికెట్ కోల్పోవడంతో మూడో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఆర్‌సీబీ బౌలర్లు రన్స్‌ను కట్టడి చేయడంతో చెన్నై ఆట గతి తప్పింది. అయితే రచిన్ ధాటిని కనబరుస్తూ 12వ ఓవర్‌లో 4,6,6తో 19 రన్స్ రాబట్టడమే కాకుండా 30 బంతుల్లో తొలి ఫిఫ్టీని సాధించాడు. కానీ 13వ ఓవర్‌లో అతడు రనౌట్ కావడంతో గట్టి దెబ్బ పడింది. అటు శివమ్ దూబే (7) క్యాచ్ అవుట్ కావడంతో 119/5 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ వెంటనే శాంట్నర్ (3) క్యాచ్‌ను డుప్లెసి ఒంటి చేత్తో డైవ్ చేసి పట్టేశాడు. జడేజాకు జతగా 16వ ఓవర్‌లో ధోనీ క్రీజులోకి రావడంతో చెన్నై ఆశలు పెట్టుకుంది. అప్పటికి క్వాలిఫై అయ్యేందుకు 30 బంతుల్లో 72 రన్స్ కావాల్సింది. ఇద్దరూ వికెట్ కాపాడుకుంటూ అడపాదడపా బౌండరీలతో విజయానికి చేరువగా తెచ్చారు. క్వాలిఫైకి ఆఖరి ఓవర్‌లో 17 రన్స్ అవసరమవగా, ధోనీ తొలి బంతికి సిక్సర్‌తో జోష్ తెచ్చాడు. కానీ రెండో బంతికే తను అవుట్ కావడంతో పాటు పేసర్ దయాల్ 7 పరుగులే ఇవ్వడంతో చెన్నై కథ ముగిసింది.

**చివర్లో దూకుడు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ మెరుగ్గానే ఆడాడు. మధ్య ఓవర్లలో కాస్త వెనుకంజలో నిలిచినా.. ఆఖర్లో రజత్ పటీదార్-గ్రీన్ జోరుతో 200 స్కోరు దాటేసింది. అంతకుముందు ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి బౌండరీల జోరుకు తొలి మూడు ఓవర్లలోనే ఆర్‌సీబీ 30 పరుగులు సాధించింది. అయితే ఆ తర్వాత కురిసిన వర్షంతో 40 నిమిషాలపాటు ఆటకు అంతరాయం కలిగింది. అనంతరం పిచ్ మందకొడిగా మారడంతో ఆర్‌సీబీ కాస్త ఇబ్బందిపడింది. స్పిన్నర్ల ఓవర్లలో బౌండరీలు తగ్గిపోయాయి. ఈ దశలో ఒత్తిడికి లోనైన కోహ్లీ భారీ షాట్ ఆడేందుకు చూసి పదో ఓవర్‌లో శాంట్నర్‌కు దొరికిపోయాడు. దీంతో తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు డుప్లెసి ఎదురుదాడికి దిగి 11వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 20 పరుగులు రాబట్టాడు. 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన అతను 13వ ఓవర్‌లో అనూహ్యంగా రనౌటయ్యాడు. పటీదార్ ఆడిన షాట్ నేరుగా బౌలర్ శాంట్నర్ చేతిని తాకి నాన్‌స్ట్రయిక్ ఎండ్ వికెట్లను పడగొట్టింది. అప్పటికి డుప్లెసి బ్యాట్ గాల్లోనే ఉండడంతో నిరాశతో వెనుదిరిగాడు. ఈ స్థితిలో గ్రీన్, రజత్ పోటాపోటీ బౌండరీలతో స్కోరును గాడినపెట్టారు. డెత్ ఓవర్లలో వీరు మరింత జోరు చూపడంతో చెన్నై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. 18వ ఓవర్‌లో గ్రీన్ రెండు సిక్సర్లు బాదగా పటీదార్‌ను శార్దూల్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దినేశ్ కార్తీక్ (14) ఆరు బంతులే ఆడినా 6,4తో వేగం చూపాడు. ఇక చివరి ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్న మ్యాక్స్‌వెల్ (16) క్యాచ్ అవుటయ్యాడు. ఓవరాల్‌గా ఆఖరి ఐదు ఓవర్లలోనే బెంగళూరు 80 పరుగులు చేయడం విశేషం.

**1** ఐపీఎల్‌లో రెండుసార్లు 700+ రన్స్ సాధించిన ఆటగాడిగా గేల్‌తో సమంగా నిలిచిన కోహ్లీ. అలాగే తాజా సీజన్‌లో ఎక్కువ సిక్సర్లు (37) బాదిన ఆటగాడిగానూ నిలిచాడు.

## హార్దిక్‌పై మ్యాచ్ నిషేధం



ముంబై: స్లో ఓవర్ రేట్ కారణంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఓ మ్యాచ్ నిషేధం, రూ.30 లక్షల జరిమానా విధించారు. జట్టు ఆటగాళ్లపైనా తలో రూ.12 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత (ఏది తక్కువైతే అది) విధించారు. సీజన్‌లో ముంబై జట్టు మూడుసార్లు ఈ తప్పిదానికి పాల్పడడంతో ఐపీఎల్ అడ్వయిజరీ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో వచ్చే సీజన్‌లో ముంబై ఆడే తొలి మ్యాచ్‌కు హార్దిక్ అందుబాటులో ఉండడు.

**స్కోరుబోర్డు**

**బెంగళూరు:** కోహ్లీ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 47, డుప్లెసి (రనౌట్) 54, పటీదార్ (సి) మిచెల్ (బి) శార్దూల్ 41, గ్రీన్ (నాటౌట్) 38, కార్తీక్ (సి) ధోనీ (బి) దేశ్‌పాండే 14, మ్యాక్స్‌వెల్ (సి) ధోనీ (బి) శార్దూల్ 16, లోమ్రోర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 218/5; వికెట్ల పతనం:** 1-78, 2-113, 3-184, 4-201, 5-218; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-49-1, శార్దూల్ 4-0-61-2, తీక్షణ 4-0-25-0, శాంట్నర్ 4-0-23-1, జడేజా 3-0-40-0, సిమర్‌జీత్ 1-0-19-0.

**చెన్నై:** రుతురాజ్ (సి) యశ్ (బి) మ్యాక్స్‌వెల్ 0, రచిన్ (రనౌట్) 61, మిచెల్ (సి) కోహ్లీ (బి) యశ్ 4, రహానె (సి) డుప్లెసి (బి) ఫెర్గ్యూసన్ 33, శివమ్ దూబే (సి) ఫెర్గ్యూసన్ (బి) గ్రీన్ 7, జడేజా (నాటౌట్) 42, శాంట్నర్ (సి) డుప్లెసి (బి) సిరాజ్ 3, ధోనీ (సి) స్వప్నిల్ (బి) యశ్ 25, శార్దూల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 191/7; వికెట్ల పతనం:** 1-0, 2-19, 3-85, 4-115, 5-119, 6-129, 7-190; **బౌలింగ్:** మ్యాక్స్‌వెల్ 4-0-25-1, సిరాజ్ 4-0-35-1, యశ్ దయాల్ 4-0-42-2, స్వప్నిల్ 2-0-13-0, కర్ణ్ శర్మ 1-0-14-0, ఫెర్గ్యూసన్ 3-0-39-1, గ్రీన్ 2-0-18-1.

# సుచిత్రలో ఉద్రిక్తత

## 1.11 ఎకరాల విషయమై వివాదం.. మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు

- వివాదాస్పద స్థలం వద్దకు కోర్టు పత్రాలతో 16 మంది
- షెడ్లు, సీసీ కెమెరాల తొలగింపు.. ప్రహరీలో కొంత ధ్వంసం
- అప్పటికప్పుడు రేకులతో ప్రహరీ
- అల్లుడు, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కొడుకు భద్రారెడ్డితో మల్లారెడ్డి రాక
- ఇరువర్గాల మధ్య తోపులాట
- కాంగ్రెస్ అండతోనే ఇదంతా: మల్లారెడ్డి
- ఆ భూమి మాదే: బాధితులు


వివాదం నెలకొంది ఈ స్థలం విషయంలోనే

పేట్‌బషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల రెవెన్యూ పరిధిలోని సుచిత్ర ప్రాంతంలోని 1.11 ఎకరాల భూవివాదంలో గొడవకు సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని.. ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు. సర్వేనంబరు 82, 83లోని ఈ భూమి మాది అంటూ శ్రీనివాస్ రెడ్డి, మరో 15 మంది కలిసి శనివారం తెల్లవారుజామున కోర్టు పత్రాలను వెంటబెట్టుకొని వచ్చారు. అక్కడున్న ఆటో షెడ్లు, సీసీ కెమెరాలు తీసేశారు. ప్రహరీని ఓ వైపు కూల్చేశారు. 1.11ఎకరాల భూమి పరిధి మేరకు వారంతా రేకులతో ప్రహరీని ఏర్పాటు చేశారు. అందులో టెంట్ వేసుకొని కూర్చున్నారు. విషయం తెలిసి మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కుమారుడు భద్రారెడ్డి, అనుచరులతో కలిసి స్థలం వద్దకొచ్చారు. శ్రీనివాస్‌రెడ్డి ఇతర వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న రేకుల ప్రహరీ, టెంట్‌ను తన అనుచరులతో కలిసి కూల్చేశారు. ఇరువర్గాల మధ్య తోపులాటలతో ఆ ప్రాంతమంతా యుద్ధ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహంతో పలువురిపై చేయి చేసుకున్నారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు ఆధ్వర్యంలో ఏడు పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆయన అనుచర వర్గాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అండతోనే శ్రీనివాస్ రెడ్డి తన అనుచరవర్గంతో వచ్చి ప్రహరీని కూల్చి, షెడ్లను నేల మట్టం చేశారని మల్లారెడ్డి మండిపడ్డారు. తాము సుచిత్రలోని సర్వే నంబరు 82,83ల్లో అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి 2.20 ఎకరాలను దూల్‌చంద్ సిల్క్ పరిశ్రమ యాజమాన్యం నుంచి కొన్నామని చెప్పారు. ఈ స్థలం కోసం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ 8నెలల క్రితం తమ వద్దకు వచ్చారని, తమకు సంబంధించిన వారి భూమి మీ అధీనంలో ఉందని చెప్పారని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తాము భూమి మీదికి పోతే అప్పట్లో మంత్రిగా మల్లారెడ్డి బెదిరించారని, ఇప్పుడు కూడా మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కలిసి తన అనుచరులతో వచ్చి దాడి చేశారని శ్రీనివాస్‌రెడ్డి, ఆయన వర్గీయులు ఆరోపించారు. సర్వే నంబర్ 82లో పట్టదారుగా ఉన్న సుదమా వద్ద తాము 1.11 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, ఆ భూమిని 15మందిమి 400గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకొని 2016 వరకు పొజిషన్‌లో ఉన్నామని తెలిపారు. తాము సేల్‌డీడ్ చేసుకున్నామని, ఏడీ సర్వే, రెవెన్యూ సర్వే చేసి మల్లారెడ్డికి 1.29 గుంటలు ఉందని హద్దులను కూడా అప్పట్లో ఏర్పాటు చేశారు. మా హద్దులో మేము బ్లూషీట్స్‌ను ఏర్పాటు చేసుకున్నామని, వాటిని తొలగించారని చెప్పారు. సీఎం, పోలీసులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. తమకు కోర్టు అను కూలంగా తీర్పు ఇచ్చిందంటూ కాగితాలను మీడియాకు చూపించారు. కాగా మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆయన వర్గీయులపై కేసు నమోదు చేశామని, ఇరువర్గాలను అదుపులోకి తీసుకొన్నామని, అంతా స్టేషన్‌లోనే ఉన్నారని ఏసీపీ రాములు తెలిపారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోందని, నివేదిక వచ్చాక ఉన్నతాధికారులకు, పోలీసులకు అందజేస్తామని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ చెప్పారు.



# ధరణిలో 76 కొత్త మాడ్యూల్స్!

- అన్నీ తప్పుల సవరణకు సంబంధించినవే
- జూన్ 4 వరకు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం
- పరిశీలించినవి తక్షణమే క్లియర్.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- సమావేశంలో ధరణి కమిటీ నిర్ణయాలు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులపై ధరణి కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ధరణి స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన 2.45 లక్షల దరఖాస్తుల పరిష్కారానికి జూన్ 4వరకు గడువు విధించింది. ఇప్పటి వరకు గుర్తించిన 119 తప్పులను సరిదిద్దేందుకు ధరణి పోర్టల్‌లో కొత్తగా మరో 76 మాడ్యూల్స్ తీసుకురావాలని కమిటీ సిఫార్సు చేసింది. శనివారం సచివాలయంలో ధరణి కమిటీ కన్వీనర్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ అధ్యక్షతన సభ్యులు మాజీ సీసీఎల్ఏ రేమండ్ పీటర్, కోదండరెడ్డి, మధుసూదన్, భూ చట్టాల నిపుణులు సునీల్, సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి ప్రత్యేక సమావేశం అయ్యారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పలు కీలక సూచనలు చేసింది. ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మరోసారి గుర్తుచేస్తూ, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు మొదలు పెట్టాలని అధికారులకు సూచించింది. ఈ దరఖాస్తులను పరిష్కరించేందుకు దాదాపు 76 కొత్త మాడ్యూల్స్‌ను జారీచేయాలని కమిటీ తేల్చి చెప్పింది. 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించగా, 1.45 లక్షల దరఖాస్తులకు సంబంధించిన పరిశీలనను అధికారులు పూర్తి చేశారు. వీటిని అప్రూవ్, లేదా రిజెక్ట్ చేసేందుకు సంబంధిత నివేదికలను సైతం సిద్ధం చేశారు. మార్చి 16న లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ రావడంతో ధరణి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్లు ఆపేశారు. మిగిలిన లక్షకుపైగా దరఖాస్తులను ఇంకా పరిశీలించాల్సి ఉంది. వీటి పరిశీలనకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాలని కమిటీ పేర్కొంది. ఇప్పటికే పరిశీలించిన వాటిని వెంటనే క్లియర్ చేయాలని కమిటీ సూచించింది. ధరణి పెండింగ్ సమస్యలను జూన్ 4వ తేదీలోపు పరిష్కరించాలని కమిటీ అధికారులకు గడువు విధించింది. రెవెన్యూ యంత్రాగం వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంది. నిషేధిత జాబితా, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, భూదాన్

భూముల ఆక్రమాలను గుర్తించి వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సక్సెషన్, పార్టిషన్, నాలా కోసం, పెండింగ్ నాలా, మ్యుటేషన్, ఎన్ఆర్ఐ పట్టాదార్ పాస్‌బుక్. గ్రీవెన్స్ రిలేటెడ్ ల్యాండ్ మ్యాటర్, ఆర్గనైజేషన్ పట్టాదార్ పాస్‌బుక్, కోర్టు కేసు ఇన్‌టిమేషన్, నాలాకన్వర్షన్, డూప్లికేట్ పాస్ బుక్, జీపీఏ కొరకు అప్లికేషన్, సెమీ అర్బన్ ల్యాండ్ పట్టాదార్ పాస్‌బుక్, కోర్టు కేసు ద్వారా పట్టాదార్ పాస్‌బుక్‌లు, విత్ పాస్‌బుక్ నాలా, విత్‌అవుట్ పాస్‌బుక్‌నాలా, ఆధార్ సీడింగ్, గ్రీవెన్స్ రిలేటెడ్ టూ ల్యాండ్ మ్యాటర్, గ్రీవిన్స్ రిలేటెడ్ టూ రాంగ్ ఇంక్లూడింగ్ ఇన్ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ, ఖాతా మర్జిన్ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించాలని పేర్కొంది. అంతే కాకుండా ఇప్పటికే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వివరాలను సేకరించాలన్నారు. వీటి పరిష్కారంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది.



# ఆర్టీసీ బస్సులు, సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించం

- టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులపై, సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేదే లేదని టీఎస్ఆర్టీసీ ఎండీ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ సిబ్బందిపై జరిగిన దాడులపై యాజమాన్యం చాలా సీరియస్‌గా ఉందన్నారు. దాడులు చేస్తున్నవారిపై కేసులు పెట్టడంతో పాటు నష్టాన్ని రికవరీ చేసే చర్యలు కూడా చేపడుతున్నట్టు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకుని నిత్యం దాదాపు 55 లక్షలమంది మహిళలు ఆర్టీసీలో ప్రయాణిస్తున్నట్టు వివరించారు. ఈ పథకం ద్వారా ఇబ్బంది పడుతున్నామని ఆటోవాళ్లు చెబుతున్నారని, దీని దృష్టిసారించిన ప్రభుత్వం రానున్న రోజుల్లో వాళ్ల సమస్యలను కూడా పరిష్కరిస్తుందని తెలిపారు.

# రైతు రాజ్యమంటే మోసం చేయడమేనా?: వినోద్

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రైతు రాజ్యం అంటే రైతుల్ని మోసం చేయడమేనా అని సీఎం రేవంత్ రెడ్డిని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో రైతుబంధు ఇస్తారో, రైతు భరోసాతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు రూ.15 వేలు ఇస్తారో ముఖ్యమంత్రి స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వం జూన్ మొదటి వారంలో రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సైబర్ నేరగాడి వలలో ఎమ్మెల్యే!

- ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శినంటూ ఫోన్
- 3.60 లక్షలు ఖాతాలో వేయించుకున్న నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): ఓ సైబర్ నేరగాడి వలకు ఏకంగా ఓ ఎమ్మెల్యేనే చిక్కాడు! తాను ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శినంటూ ఫోన్ చేసిన వ్యక్తి చెప్పిదంతా సావధానంగా వినేసి, అతడు చెప్పినట్లుగా రూ.3.60 లక్షలను ఖాతాలో వేశాడు! డీసీపీ కవిత వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇటీవల ఒక ఎమ్మెల్యేకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోనొచ్చింది. తాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎమ్మెల్యేతో పరిచయం చేసుకున్న ఆవలి వైపు వ్యక్తి, తొందర్లోనే ముఖ్యమంత్రి ఒక కొత్త రుణపథకాన్ని ప్రారంభించబోతున్నారని చెప్పారు. ఆ పథకం కింద వందల మందికి రూ. లక్షల్లో రుణాలు ఇవ్వాలని నిర్ణయించారని, ఎమ్మెల్యేకు ఆయన కోటా కింద 100 మందికి రుణాలు అందేలా తాను చూస్తానని చెప్పాడు. ఇందుకుగాను మనిషికి రూ.3,600 చొప్పున కమిషన్ ఇస్తే పని పూర్తవుతుందని నమ్మించాడు. అతడి మాటలను నమ్మిన ఎమ్మెల్యే వెనుకా ముందు ఆలోచించకుండా మొత్తం రూ. 3.60లక్షలను అతడు చెప్పిన ఖాతాలో జమ చేశారు. తర్వాత సదరు గుర్తుతెలియని వ్యక్తి స్పందించడం మానేశాడు. అనుమానించిన ఎమ్మెల్యే తన వ్యక్తిగత కార్యదర్శి ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలతో రంగంలోకి దిగిన సీఐ రాజు బృందం.. నిందితుడు తోట బాలాజీ నాయుడు అలియాస్ మల్లారెడ్డి అలియాస్ దాసరి అనిల్ కుమార్‌ను అరెస్టు చేశారు. ఇప్పటి వరకు ఇతడిపై తెలంగాణ, ఏపీలో 37 కేసులున్నట్లు విచారణలో తేలింది. 2008లో ఎన్పీడీసీఎల్ రామగుండంలో ఏఈగా పనిచేసిన బాలాజీ 2009లో ఓ ఎమ్మెల్యే పీఏ నుంచి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

# పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే పనులు

- సమ్మెకు దిగిన బల్దియా కాంట్రాక్టర్లు
- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై నిరసన
- శనివారం నుంచే పనులకు దూరం

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): బల్దియా కాంట్రాక్టర్లు సమ్మెబాట పట్టారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో జీహెచ్ఎంసీ అధికారుల వైఖరిని నిరసిస్తూ పోరుకు దిగారు. ఇప్పటికే ఇచ్చిన డెడ్‌లైన్ (ఈనెల 18)లోగా బకాయిలు చెల్లించాలని కొన్ని నెలల క్రితం జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో నిర్వహణ పనులను నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో జీహెచ్ఎంసీ కార్యాలయంలో శనివారం సమావేశమైన కాంట్రాక్టర్లు.. బిల్లులు చెల్లించే వరకూ పనులకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. దీంతో రానున్న వర్షాకాలం పనులపై సర్వత్రా ఆందోళన నెలకొంది. గ్రేటర్ పరిధిలోని రోడ్లు, డ్రెయినేజీలు, నాలాలు, విద్యుత్ స్తంభాలు, తదితర నిర్వహణ పనులను జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే రహదారుల నిర్మాణం, మరమ్మతు, నాలాల రిటైనింగ్ వాల్ నిర్మాణం, పూడికతీత, ఇతరత్రా నిర్వహణ పనులకు సంబంధించి వారికి రావాల్సిన దాదాపు రూ.1350 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, వేతనాలు, అప్పుల వాయిదాల చెల్లింపునకు అవస్థలు పడుతోన్న బల్దియా.. కాంట్రాక్టర్ల బకాయిలను దీర్ఘకాలికంగా పెండింగ్‌లో పెట్టింది. ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చిలో, ఎర్లీ బర్డ్‌తో ఏప్రిల్‌లో జీహెచ్ఎంసీకి రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చినా.. కాంట్రాక్టర్లకు బకాయిలు ఇవ్వలేదు. అయితే గత ఏడాది మార్చి నుంచి తమకు రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా చితికిపోతున్నామని వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షాకాలం నేపథ్యంలో ఇబ్బందులు..

వర్షాకాలం సీజన్ నేపథ్యంలో ప్రతి ఏటా జూన్ 1 నుంచి అక్టోబరు వరకు జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తుంటుంది. అయితే ఈ పనులనూ చేయొద్దని కాంట్రాక్టర్ల అసోసియేషన్ తాజాగా నిర్ణయించింది. కాగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నగరం నీట మునిగి జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. పూడికతీతలు లేకపోవడంతో చాలాచోట్ల నాలాల్లో నీరు నిలిచిపోయి రోడ్లపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళ్లడంతో వానాకాలంలో చేపట్టాల్సిన పనులపై ఆందోళన నెలకొంది.

# 5 రోజుల పాటు భారీ వర్షాలు

- 22న అల్పపీడనం.. నేడు ఎల్లో అలెర్ట్
- వారం పాటు వాతావరణం చల్లగానే..
- పలు జిల్లాల్లో వర్షం.. తడిసిన ధాన్యం
- హైదరాబాద్ లింగంపల్లిలో 6.8 సెం.మీ
- పిడుగుపాటుకు ఇద్దరి మృతి..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


హైదరాబాద్ ఎల్బీనగర్-చింతలకుంట హైవేపై ప్రవహిస్తున్న వరదనీరు


రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో తడిసిన ధాన్యాన్ని రాశులుగా పోస్తున్న రైతులు

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 22న నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయని.. ఇది బలపడి 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగిన ఉపరితల ఆవర్తనం.. శనివారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. ఈ ద్రోణి కారణంగా రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశముందని వివరించింది. శుక్రవారం రాయలసీమ, పరిసర ఉత్తర తమిళనాడు ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమైన ఆవర్తనం శనివారం బలహీనపడినట్లు వెల్లడించింది. ఆది, సోమ వారాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆదివారం దాదాపు అన్ని జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ యెల్లో అలెర్ట్ జారీ చేసింది. అల్పపీడన ప్రభావంతో 25 వరకూ వాతావరణం చల్లగానే ఉంటుందని వివరించింది.

### పలు జిల్లాల్లో భారీ వర్షం..

రాష్ట్రంలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల్లోపే నమోదవగా.. మధ్యాహ్నం నుంచి పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలు చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. హైదరాబాద్ పరిధిలోని లింగంపల్లిలో అత్యధికంగా 6.8 సెం.మీ, రామచంద్రాపురంలో 5.8 సెం.మీ, సూర్యాపేట జిల్లా నడిగూడెంలో 6 సెం.మీ, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 5.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వానలతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లలో భారీ వర్షం కురిసింది. బాలానగర్, రాజాపూర్ మండలాల్లో భారీ వర్షం కురవగా.. నవాబ్‌పేట, భూత్పూర్ మండలాల్లో మోస్తరు వాన పడింది. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ, యాచారం మండల్లాలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులతో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు దుక్కి దున్ని విత్తనాలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### పిడుగులు పడి ఇద్దరి మృతి..

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనాజీపురం గ్రామానికి చెందిన గొర్రెలకాపరి మట్టపల్లి వెంకన్న(55) దోసపాడు శివారులో గొర్రెలు మేపుతుండగా పిడుగుపాటుతో మృతి చెందాడు. ఖమ్మం జిల్లా మధిర మండలం రామచంద్రాపురంలో పిడుగుపాటుకు రైతు సంపసాల కృష్ణ మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జేత్యాతండాలో పిడుగుపడటంతో.. 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా కాపరి తావురియాకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే వేములపల్లి మండలం ఆమనగల్లులో పిడుగుపడి మరో గొర్రెల కాపరి బయ్య వెంకన్న కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

# అపార్టుమెంట్ల పేరుతో మోసం

## తక్కువ ధరకే ఫ్లాట్లు అంటూ ప్రచారం.. ప్రీ లాంచ్ ఆఫర్ పేరిట వసూళ్లు

- పలువురి నుంచి 60కోట్ల సేకరణ
- ఆపై ముఖం చాటేసిన సంస్థ
- బిల్డింగ్ కడతామన్న స్థలం విక్రయం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- భారతి బిల్డర్స్ ప్రతినిధుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): అతితక్కువ ధరకే ఫ్లాట్లు ఇస్తామంటూ భారతి బిల్డర్స్ యజమానులు ఘరానా మోసానికి పాల్పడ్డారు. వందల మంది నుంచి రూ.60 కోట్ల డబ్బు వసూలు చేసి.. బిల్డింగ్ కడతామన్న స్థలాన్నే అమ్మేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో భారతి బిల్డర్స్ చైర్మన్, ఎండీ, సీఈవోను సైబరాబాద్ ఈవోడబ్ల్యూ (ఆర్థిక నేరాల విభాగం) పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దూపాటి నాగరాజు చైర్మన్‌గా, ముల్పూరి శివరామకృష్ణ ఎండీగా, తొడ్డాకుల నరసింహారావు సీఈవోగా 2021లో భారతి బిల్డర్స్ పేరుతో మాదాపూర్‌లో ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీని ప్రారంభించారు. కొంపల్లిలో 6 ఎకరాల 23 గుంటల భూమిని సేకరించారు. అక్కడ భారతి లేక్ వ్యూ పేరుతో రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు కట్టాలని నిర్ణయించారు. ముందుగా ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారికి రూ.3,200కు ఒక చదరపు అడుగు చొప్పున విక్రయిస్తామని ప్రీ లాంచ్ ఆఫర్‌ను ప్రకటించారు. తమ అనుచరుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. సుమారు 350 మంది నుంచి అడ్వాన్సుల పేరుతో రూ.50-60 కోట్లు సేకరించారు. డబ్బులు చేతికి రాగానే స్పందించడం మానేశారు. అంతేకాదు.. అపార్టుమెంట్లు కట్టడం అటుంచి.. కొంపల్లిలో అపార్టుమెంట్ల నిర్మాణం కోసం సేకరించి పెట్టుకున్న 6 ఎకరాల 23 గుంటల భూమిని వేరే వ్యక్తులకు రూ.100 కోట్లకు విక్రయించేశారు. ఎప్పటికీ అపార్టుమెంట్ ఊసే లేకపోయేసరికి కస్టమర్లకు అనుమానం వచ్చింది. డబ్బులు చెల్లించిన వారిలో టీపీఎస్ ప్రసాదరావు సహా పలువురు బాధితులు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో ఆర్థిక నేరాల విభాగం పోలీసులు రంగంలోకి దిగారు. డీసీపీ కె.ప్రసాద్ పర్యవేక్షణలో పూర్తి వివరాలు సేకరించి భారతి బిల్డర్స్ చైర్మన్, ఎండీ, సీఈవోలను అరెస్టు చేశారు. ప్రీ లాంచ్ ఆఫర్ అనగానే వెనకా ముందూ చూడకుండా డబ్బులు చెల్లించి మోసపోవద్దని, నమ్మకమైన నిర్మాణ సంస్థను ఎంచుకొని నిర్మాణం పూర్తయిన అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయాలని, మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సీపీ అవినాష్ మహంతి ప్రజలకు సూచించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 19 మే 2024

# దశాబ్దాల కలయిక

అభిమానులు ఎంతగానో ఎదురుచూసిన కాంబినేషన్స్...
ఇక కుదరదేమో అని ఆశలు వదులుకున్న కలయికలు...
అభిమాన కాంబోలో ఇక మరో సినిమా రాదేమో అనే సంశయాలు...
అన్నింటినీ పటాపంచలు చేస్తూ దశాబ్దాలుగా సాధ్యం కాని కాంబినేషన్లను 2024 సెట్ చేసింది.



## 32 ఏళ్లు



రజనీకాంత్, అమితాబ్‌బచ్చన్... ఇద్దరు దేశం గర్వించదగ్గ నటులు. ఈ ఇద్దరూ స్ర్కీన్ పంచుకుంటే చూడాలని ఎవరికి ఉండదు! 32 ఏళ్ల క్రితం ఈ కాంబోలో 'హమ్' అనే హిందీ చిత్రం వచ్చింది. ఆ తర్వాత మరోసారి వీరి కాంబినేషన్‌లో సినిమాకోసం చాలా ప్రయత్నాలు జరిగినా అవేవీ కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇన్నాళ్లకు 'వేట్టయాన్' చిత్రంతో ఇద్దరూ కలసి అభిమానుల ముందుకొస్తున్నారు. 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే అమితాబ్ ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో రజనీకాంత్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తుండగా అమితాబ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్నారని సమాచారం. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'అంధాకానూన్', 'గిరాఫ్తార్' చిత్రాలు వచ్చాయి. 'వేట్టయాన్'లో రానా, ఫహాద్ ఫాజిల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

## 35 ఏళ్లు

దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ అంటే కమల్‌హాసన్, మణిరత్నందే అని చెప్పాలి. వీరిద్దరి కలయికలో వచ్చిన ఒకే ఒక చిత్రం 'నాయకుడు'. ఆ సినిమా ఓ సంచలనం. ఈ కాంబినేషన్లో అలాంటి మరో సినిమా కోసం అప్పటి నుంచి ప్రేక్షకులకు ఎదురుచూస్తూనే ఉన్నారు. 35 ఏళ్లు గడిచిపోయాయి 'నాయకుడు' విడుదలైన సమయంలో మూడు పదుల్లో ఉన్నవాళ్లు ఇప్పుడు వృద్ధులయ్యారు. కానీ మణిరత్నం-కమల్ కాంబినేషన్‌లో మరో సినిమా మాత్రం మొదలవ్వలేదు. 'ఇది అయ్యే పనికాదులే' అని ఫ్యాన్స్ కూడా ఆశలు వదిలేసుకున్న సమయంలో అనూహ్యంగా మణిరత్నం, కమల్‌హాసన్ కలసి ఓ సినిమా ప్రకటించారు. 'థగ్‌లైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేసి శరవేగంగా చిత్రీకరణ కూడా చేస్తున్నారు. ఇన్నాళ్లూ తమ కలయికలో సినిమా రాకపోవడానికి కారణం కేవలం సరైన కథ కుదరకపోవడమేనని వారు చెబుతున్నారు. ఒకరికి నచ్చిన కథ మరొకరికి నచ్చకపోవడం, ఇద్దరికీ నచ్చినా ఆ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించలేకపోవడం వల్ల ఇన్నాళ్లుగా సినిమా చేయలేకపోయామనేది వారి మాట. 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో కమల్‌హాసన్‌ను తీసుకోవాలనుకున్నా కుదరలేదని మణిరత్నం చెప్పారు. లేట్ అయినా లేటెస్ట్‌గా వస్తున్న ఈ సినిమాను కమల్‌హాసన్ సొంత ప్రొడక్షన్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. శింబు, జయం రవి, త్రిష ప్రధాన తారాగణం. ఏ. ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

## 25 ఏళ్లు

దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, టాప్ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా కలయికలో వచ్చిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో హుషారైన గీతాలతో హోరెత్తించిన విషయం మర్చిపోలేం. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఐదు చిత్రాలు మ్యూజికల్ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. 'మెరుపు కలలు' చిత్రంతో మరోసారి వారిద్దరూ మ్యాజిక్ రిపీట్ చేశారు. ఆ సినిమా విడుదలై 25 ఏళ్లు దాటింది. ఇన్నాళ్లకు మళ్లీ రెహమాన్, ప్రభుదేవా కలయిక కుదరింది. మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి వీరిద్దరి పేర్లు కలసి వచ్చేలా 'ఏఆర్ఆర్‌పీడీ' అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. నృత్యం, సంగీతం ప్రధానంగా రూపొందుతోన్న చిత్రమిది.




## 28 ఏళ్లు



'ఇండియన్ (తెలుగులో 'భారతీయుడు')' మూవీ అప్పట్లోనే పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించింది. అవినీతి పరులను అంతం చేసే సేనాపతి పాత్రలో కమల్ నటనకు, శంకర్ దర్శకత్వ ప్రతిభకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. 'ఇండియన్' తర్వాత దాదాపు మూడు దశాబ్దాల వరకూ వీరిద్దరూ మళ్లీ కలసి ఒక్క సినిమా కూడా చేయలేకపోయారు. ఇప్పుడు కూడా తమ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' చిత్రం సీక్వెల్‌తోనే వస్తున్నారు. 2017లో 'ఇండియన్ 2' చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. 2019లో షూటింగ్ మొదలుపెట్టారు. తర్వాత కొవిడ్ వల్ల రెండేళ్లు బ్రేక్ వచ్చింది. సెట్‌లో ప్రమాదం జరిగి సహాయ దర్శకుడు చనిపోవడం ఇలా ఎన్నో అవాంతరాలను దాటుకొని 'ఇండియన్ 2' చిత్రం షూటింగ్‌ను ఎట్టకేలకు పూర్తి చేశారు. ఇంకో రెండునెలల్లో సినిమా విడుదలవుతోంది.

## 20 ఏళ్లు



నటులుగా 50 సినిమాలు చేయడమే గొప్ప అలాంటిది మోహన్‌లాల్, శోభన జంట ఏకంగా 55 సినిమాల్లో కలసి నటించారు. వారిద్దరూ స్ర్కీన్‌పై కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకలోకం మంచి విజయాన్ని అందించింది. అందుకే మోహన్‌లాల్, శోభన కలసి ఇన్ని సినిమాలు చేయగలిగారు. 1985లో వచ్చిన 'అవిడతే పోలే ఇవిడెయుమ్' చిత్రంలో వారిద్దరూ కలసి తొలిసారి నటించారు. చివరగా 1994లో వచ్చిన 'తేన్మావిన్ కొంబాట్'లో కలసి కనిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో సినిమాలకు బ్రేక్ పడి 20 ఏళ్లు అయింది. మధ్యలో ఓ చిత్రంలో శోభన అతిథి పాత్రలో కనిపించారు కానీ మోహన్‌లాల్ సరసన హీరోయిన్‌గా నటించలేదు. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరూ జంటగా ఓ మలయాళ చిత్రం చేస్తున్నారు. 'ఎల్ 360' టైటిల్‌తో తెరకెక్కుతోంది. తరుణ్‌మూర్తి దర్శకత్వం వహిస్తున్నారు.

# పూజా హెగ్డేకు రూ. నాలుగు కోట్లా?



ముంబైలోని కొత్త ఇంట్లోకి ఇటీవలే అడుగుపెట్టిన పూజా హెగ్డెకు ఇప్పుడు ఓ బంపర్ ఆఫర్ వచ్చింది. తమిళంలో హీరో సూర్య నటించే 44వ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఈ సినిమా ప్రారంభం కానుంది. ఇందులో నటించేందుకు పూజా తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలుసా? అక్షరాలా రూ. నాలుగు కోట్లు. బాపురే.. సినిమాలు లేకుండా ఇంట్లో ఖాళీగా కూర్చున్న ఈ పొడుగు కాళ్ల సుందరికి ఇంత భారీ పారితోషికమా అని ఆశ్చర్యపోకండి. అదంతే అలా కలసి వచ్చింది. తన కెరీర్‌లో ఇంత భారీ పారితోషికం తీసుకోవడం పూజాకు ఇదే ప్రథమం. ఇంతకు ముందు తమిళ సూపర్‌స్టార్ విజయ్ సరసన 'బీస్ట్' చిత్రంలో పూజా హీరోయిన్‌గా నటించింది కానీ ఆ సినిమా పెద్దగా ఆడలేదు. కాకపోతే ఆ చిత్రంతో తమిళనాట ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకుంది పూజా.

# ఆ నాలుగూ అలా మిస్ అయ్యాయి




'హీరామండీ' చిత్రంలో మల్లికాజాన్ పాత్రను అద్భుతంగా పోషించి మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు మనీషా కొయిరాలా. ఈమధ్య నటిగా ఆమె వెనకపడిందనే ప్రచారాన్ని తిప్పికొట్టి 'హీరామండీ'లో తన టాలెంట్ మరోసారి ప్రదర్శించారు. మనీషా పేరు చెప్పగానే '1942 .. ఏ లవ్‌స్టోరీ', 'బొంబాయి' వంటి చిత్రాలు వెంటనే గుర్తుకు వస్తాయి. కెరీర్ ఉన్నతస్థాయిలో ఉన్నప్పుడు మద్యానికి బానిస అయి, అవకాశాలు పోగొట్టుకున్న మనీషా క్యాన్సర్ బారిన పడి, కోలుకున్నారు. ఆమె చేజేతులా వదులుకున్న చిత్రాలను కరీనా కపూర్ దక్కించుకుని స్టార్ హీరోయిన్‌గా ఎదిగారని వింటే ఆశ్చర్యం కలగక మానదు. ఆ చిత్రాలు ఏమిటో చూద్దాం. క్లాసిక్ కామెడీ 'బీవీ నంబర్‌వన్'లో సల్మాన్‌ఖాన్ సరసన నటించడం కోసం జూహీ చావ్లా, ఐశ్వర్య రాయ్, రవీనా టాంటన్, మనీషా కొయిరాలా పేర్లు పరిశీలించారు. వీళ్లంతా 'నో' చెప్పడంతో చివరకు కరీనాకు ఆ అవకాశం దక్కింది. ఆ తర్వాత షారుఖ్ ఖాన్ నటించిన 'దిల్ తో పాగల్ హై' సినిమాలో నిషా పాత్రను పోషించమని దర్శకుడు యశ్ చోప్రా అడిగారు. అయితే అందులో మరో హీరోయిన్ కూడా ఉంటుందని చెప్పడంతో కనీసం కథ కూడా వినకుండానే నటించనని చెప్పేశారు మనీషా. ఈ పాత్ర కూడా కరీనా చేజిక్కించుకుంది. సినిమా పెద్ద హిట్ కావడంతో ఎందుకు వద్దన్నానా అని తర్వాత చాలా బాధ పడ్డారు మనీషా. అలాగే అమీర్ ఖాన్ నటించిన 'రాజా హిందుస్థానీ' సినిమా కూడా మిస్ అయ్యారు మనీషా. ఇందులో హీరోయిన్ పాత్రకు ఎంతో ఇంపార్టెన్స్ ఉండడంతో టాప్ హీరోయిన్లు జూహీ చావ్లా, ఐశ్వర్య రాయ్, మనీషా కొయిరాలా ను సంప్రదించారు దర్శకుడు ధర్మేష్ దర్శన్. ఎవరూ అంగీకరించలేదు. ఈ సినిమా కూడా కరీనా ఖాతాలో పడింది. శ్యామ్ బెనగల్ దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న 'జుబేదా' చిత్రంలో హీరోయిన్ పాత్రకు మొదట మనీషానే సంప్రదించారు. మనోజ్ వాజ్‌పేయి సరసన నటించడానికి ఆమె వెనుకడుగు వేయడంతో కరిష్మా కపూర్‌కు ఆ ఛాన్స్ దక్కింది.

## ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు





| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | |
| టఫెస్ట్ ఫోర్సెస్ ఆన్ ది ఎర్త్ | డాక్యూ సిరీస్ | మే 22 |
| అట్లాస్ | హాలీవుడ్ మూవీ | మే 24 |
| క్ర్యూ | హిందీ చిత్రం | మే 24 |
| **అమెజాన్ ప్రైమ్** | | |
| ద టెస్ట్ 3 | వెబ్‌సిరీస్ | మే 23 |
| **జీ 5** | | |
| వీర్ సావర్కర్ | హిందీ చిత్రం | మే 24 |
| **డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** | | |
| ది కర్దాషియన్స్ 5 | వెబ్‌సిరీస్ | మే 23 |
| ద బీచ్ బాయ్స్ | డాక్యుమెంటరీ మూవీ | మే 24 |
| **లయన్స్ గేట్ ప్లే** | | |
| వాంటెడ్ మాన్ | హాలీవుడ్ మూవీ | మే 24 |
| **జియో సినిమా** | | |
| ఆక్వామాన్ అండ్ ద లాస్ట్ కింగ్‌డమ్ | తెలుగు డబ్బింగ్ | మే 21 |
| డ్యూన్ 2 | హాలీవుడ్ మూవీ | మే 21 |
| **ఆపిల్ టీవీ ప్లస్** | | |
| ట్రైయింగ్ 4 | వెబ్‌సిరీస్ | మే 22 |






# అందరికీ తెలియాల్సిన చాంపియన్ కథ



కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా నటిస్తున్న క్రీడానేపథ్య చిత్రం 'చందు ఛాంపియన్'. కబీర్‌ఖాన్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించారు. క్రీడాకారుడు మురళీ కాంత్ పేట్కర్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. జూన్ 14న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం గ్వాలియర్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సైనికుడిగా, మల్లయోధుడిగా, బాక్సర్‌గా విభిన్న పాత్రల్లో కార్తీక్ ఆర్యన్ ఒదిగిన తీరు ఆకట్టుకుంది. అనేక అడ్డంకులను దాటుకొని చందు బాక్సింగ్‌లో ఛాంపియన్‌గా ఎదిగిన తీరును ట్రైలర్ క్లుప్తంగా కళ్లకు కట్టింది. 'మురళీ కాంత్ పేట్కర్ లాంటి గొప్ప దేశభక్తుడు, సాహసి జీవితం నాకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది. ఆయన కథను భారతీయుల ముందుకు తేవాలనుకున్నాను. ఇది ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం' అని కార్తీక్ ఆర్యన్ చెప్పారు.

# ఏకలవ్య కథ

**మహాభారత సముద్రంలో ఏకలవ్యుని కథ ఒక చిన్న అల లాంటిది. అయినా ఏకలవ్యుడు అందరి మనసులో ముద్ర వేసుకున్నాడంటే దానికి కారణం.. పట్టుదలకి, గురుభక్తికీ ప్రతీకగా అతని పేరు నిలిచిపోవడమే.**

### దాసరి దర్శకత్వం.. శోభన్‌బాబు హీరో



ఏకలవ్యుడు కథ ను సినిమాగా తీయాలనే ఆలోచన దర్శకుడు దాసరి నారాయణరావుకు ఉండేది.. అంతవరకూ ఆయన ఏ పౌరాణిక చిత్రము తీయకపోవడంతో, ఆరుద్ర చెప్పిన కథ నచ్చి ఏకలవ్య తీయడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఆయన దర్శకత్వంలో అప్పటికే 'రాధమ్మ పెళ్లి', 'స్వర్గం నరకం' చిత్రాలను నిర్మించిన ఎంకే మావుళ్ళ య్య, రామ తారకం, భాస్కరరావు 'ఏకలవ్య' చిత్రానికి నిర్మాతలు. ఎన్టీఆర్ తో శ్రీకృష్ణుడు, ద్రోణుడు పాత్రలను వేయించి, బాలకృష్ణతో ఏకలవ్య పాత్ర చేయించాలని వీరి ఆలోచన. రెండు పాటలు కూడా రికార్డ్ చేశారు. దాసరి సూచనపై ఎన్టీఆర్ ను కలిశారు నిర్మాతలు. ఆ సమయంలో 'దాన వీర శూర కర్ణ' చిత్ర నిర్మాణ సన్నాహాల్లో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. వీళ్ల వచ్చిన విషయం చెప్పగానే ' మేము ఒక పౌరాణిక చిత్రం చేస్తున్నప్పుడు మరో సినిమా గురించి ఆలోచించం' అని చెప్పారాయన. పోనీ బాలకృష్ణ డేట్స్ ఇవ్వండని నిర్మాతలు అభ్యర్థించారు 'వారు ఇప్పుడు చదువుకుంటున్నారు. సెలవుల్లో మాత్రమే మాకు సినిమాలు చేస్తున్నారు. ఇప్పట్లో బాలయ్యను బయట నిర్మాతలకు ఇవ్వదలుచుకోలేదు' అని చెప్పేశారు ఎన్టీఆర్.

ఆ తర్వాత హీరో కృష్ణ దగ్గరికి వెళ్లి డేట్స్ అడుగుదామనుకున్నారు ఈ నిర్మాతలు. కానీ ఆ సమయంలో ఆయన చాలా బిజీగా ఉండటంతో ఆలోచన మార్చుకుని శోభన్ బాబు దగ్గరికి వెళ్ళారు. ఆయన ఛాతీ మీద వెంట్రుకలు బాగా ఉంటాయి. ఏకలవ్యుని గెటప్ కోసం టాప్ లెస్ గా కనిపించాలి కనుక ఆ వెంట్రుకలు తీసేయాలి. ప్రతిరోజూ అదో పెద్ద పని కనుక శోభన్ బాబు ఆ సినిమా చేయమన్నారు. అయితే నిర్మాతలు అభ్యర్థించడంతో చివరికి అంగీకరించారు. హీరో ఓకే కావడంతో హీరోయిన్‌గా ఎవరిని తీసుకోవాలా అని ఆలోచించి జయప్రదను సంప్రదించారు. ఆమె పారితోషికం బాగా డిమాండ్ చేసినా దాసరి డైరెక్టర్ అని తెలియడంతో రూ. 40 వేలకు నటించడానికి ఓకే చెప్పారు. శ్రీకృష్ణుని పాత్రకు రామకృష్ణ ను ఎంపిక చేశారు. షూటింగ్ ప్రారంభించే ముందు బడ్జెట్ వేశారు. కె.రాఘవేంద్రరావు తొలి సినిమా 'బాబు' అప్పటికి రూ 18 లక్షలతో తొలికాపీతో సిద్ధమైంది. అందులోనూ శోభన్ బాబు హీరో. అదే చాలా ఎక్కువ బడ్జెట్ అని అనుకునేవారు. ఏకలవ్య బడ్జెట్ దాన్ని దాటే సూచనలు కనిపించడంతో నిర్మాతలు ఆలోచనలో పడ్డారు. ఇలా చర్చల్లో ఉన్న సమయంలోనే వేరే సినిమా అర్జెంటుగా చేయాల్సి రావడంతో దాసరి ఏకలవ్య సినిమా పక్కన పెట్టేశారు చివరకు హీరో కృష్ణతో సహజకవి ఎమ్మెస్‌రెడ్డి 'ఏకలవ్య' చిత్రాన్ని నిర్మించి విడుదల చేశారు.

# మహేశ్‌కు విలన్ ఇతనేనా?



మహేశ్, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపుదిద్దుకొనే చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. యాక్షన్ అడ్వంచరెస్ కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ సినిమాను ఏ లోకేషన్స్‌లో షూట్ చేయాలో రాజమౌళి ఫిక్స్ అయినట్లు సమాచారం. ఈ చిత్రానికి 'మహారాజ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల ఎంపిక కూడా జరుగుతోంది. ఇందులో విలన్‌గా మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారనే వార్త ఫిల్మ్ నగర్‌లో ప్రచారంలో ఉంది. ఇప్పటికే రాజమౌళి పృథ్వీరాజ్‌ను సంప్రదించారనే, ఆయన వెంటనే ఓకే చేశారనీ చెబుతున్నారు. మలయాళంలో పృథ్వీరాజ్ స్టార్ హీరో కనుక అక్కడ తమ సినిమాకు ఆయన ఇమేజ్ ఎంతో హెల్ప్ అవుతుందని రాజమౌళి టీమ్ భావిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 'సలార్' చిత్రంలో అద్భుతంగా నటించి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న పృథ్వీరాజ్ మహేశ్ చిత్రంలో విలన్‌గా నటిస్తే మాములుగా ఉండదని అంటున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 19 మే 2024

# ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు**
- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

**కోల్‌కతా, నవీ ముంబై సెంటర్లలోని ప్రోగ్రామ్‌లు - సీట్లు**
- ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీ) - నవీ ముంబైలో 15 సీట్లు; కోల్‌కతాలో 12 సీట్లు
- బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీ) - నవీ ముంబైలో 22 సీట్లు; కోల్‌కతాలో 33 సీట్లు
- డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ - నవీ ముంబైలో 35 సీట్లు; కోల్‌కతాలో 35 సీట్లు
- డిప్లొమా(ఒకేషనల్ రీహాబిలిటేషన్) - నవీ ముంబైలో 25 సీట్లు; కోల్‌కతాలో 30 సీట్లు
- డిప్లొమా(ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్) - నవీ ముంబైలో 30 సీట్లు ఉన్నాయి.

**నోయిడా సెంటర్:** డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రోగ్రామ్‌లో 35 సీట్లు ఉన్నాయి.

**సీఆర్‌సీ సెంటర్లు**
- దావణ్‌గిరి సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఐడీడీ 35 సీట్లు; హెచ్ఐ 35 సీట్లు ఉన్నాయి.
- నెల్లూరు సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో హెచ్ఐ 35 సీట్లు ఉన్నాయి.
- రాజ్‌నంద్‌గావ్ సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఐడీడీ ప్రోగ్రామ్ ఉంది.

**అర్హత:** బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

**ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.



- **దరఖాస్తు ఫీజు:** డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.200(దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది); నవీ ముంబైలో ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.1300 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.900 చెల్లించాలి. కోల్‌కతా సెంటర్లో ఎంఈడీ ప్రోగ్రామ్‌నకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.1500 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.1100; బీఈడీ ప్రోగ్రామ్‌నకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.1300 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.900 చెల్లించాలి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్- జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

# తెలంగాణ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ - ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ సంస్థల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎన్‌సీవీటీ విధానంలో కోర్సులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ట్రేడ్‌ను అనుసరించి కోర్సు వ్యవధి ఏడాది/రెండేళ్లు. అభ్యర్థులు తాము ఎంచుకొన్న ఐటీఐ సంస్థలు, ట్రేడ్‌ల ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తులో సూచించాలి. అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. క్రాఫ్ట్‌మన్ ట్రెయినింగ్ స్కీమ్ కింద శిక్షణ ఇస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ ట్రెయినింగ్, థియరిటికల్ ట్రెయినింగ్, ట్రేడ్ థియరీ, వర్క్‌షాప్ క్యాలిక్యులేషన్ & సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఉంటాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది. ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు వెబ్ ఆప్షన్స్ సబ్మిట్ చేయాలి.



**ట్రేడ్‌లు:** కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్, డ్రాఫ్ట్‌మన్(సివిల్, మెకానికల్), డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండరీమన్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(కెమికల్ ప్లాంట్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, లేబరేటరీ అసిస్టెంట్(కెమికల్ ప్లాంట్), లిథో ఆఫ్‌సెట్ మెకానిక్ మైండర్, మెషినిస్ట్(గ్రిండర్), మెషినిస్ట్, మెకానిక్(మోటార్ వెహికిల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఆటోబాడీ పెయింటింగ్ 20, ఆటో బాడీ రిపేర్, డీజిల్), ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, స్యూయింగ్ టెక్నాలజీ, షీట్ మెటల్ వర్కర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్(ఇంగ్లీష్), టర్నర్, వెల్డర్, వైర్‌మన్.

**అర్హత:** ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

**ముఖ్య సమాచారం**
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **వెబ్‌సైట్:** https://iti.telangana.gov.in

# శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ

చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.



**స్పెషలైజేషన్‌లు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్

**అర్హత:** సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్ట్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.


**ఎంపిక:** ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**ముఖ్య సమాచారం**
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

## పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీలో

# పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్‌టీవీయూ)- ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఇవి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు రెండు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పోటీపడవచ్చు.



## ఎంవీఎస్సీ

**సీట్లు:** మొత్తం 33 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. వెటర్నరీ సైన్స్ విభాగాల్లో 16, యానిమల్ సైన్స్ విభాగాల్లో 13, యానిమల్ బయోటెక్నాలజీ విభాగాల్లో 4 సీట్లు ఉన్నాయి. యానిమల్ హజ్‌బెండ్రీ విభాగంలో ఇన్ సర్వీస్ అభ్యర్థుల కోసం అదనంగా 10 సీట్లు కేటాయించారు.

**వెటర్నరీ సైన్స్ విభాగాలు:** వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ గైనకాలజీ, వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, వెటర్నరీ పాథాలజీ, వెటర్నరీ మైక్రోబయాలజీ, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీ, వెటర్నరీ పబ్లిక్ హెల్త్ అండ్ ఎపిడిమియాలజీ

**యానిమల్ సైన్స్ విభాగాలు:** యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, వెటర్నరీ సైకాలజీ, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, వెటర్నరీ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ ఎడ్యుకేషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్

**యానిమల్ బయోటెక్నాలజీ విభాగాలు:** వెటర్నరీ బయోకెమిస్ట్రీ, వెటర్నరీ బయోటెక్నాలజీ

**అర్హత:** ఐకార్/వీసీఐ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పది పాయింట్ల స్కేల్ మీద కనీసం 6 ఓజీపీఏ తప్పనిసరి. రెగ్యులర్ అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 40 ఏళ్లు; ఇన్ సర్వీస్ అభ్యర్థులకు 45 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** సంబంధిత విభాగంలో ఐకార్-ఏఐఈఈఏ(పీజీ) 2023 ర్యాంక్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.

## పీహెచ్‌డీ

**సీట్లు:** మొత్తం 9 సీట్లు ఉన్నాయి. వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ పాథాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీల్లో ఒక్కోదానిలో ఒక సీటు; వెటర్నరీ న్యూట్రిషన్‌లో 2 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** పీవీఎన్‌ఆర్‌టీవీయూ/ఎస్‌వీవీయూ/ఏపీఏయూ/అంగారు నుంచి లేదా ఐకార్ గుర్తింపు పొందిన యూనివర్సిటీల నుంచి మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. డిగ్రీ స్థాయిలో బీవీఏస్సీ/బీవీఎస్సీ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** ఐకార్-ఏఐసీఈ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ) 2023 ర్యాంక్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కౌన్సెలింగ్:** జూన్ 5
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూన్ 6
- **వెబ్‌సైట్:** tsvu.edu.in

# ఐఐఎస్సీలో బీటెక్

## (మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

**ఎంపిక:** 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **కౌన్సెలింగ్:** జూలై 5
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/MathandComputing/

# చిట్టి

## ఉప్పు కషాయం!

ఒక ఊరిలో ఓ ఆసామి ఉండేవాడు. డబ్బున్నవాడు. ఆయనకు కొడుకు, కూతురు ఉండేవారు. కొడుక్కు పెళ్లి సంబంధాలు చూశాడు. ధనికులైన అమ్మాయి వద్దనుకున్నాడు. అందుకే తన కొడుకు సాధారణ మధ్యతరగతి అమ్మాయిని కోడలి పిల్లగా తెచ్చుకున్నాడు. కోడలు కనీసం ఇంట్లో పనులైనా చేస్తుందని.



ఆసామి భార్య, కూతురు ఎప్పటినుంచో ఉన్నారు కాబట్టి వారిద్దరి ఆలోచనలు. పరాయి ఇంటినుంచి వచ్చిన కోడలికి ప్రతిదీ వింత సమస్యగా ఉండేది. ఏ పని చేయాలో అర్థం అయ్యేది కాదు. 'ఈ ఇంటి పని ఎప్పుడు అర్థం చేసుకుంటావో' అని నసిగేవాళ్లు. కొడుకు మాత్రం 'ముగ్గురు ఒకేచోట ఉంటే ఇంతే' అని అనుకునేవాడు. ఆ ఇంట్లో అంతా అవకతవకల పని ఉండేది. దీంతో ఆసామికి కోపమొచ్చేది. అయితే పూర్వకాలంలో పిల్లలు విడిగా ఉండటం నేరంగా భావించేవారు కాబట్టి తన కొడుకు అక్కడే ఉండిపోయాడు.

ఒకరోజు ఆసామి ఇంటికి కోడలు పిల్ల తండ్రి వచ్చాడు. మర్యాదలు చేశారు. అత్త మాత్రం నీళ్లకోసం బయటకు వెళుతూ 'ఎప్పటిలానే మర్చిపోవద్దు- ఆ కూరలో ఉప్పేయటం మర్చిపోవద్దు' అన్నది. అలానే అత్తయ్య అన్నది కోడలు. ఆసామి కూతురు మాత్రం గేదెల పాకలోకి పనిమీద వెళ్లింది. అక్కడ పిడకలు కొట్టింది. వేగంగా వచ్చి 'ఈ పిల్ల ఉప్పేసిందో లేదో'నని గుప్పెడు ఉప్పు వేసింది. ఆమె పనిలోకి వెళ్లిపోయింది మళ్లీ. 'అసలే మనకు ఇబ్బందులు. ఆ ఉప్పు మర్చిపోరాదని ఉప్పు వేసింది. ఆహా మంచి పని చేశా' అనుకుంది కోడలుపిల్ల.

ఆ తర్వాత బయటికి నీళ్లకోసం వెళ్లిన అత్త పొయ్యిని చూసింది. పప్పు ఉడుకుతోంది. ఉప్పు వేసేవారు లేరని ఉప్పేసింది. ఆ తర్వాత పప్పు చేశారు. ఆసామి అతిథిని పిలిచాడు. ఇద్దరూ కూర్చున్నారు. వెంటనే కోడలు పిల్ల తండ్రి రుచి చూస్తూనే 'ఉప్పు వేయలేదే' అన్నాడు. 'నేను వేశా ఉప్పు' అంటూ ముగ్గురూ అన్నారు. ఆసామి రుచి చూశాడు. ఇది ఉప్పు కాషాయం అని గట్టిగా అరిచాడు. ఎవరి పనులు వాళ్లు చేయాలి. మీ ముగ్గురి మధ్య స్నేహం లేదు. ముందు అది చూసుకోండి. పని విభజించుకోండి అని గట్టిగా అరిచాడు. ఆ తర్వాత తప్పు జరగలేదు.

**సరైన నీడ ఏది?**







**10 తేడాలు గుర్తించండి**

**దారి కనుక్కోండి**



**డైలీ సుడోకు - 311**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 9 | | 7 | | | | 4 |
| | | 5 | 6 | | 3 | 2 | | |
| | 3 | | | 9 | 5 | | | |
| 7 | | | | 8 | 1 | | 5 | |
| | 9 | | | | | | 4 | |
| | 2 | | 9 | 6 | | | | 1 |
| | | | 8 | 5 | | | 1 | |
| | | 7 | 1 | | 2 | 8 | | |
| 1 | | | | 3 | | 4 | | |

**సుడోకు - 310 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 8 | 5 | 6 | 9 | 7 | 1 | 2 | 3 |
| 7 | 9 | 6 | 3 | 2 | 1 | 5 | 8 | 4 |
| 1 | 3 | 2 | 5 | 4 | 8 | 9 | 7 | 6 |
| 6 | 7 | 3 | 4 | 1 | 2 | 8 | 9 | 5 |
| 8 | 4 | 1 | 9 | 6 | 5 | 7 | 3 | 2 |
| 5 | 2 | 9 | 8 | 7 | 3 | 6 | 4 | 1 |
| 9 | 5 | 8 | 1 | 3 | 4 | 2 | 6 | 7 |
| 2 | 6 | 4 | 7 | 5 | 9 | 3 | 1 | 8 |
| 3 | 1 | 7 | 2 | 8 | 6 | 4 | 5 | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.